ప్రజా కలం
Digital Editions
http://prajakalam.com
epaper.prajakalam.com
paperboy.com
www.magzter.com

epaper.prajakalam.in
www.prajakalam.in

ప్రజా కలం

PRAJA KALAM Telugu Daily తెలుగు దినపత్రిక

Published From Nizamabad

PRGI No.TELTEL/2010/33275

ప్రజా కలం
PRAJA KALAM Telugu Daily
Classifieds & Public Notice Advertising
5 Lines Rs.250 only
క్లాసిఫైడ్స్ సంప్రదించండి
9010972526

బుధవారం | 19-08- 2026 | సంపుటి: 17, సంచిక: 137, నిజామాబాద్, పేజీలు: 12, వెల: 3/- | ◆ ఎడిటర్: కలకొండ రామకృష్ణ ◆

ఎల్‌నినో వేళ ప్రతి నీటి చుక్కకూ

లెక్క ఉండాలి

తాగునీటికే తొలి ప్రాధాన్యం... పంటలకూ భరోసా కల్పించాలి

ఆశలపై కాదు... అందుబాటులోని జలాల ఆధారంగానే విడుదల నిర్ణయాలు

కృష్ణా బేసిన్‌లో 76.63 శాతం.. గోదావరి బేసిన్‌లో 68.1 శాతం నిల్వలు

- నాగార్జునసాగర్‌లో 164 టీఎంసీల నీరు
- ఇంకా 47 శాతం వరద జలాలకు అవకాశం
- సింగూరు మరమ్మతులకు అత్యధిక ప్రాధాన్యం
- అంతర్రాష్ట్ర జల వివాదాలపై పటిష్ట వాదనకు సమగ్ర కార్యాచరణ
- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

హైదరాబాద్, ఆగస్టు 18 (ప్రజాకలం) :

ఆకాశం వైపు ఆశగా చూడటం ఒక్కటే జల నిర్వహణ కాదు... ఆనకట్టలో ఎంత నీరుంది, అందులో నిజంగా వినియోగించగలిగేది ఎంత, తాగునీటికి ఎంత కాపాడాలి, నిలువునా ఉన్న పంటకు ఎంత అందించగలం అన్న ప్రతి లెక్కలో శాస్త్రీయత, వాస్తవికత ఉండాలని రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో మిగిలిన వర్షాకాలంపై అనిశ్చితి కొనసాగుతున్నందున "తాగునీటి భద్రతకు తొలి ప్రాధాన్యం... అదే సమయంలో అందుబాటులో ఉన్న నీటితో ఖరీఫ్ పంటలకు గరిష్ఠ రక్షణ" అనే సూత్రంతో ముందుకు సాగాలని అధికార యంత్రాంగాన్ని ఆదేశించారు. మంగళవారం జలసౌధలో రాష్ట్రంలోని జలాశయాల నీటిమట్టాలు, ప్రవాహాలు, మిగిలిన ఖరీఫ్ సీజన్‌కు సాగునీటి అవకాశాలపై మంత్రి ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు.

తరువాయి 2వ పేజీలో...

పెట్టుబడిదారులకు

స్వర్గధామం తెలంగాణ

క్లీన్ ఎనర్జీ మ్యానుఫాక్చరింగ్ హబ్‌గా రాష్ట్రాన్ని తీర్చిదిద్దుతాం: డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

పెట్టుబడిదారులు, ఆవిష్కర్తలు, శాస్త్రవేత్తలు, సీఈఓలకు పూర్ణహృదయంతో ఆత్మీయ ఆహ్వానం

2035 నాటికి 26,000 మెగావాట్ల సోలార్, 8,000 మెగావాట్ల విద్యుత్ నిల్వ సామర్థ్యమే లక్ష్యం

హైటెక్స్‌లో 'ఇండియా ఎనర్జీ సమ్మిట్ & ఎక్స్ పో 2026'ను ప్రారంభించిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

హైదరాబాద్, ఆగస్టు 18 (ప్రజాకలం) :

తెలంగాణ రాష్ట్రం అన్ని రకాల పెట్టుబడిదారులను ప్రోత్సహించే స్వర్గధామమని, క్లీన్ ఎనర్జీ రంగానికి నిలయంగా రాష్ట్రాన్ని తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ ధ్యేయమని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రకటించారు. హైదరాబాద్‌లోని హైటెక్స్, నోవాటెల్ లో రెండు రోజుల పాటు జరగనున్న 'ఇండియా ఎనర్జీ సమ్మిట్ & ఎక్స్ పో 2026'ను మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సమ్మిట్ కు విచ్చేసిన పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులు, ఆవిష్కర్తలు మరియు సాంకేతిక నిపుణులను ఉద్దేశించి డిప్యూటీ సీఎం ప్రసంగించారు.

"పెట్టుబడిదారులు, ఆవిష్కర్తలు, శాస్త్రవేత్తలు, సీఈఓలు... మీ అందరినీ ఆహ్వానిస్తున్నాను, రండి. తెలంగాణ అన్ని రకాల పెట్టుబడిదారులను ప్రోత్సహించే రాష్ట్రం, ఇది పెట్టుబడిదారులకు ఒక స్వర్గధామం. మన సమృద్ధిని పంచుకోవడానికి మరియు కలిసి ఎదగడానికి మిమ్మల్ని పూర్ణహృదయంతో ఆహ్వానించడానికి ఈ రాష్ట్రం సిద్ధంగా ఉంది" అని భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు. ఇంధన రంగంలో మార్పు అనేది కేవలం విద్యుత్ ఉత్పత్తి మూలాన్ని మార్చడం మాత్రమే కాదని, అది సమగ్ర ఆర్థిక వ్యవస్థ నిర్మాణాన్నే మార్చే విప్లవాత్మక ప్రక్రియ అని ఆయన వ్యాఖ్యానించారు.

తరువాయి 2వ పేజీలో...

అన్యాక్రాంతమైన ప్లాట్లు...

లబ్ధిదారుల పాట్లు

- కక్కిరాలపల్లిలో పేదల ఇళ్ల స్థలాలపై గందరగోళం..
- అధికారుల నిర్లక్ష్యంతో అతి తెలివి ప్రదర్శించిన స్థానిక నాయకులు
- సమగ్ర విచారణ జరపాలని గ్రామస్తుల వేడుకోలు

అయినవోలు, ఆగస్టు 17:
(ప్రజాకలం ప్రత్యేక కథనం)

అప్పట్లో నిరుపేదలకు సొంతింటి కల నెరవేర్చాలనే ఉద్దేశంతో ప్రభుత్వం కేటాయించిన ఇళ్ల స్థలాలు నేడు గందరగోళానికి కేంద్రంగా మారుతున్నాయన్న ఆరోపణలు కక్కిరాలపల్లి గ్రామంలో వినిపిస్తున్నాయి. 1989-90 లో అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం సర్వే నెంబర్ 24/ఘ లో పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించినట్లు గ్రామస్థులు చెబుతున్నారు. ఒక్కో కుటుంబానికి సుమారు 2గుంటల చొప్పున స్థలం కేటాయించాల్సి ఉండగా, స్థానిక నాయకులు కొందరు అనంతరం లేఅవుట్‌లో మార్పులు చేసి స్థలాల పరిమాణాన్ని తగ్గించి, ప్లాట్ల సంఖ్యను పెంచినట్లు ఆరోపణలు ఉన్నాయి.

తరువాయి 2వ పేజీలో...

కలం కౌంటర్



పొంగులేటి రాజీనామా చేయాలి

- దరఖాస్తులు లేకుండా ఎట్లైతే నిషేధిత జాబితాలో చేర్చారో అట్లనే తొలగించాలి
- 22ఏ నిషేధిత భూముల బాధితుల సభలో మాజీ మంత్రి హరీశ్ రావు

మేడ్చల్ ఆగస్టు 18 (ప్రజాకలం) :

లక్షల మందిని ఆగం చేసిన మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, తక్షణమే నైతిక బాధ్యత వహించి తన పదవికి రాజీనామా చేయాలని బీఆర్ఎస్ డిమాండ్ చేస్తోంది. దరఖాస్తులు లేకుండా ఎట్లైతే నిషేధిత జాబితాలో చేర్చారో అట్లనే తొలగించాలని మాజీ మంత్రి హరీశ్ రావు డిమాండ్ చేసారు. మంగళవారం నాడు మల్కాజ్గిరి జిల్లా వాజ్ పేయి నగర్ హనుమాన్ టెంపుల్ గ్రౌండ్ లో

తరువాయి 2వ పేజీలో...

ఎస్సీ, బీసీల భూములను

ప్రభుత్వం లాక్కుంటోంది

సామాజిక న్యాయం పేరిట మోసం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

మంత్రివర్గంలో కేవలం ముగ్గురే బీసీలు ఉండటం సామాజిక న్యాయమా?

ప్రభుత్వ సలహాదారుల నియామకాల్లోనూ వివక్ష

ఆర్టీఐ కమిషనర్లలో ఒక్క బీసీకి కూడా చోటు కల్పించలేదు

తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత

హైదరాబాద్, ఆగస్టు 18 (ప్రజాకలం) :

సామాజిక న్యాయం పేరిట కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తుందని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత పేర్కొన్నారు. మంత్రివర్గంలో కేవలం ముగ్గురే బీసీలు ఉండటం సామాజిక న్యాయమా? అని ప్రశ్నించారు. ప్రభుత్వ సలహాదారుల నియామకాల్లోనూ విపక్ష చూపుతున్నారని, ఆర్టీఐ కమిషనర్లలో ఒక్క బీసీకి కూడా చోటు కల్పించలేదని మండిపడ్డారు. మంత్రుల కుటుంబ సభ్యులు, రాజ్యాంగేతర శక్తులు రాష్ట్ర పాలనను శాసిస్తున్నాయని, 22ఏను అడ్డం పెట్టుకుని కాంగ్రెస్ నేతలు భూ దోపిడికి పాల్పడుతున్నారని కవిత విమర్శించారు.

తరువాయి 2వ పేజీలో...

సమన్వయంతోనే గ్రామాల

సర్వతోముఖాభివృద్ధి

- మండల విద్యాభివృద్ధికి రూ.16 కోట్లు కేటాయింపు
- ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే విజయరమణ రావు

పెద్దపల్లి,ఆగస్టు18:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి)

గ్రామాల అభివృద్ధిలో భాగంగా ప్రజాప్రతినిధులు, అధికారులు పరస్పర సమన్వయంతో ముందుకు సాగాలని ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని ఆర్.కే. గార్డెన్స్‌లో ఎంపీడీఓ అధ్యక్షతన నిర్వహించిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సమావేశంలో వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీఓ,మండల ప్రత్యేక అధికారి, తహసీల్దార్, పంచాయతీ కార్యదర్శులు,వివిధ శాఖల అధికారులు పాల్గొని గ్రామాల్లో నెలకొన్న తాగునీరు, విద్యుత్,విద్య,వైద్యం,ఆర్ అండ్ బీ, పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్,వ్యవసాయం,మిషన్ భగీరథ తదితర అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. గ్రామాల్లోని సమస్యలను సర్పంచులు ప్రభుత్వ విప్,అధికారుల దృష్టికి తీసుకువచ్చారు.

తరువాయి 2వ పేజీలో...

పేదల ఇళ్ల నిర్మాణానికి

పారిశ్రామిక తోడ్పాటు

- ఇందిరమ్మ ఇళ్లకు రూ.230 కే సిమెంట్ బస్తా
- పరిశ్రమల సామాజిక బాధ్యతకు మంత్రి పొంగులేటి ప్రశంసలు!

హైదరాబాద్, ఆగస్టు 18 (ప్రజాకలం) :

గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో పేద ప్రజల సొంతింటి కలను సాకారం చేయాలనే సంకల్పంతో ప్రజాప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకంలో సిమెంట్ పరిశ్రమలు భాగస్వాములు కావాలని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార & పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి విజ్ఞప్తి చేశారు. మంగళవారం సచివాలయంలోని తన కార్యాలయంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి అవసరమైన సిమెంట్ ధరల తగ్గింపుపై ఆయా పరిశ్రమల యాజమాన్యాలతో సమావేశమయ్యారు.

ఈ సందర్భంగా మంత్రిగారు మాట్లాడుతూ...తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం కేవలం గృహ నిర్మాణ కార్యక్రమం మాత్రమే కాదని, పేద కుటుంబాలకు గౌరవప్రదమైన జీవితం, సామాజిక భద్రత, ఆత్మగౌరవాన్ని కల్పించే మహాయజ్ఞమని అన్నారు.

రాష్ట్రవ్యాప్తంగా (హైదరాబాద్ మినహా) మొదటి విడతలో 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసినట్లు తెలిపారు. వీటిలో ఇప్పటికే గణనీయ సంఖ్యలో 85 శాతం ఇళ్ల శ్లాబులు పూర్తయ్యాయని, మిగిలిన 15 శాతం ఇళ్లు వివిధ నిర్మాణ దశల్లో వేగంగా కొనసాగుతున్నాయని చెప్పారు. రెండో విడతలో నియోజకవర్గానికి రెండు వేల చొప్పున రాష్ట్ర వ్యాప్తంగా రెండున్నర లక్షల ఇళ్లు మంజూరు చేశాం. అలాగే క్యూర్ పరిధిలో లక్ష ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకొని ప్రయోగాత్మకంగా 16 నియోజకవర్గాల్లో ఇందిరమ్మ టవర్స్ కు శ్రీకారం చుట్టాం. దేశంలో ఏ రాష్ట్ర ప్రభుత్వం కూడా 100 శాతం సబ్సిడీతో రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందిస్తూ ఇళ్ల నిర్మాణాన్ని చేపట్టడం లేదని, ఈ విషయంలో తెలంగాణ ప్రభుత్వం దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని పేర్కొన్నారు. ప్రభుత్వంపై ఎంతటి ఆర్థిక భారం పడినా పేదల ఇళ్ల నిర్మాణంలో ఎలాంటి రాజీ పడకుండా

తరువాయి 2వ పేజీలో...

పెట్టుబడిదారులకు స్వర్గధామం తెలంగాణ

మొదటి పేజీ తరువాయి...

తెలంగాణను కేవలం స్వచ్ఛమైన ఇంధనాన్ని వినియోగించే రాష్ట్రంగా మాత్రమే కాకుండా, ప్రపంచ క్లీన్ ఎనర్జీ రంగానికి అవసరమైన సాంకేతికతలను తయారు చేసే ప్రధాన కేంద్రంగా నిలపాలని ఆకాంక్షించారు. రాష్ట్రంలో వేగంగా పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌ను తట్టుకుంటూనే, పర్యావరణ పరిరక్షణను సాధించేలా ప్రణాళికలు రూపొందించామని డిప్యూటీ సీఎం వివరించారు. ఇందులో భాగంగా 2030 నాటికి 20,000 మెగావాట్లు, 2035 నాటికి 26,000 మెగావాట్లకు పైగా సోలార్ విద్యుత్ సామర్థ్యాన్ని పెంచనున్నట్లు తెలిపారు. అలాగే పునరుత్పాదక ఇంధనానికి అత్యంత కీలకమైన 'విద్యుత్ నిల్వ' సామర్థ్యాన్ని కూడా భారీగా విస్తరిస్తున్నామని చెప్పారు. బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్, పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టుల ద్వారా 2030 నాటికి 3,800 మెగావాట్లు, 2035 నాటికి 8,000 మెగావాట్ల నిల్వ వ్యవస్థను అందుబాటులోకి తెస్తామన్నారు. హైదరాబాద్‌లోని ఐటీ, AI నైపుణ్యాలను ఉపయోగించి భవిష్యత్తు విద్యుత్ గ్రిడ్‌ను డిజిటల్ నెట్‌వర్క్‌గా మారుస్తున్నామని ఆయన పేర్కొన్నారు. 'భారత్ ఫ్యూచర్ సిటీ'లో ఏర్పాటు చేయబోయే AI డేటా సెంటర్ కోసం ప్రత్యేకంగా 100 మెగావాట్ల పునరుత్పాదక ఇంధన ప్లాంట్‌ను అనుసంధానిస్తున్నట్లు వెల్లడించారు. వీటితో పాటు 2030 నాటికి ఏటా 4 లక్షల టన్నుల గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి, 2035 నాటికి 12,000 జుఎ ఛార్జింగ్ స్టేషన్ల ఏర్పాటు లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. సోలార్, విండ్, బ్యాటరీ ఉత్పత్తులను ఇక్కడే తయారు చేసే కంపెనీలకు మూలధన సాయం, SGST రీయింబర్స్‌మెంట్, విద్యుత్ సుంకం మినహాయింపులతో పాటు TG-iPASS ద్వారా వేగవంతమైన అనుమతులు ఇస్తున్నామని వివరించారు. ప్రభుత్వం, ప్రైవేట్ భాగస్వామ్యంతోనే ఈ ఇంధన విప్లవం సాధ్యమవుతుందని, తెలంగాణతో కలిసి నడవాలని పారిశ్రామికవేత్తలకు డిప్యూటీ సీఎం పిలుపునిచ్చారు. కార్యక్రమం అనంతరం ఏర్పాటుచేసిన వివిధ స్టాల్స్ ను ఆయన సందర్శించారు. డిప్యూటీ సీఎం వెంట స్పెషల్ చీఫ్ సెక్రటరీ నవీన్ మిట్టల్ తదితరులు ఉన్నారు.

అన్యాక్రాంతమైన ప్లాట్లు... లబ్ధిదారుల పాట్లు

మొదటి పేజీ తరువాయి...

పేదల స్థలాల్లో కొత్త లెక్కలేంటి??

ప్రభుత్వం నిరుపేదలకు ఇచ్చిన స్థలాలను వారి అవసరాలకు అనుగుణంగా వినియోగించాల్సి ఉండగా, కొందరు స్థానిక నాయకులు తమకు అనుకూలంగా వ్యవహరిస్తూ లబ్ధిదారుల హక్కులను ప్రభావితం చేశారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అసలు ప్రభుత్వ రికార్డుల్లో ఎంత భూమి ఉంది? ఎన్ని ప్లాట్లు కేటాయించారు? ఒక్కో లబ్ధిదారుడికి ఎంత విస్తీర్ణం కేటాయించారు? ప్రస్తుతం ఆ స్థలాల్లో ఎవరు ఉన్నారు? అనే ప్రశ్నలకు స్పష్టమైన సమాధానాలు లేకపోవడం అనుమానాలకు తావిస్తోంది.

రికార్డులు బయటపెట్టాలి.. 1986లో కేటాయించిన భూమికి సంబంధించిన పాత ప్రభుత్వ రికార్డులు, పట్టాలు, లేఅవుట్ వివరాలు, ప్రస్తుత కొలతలు, లబ్ధిదారుల జాబితాలను అధికారు లు బహిర్గతం చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు. అప్పటి లేఅవుట్‌తో పాటు ప్రస్తుతం ఉన్న లేఅవుట్‌ను పోల్చి సమగ్ర సర్వేనిర్వహిస్తే అసలు వాస్తవాలువెలుగులోకి వస్తాయని అంటున్నారు.

అక్రమాలకు తావులేకుండా విచారణ జరపాలి

పేదల కోసం ప్రభుత్వం కేటాయించిన భూముల్లో ఎలాంటి అక్రమాలు, అక్రమ బదలాయింపులు లేదా నిబంధనలకు విరుద్ధమైన మార్పులు జరిగి ఉంటే వాటిపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు. రెవెన్యూ అధికారులు ప్రత్యేక బృందంతో స్థలాన్ని పరిశీలించి, అసలు కేటాయింపు ఎంత? ప్రస్తుతం ఎంత ఉంది? మధ్యలో మార్పులు ఎలా జరిగాయి? అన్న విషయాలను తేల్చాలని కోరుతున్నారు. పేదల కోసం కేటాయించిన భూమి కావడంతో ఈ వ్యవహారాన్ని రాజకీయ ప్రభావాలకు అతీతంగా విచారించి, అర్హులైన లబ్ధిదారులకు న్యాయం చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉందని స్థానికులు పేర్కొంటున్నారు. గతంలో కేటాయించిన ఇళ్ల స్థలాల విషయంలో ఇప్పటికీ వివాదాలు కొనసాగుతున్న సందర్భాలు రాష్ట్రంలో కనిపిస్తున్నాయి. కక్కిరాలపల్లి ఇళ్ల స్థలాల వ్యవహారంపై ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందనే అభిప్రాయం గ్రామంలో వ్యక్తమవుతోంది.

పొంగులేటి రాజీనామా చేయాలి

మొదటి పేజీ తరువాయి...

జరిగి లో 22ఏ నిషేధిత భూముల బాధితుల సభలో అయన పాల్గొన్నారు.

హరీష్ రావు మాట్లాడుతూ ప్రభుత్వం తప్పు చేస్తే.. ప్రజలకు ఎందుకు శిక్ష–2008లో యూఎల్సీ రద్దయిన తర్వాత, మళ్లీ ఇప్పుడు ఈ భూములను రాత్రికి రాత్రి నిషేధిత జాబితాలో ఎందుకు పెట్టారు? ఒక్క రంగారెడ్డి జిల్లాలోనే 7,500 జీవోలతో, మేడ్చల్ జిల్లాలో 6,000 జీవోలతో లక్షలాది ఆస్తులను అడ్డగోలుగా నిషేధిత జాబితాలో చేర్చారు. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాలు తన చేతిలోకి రావాలని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్వయంగా అధికారులను ఆదేశించి రాత్రికి రాత్రే ఈ ఆస్తులను బ్లాక్ చేయించారని అన్నారు. ఈ నిర్ణయంతో లక్షలాది అపార్ట్మెంట్లు, ఇళ్లు, ప్లాట్లను నిషేధిత జాబితాలో చేర్చి కాంగ్రెస్ ప్రభుత్వం సామాన్య ప్రజలను ఆగం చేసింది. దొంగతనం చేసిన దొంగ దొరికిపోయాక.. సారీ చెబితే చేసిన నేరం మాఫీ అయిపోతుందా? తప్పుకు శిక్ష పడాల్నా వద్దా? ఈరోజు నువ్వు చేసిన ఉద్దేశపూర్వక తప్పుకు లక్షల మంది ప్రజలు ఆగమయ్యారు. నిషేధిత జాబితా నుంచి ఆస్తులను తొలగించాలంటే 30 శాతం కమిషన్ అడుగుతున్నారట.. ఇది ముమ్మాటికీ 30 పర్సెంట్ కమిషన్ గవర్నమెంట్. పైగా ఆస్తులను 22ం నుంచి తీయాలంటే, ల్యాండ్ డెవలప్మెంట్ కూడా తమకే అప్పజెప్పాలని బ్లాక్ మెయిల్ చేస్తూ కండిషన్లు పెడుతున్నారని అన్నారు.

అసలు నిషేధిత జాబితాలో భూములను పెట్టాలని చెప్పింది ఎవరు? దీనికి బాధ్యులు ఎవరు? తక్షణమే తేల్చాలి. ప్రజల ఈ కష్టానికి కారణమైన మంత్రులు.. అధికారుల పేరు చెప్పి తప్పించుకుంటామంటే మేము చూస్తూ ఊరుకోం. కుక్క తోకను ఆడిస్తదా లేక తోక కుక్కను ఆడిస్తదా? పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి చెబితేనే అధికారులు భూములను నిషేధిత జాబితాలో పెట్టారు తప్ప వాళ్లంతట వాళ్లు చేయలేదు. లక్షల మందిని ఆగం చేసిన మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, తక్షణమే నైతిక బాధ్యత వహించి తన పదవికి రాజీనామా చేయా లని బీఆర్ఎస్ డిమాండ్ చేస్తోంది. దరఖాస్తులు లేకుండా ఎట్లైతే నిషేధిత జాబితాలో చేర్చారో అట్లనే తొలగించాలని అన్నారు.

సమన్వయంతోనే గ్రామాల సర్వతోముఖాభివృద్ధి

మొదటి పేజీ తరువాయి...

ఈ సందర్భంగా ప్రభుత్వ విప్,ఎమ్మెల్యే విజయరమణ రావు మాట్లాడుతూ అధికార యంత్రాంగం, మండలంలోని 30 గ్రామాల సర్పంచులు సమన్వయంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. అధికారులు గ్రామాల్లో నిరంతరం పర్యటించి, క్షేత్రస్థాయిలో సమస్యలను గుర్తించి తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. గ్రామాల అభివృద్ధికి సర్పంచులు ఎల్లవేళలా ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి అత్యంత ప్రాధాన్యతనిస్తోందని, పెద్దపల్లి మండల విద్యాభివృద్ధి కోసం రూ. 16 కోట్లు కేటాయించి ఖర్చు చేస్తున్నామని తెలిపారు. దీనిద్వారా నూతన పాఠశాల భవనాల నిర్మాణం, శిథిలమైన భవనాల మరమ్మతులు, ప్రహరీ గోడ, మరుగుదొడ్లు ఇతర మౌలిక వసతుల అభివృద్ధి పనులు చేపట్టామని వెల్లడించారు. సర్పంచులు ప్రత్యేక చొరవ తీసుకొని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచేలా కృషి చేయాలని కోరారు.

గ్రామాల్లో నెలకొన్న విద్యుత్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. రాబోయే మండల సర్వసభ్య సమావేశానికి అధికారులు మరింత పూర్తిస్థాయి సమాచారంతో సభకు హాజరు కావాలని ఆదేశించారు.?ఈ సమావేశంలో ఎంపీఓ,మండల ప్రత్యేక అధికారి,తహసీల్దార్, పంచాయతీ కార్యదర్శులు,వివిధ శాఖల అధికారులు,గ్రామ సర్పంచులు పాల్గొన్నారు

పేదల ఇళ్ల నిర్మాణానికి పారిశ్రామిక తోడ్పాటు

మొదటి పేజీ తరువాయి...

ప్రతి లబ్ధిదారుడికి నిర్మాణ పురోగతికి అనుగుణంగా విడతల వారీగా ప్రతి సోమవారం పారదర్శకంగా నిధులను విడుదల చేస్తున్నామని తెలిపారు. ప్రతి పేద కుటుంబం సొంత ఇంటిలో నివసించే వరకు ప్రభుత్వం తన బాధ్యతను పూర్తి నిబద్ధతతో నిర్వర్తిస్తుందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఈ బృహత్తరమైన ఇందిరమ్మ ఇళ్ల పథకంలో సిమెంట్ పరిశ్రమల యాజమాన్యాలు కూడా భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. ఇందిరమ్మ ఇళ్లకు అవసరమైన సిమెంట్‌ను తక్కువ ధరకే అందించాలని విజ్ఞప్తి చేశారు.

ప్రభుత్వం, పరిశ్రమలు, ప్రజలు కలిసి పనిచేస్తే తెలంగాణలో గుడిసెలు లేని రాష్ట్రం లక్ష్యాన్ని త్వరితగతిన సాధించవచ్చని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని ఒక ప్రజా ఉద్యమంగా మార్చేందుకు ప్రతి వర్గం సహకారం అందించాలని పిలుపునిచ్చారు. పేదవాడికి ప్రత్యక్షంగా, పరోక్షంగా సహాయమందిస్తే ప్రభుత్వంతో పాటు పరిశ్రమల యాజమాన్యాలను కూడా చిరస్థాయిగా గుర్తుపెట్టుకుంటారని అన్నారు. మంత్రిగారి విజ్ఞప్తి మేరకు ఒక్కో బస్తాను 230 రూపాయిలకు ఇవ్వడానికి యాజమాన్యాలు అంగీకరించాయి. ఈసందర్భంగా మంత్రి పొంగులేటి యాజమాన్యాలకు కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో పరిశ్రమల యాజమాన్యాలతోపాటు హౌసింగ్ సెక్రటరీ వి.పి.గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌నినో వేళ ప్రతి నీటి చుక్కకూ లెక్క ఉండాలి

మొదటి పేజీ తరువాయి...

రాబోయే సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లో భారీగా వర్షాలు కురుస్తాయని, ఎగువ నుంచి పెద్దఎత్తున వరదలు వస్తాయని ముందుగానే ఊహించుకొని నీటి నిర్వహణ ప్రణాళికలు రూపొందించడం సమంజసం కాదన్నారు. ప్రస్తుతం చేతిలో ఉన్న నీరే ప్రామాణికం కావాలి... నమ్మదగిన ప్రవాహాలే అంచనాలకు ఆధారం కావాలి... వర్షపాతంపై శాస్త్రీయ విశ్లేషణే నిర్ణయాలకు దిక్సూచి కావాలి అని స్పష్టం చేశారు. "మన విధానం సమతుల్యంగా, వివేకవంతంగా ఉండాలి. ప్రజల తాగునీటి అవసరాలను ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రమాదంలోకి నెట్టకూడదు. అదే సమయంలో తాగునీటి అవసరాలకు మించి అందుబాటులో ఉన్న నీరు జలాశయాల్లో ఉన్నప్పుడు పంటలు ఎండిపోతుంటే చూస్తూ ఉండకూడదు. ప్రతి నీటి విడుదల నిర్ణయం వాస్తవంగా వినియోగించగల నిల్వలు, నమ్మదగిన ప్రవాహాలు, వాస్తవిక వర్షపాత అంచనాల ఆధారంగానే జరగాలి" అని ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. కృష్ణా పరీవాహక ప్రాంతంలోని ప్రధాన జలాశయాల్లో మొత్తం 973.68 టీఎంసీల సామర్థ్యానికి గాను 746.12 టీఎంసీల నీరు ఉండి, 76.63 శాతం నిల్వలు నమోదయ్యాయని సమీక్షలో వెల్లడైంది. గోదావరి బేసిన్‌లో 306.20 టీఎంసీల సామర్థ్యానికి 208.38 టీఎంసీలు, అంటే 68.1 శాతం నీరు అందుబాటులో ఉందని అధికారులు వివరించారు. కృష్ణా నదిపై తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు ఉమ్మడి ప్రాజెక్టుగా ఉన్న నాగార్జునసాగర్‌లో ప్రస్తుతం సుమారు 164 టీఎంసీల నీటి నిల్వ ఉందని అధికారులు మంత్రికి వివరించారు. ప్రాజెక్టు స్థూల సామర్థ్యం సుమారు 312 టీఎంసీలు కాగా, ఇంకా దాదాపు 47 శాతం మేర వరద జలాలను స్వీకరించే అవకాశం ఉందని తెలిపారు. నాగార్జునసాగర్ ఎడమ కాలువ కింద నల్లగొండ, సూర్యాపేట, ఖమ్మం జిల్లాల్లో 6.4 లక్షల ఎకరాలకు పైగా ఆయకట్టు ఉన్న నేపథ్యంలో సాగునీటి అవసరాలను అత్యంత జాగ్రత్తగా అంచనా వేయాలని మంత్రి సూచించారు.

అయితే జలాశయాల్లో కనిపించే స్థూల నిల్వ శాతాలను మాత్రమే చూపించి పరిస్థితి ఎంతో ఆశాజనకంగా ఉందన్న భావన కలిగించవద్దని అధికారులను మంత్రి హెచ్చరించారు. స్థూల సామర్థ్యం ఎంత? లైవ్ స్టోరేజ్ ఎంత? వాస్తవంగా వినియోగించగల నీరు ఎంత? ఇప్పటికే కేటాయించిన అవసరాలు ఎంత? వాటన్నింటినీ మినహాయించిన తర్వాత సాగునీటికి మిగిలేది ఎంత? అన్న వివరాలు ప్రతి నివేదికలో స్పష్టంగా ఉండాలని ఆదేశించారు. 2025, 2026 సంవత్సరాల నిల్వలు, ప్రవాహాలను తులనాత్మకంగా అధ్యయనం చేసి నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు.

మిగిలిన ఖరీఫ్ కాలంలో ప్రభుత్వం ముందున్న లక్ష్యం స్పష్టమని మంత్రి పేర్కొన్నారు. నమ్మదగిన ప్రతి నీటి వనరును సద్వినియోగం చేసుకొని నిలువునా ఉన్న పంటలను కాపాడాలని, ప్రవాహాలపై అనిశ్చితి ఉన్న జలాశయాల్లో నీటిని జాగ్రత్తగా సంరక్షించాలని, రైతులకు వాస్తవ పరిస్థితులను ఎప్పటికప్పుడు పారదర్శకంగా తెలియజేయాలని ఆదేశించారు.

వైరా రిజర్వాయర్ పరిస్థితిని ప్రత్యేకంగా సమీక్షించిన ఉత్తమ్ కుమార్ రెడ్డి, గోదావరి జలాలతో తిరిగి నింపుకునే అవకాశం ఉన్నప్పుడు సాగునీటి విడుదలలో జాప్యం ఎందుకు జరుగుతోందని అధికారులను ప్రశ్నించారు. సహజ ప్రవాహాలపై మాత్రమే ఆధారపడే జలాశయాల్లో నీటిని పొదుపుగా వినియోగించడం అవసరమేనని, కానీ నమ్మదగిన ప్రత్యామ్నాయ వనరుల నుంచి తిరిగి నింపుకునే అవకాశం ఉన్న చోట సాగునీటిని అనవసరంగా నిలిపివేయడం సమర్థనీయం కాదని స్పష్టం చేశారు.

దేవాదుల, నిజాంసాగర్, స్వర్ణ, సదర్మట్ ఆనకట్ట, రామడుగు, బుగ్గలవాగు, రామపల్లి, పాలెంవాగు, గౌరవవరం, పోచారం, రాజీవ్ సాగర్, నెలవాయి, వట్టివాగు, నల్లవాగు, పాల్వాయి పురుషోత్తంరావు (ఎర్రవాగు), చెల్మెలవాగు (ఎన్టీఆర్ సాగర్) ప్రాజెక్టుల పరిధిలో అందుబాటులో ఉన్న నీటి పరిస్థితిని క్షుణ్ణంగా పరిశీలించి, సాగునీటి విడుదలకు అవకాశం ఉన్నచోట చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. మూసీ జలాలను కూడా సమర్థంగా వినియోగించి రైతులకు ప్రయోజనం చేకూర్చాలని సూచించారు. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు పరిధిలో సాగునీటి ప్రణాళికలు జలాశయంలోని వాస్తవ నిల్వలు, వస్తున్న ప్రవాహాలకు అనుగుణంగానే ఉండాలని మంత్రి స్పష్టం చేశారు. నిజాంసాగర్, లోయర్ మానేరు డ్యామ్, సింగూరు సహా గోదావరి బేసిన్‌లోని ఇతర ప్రధాన జలాశయాల పరిస్థితిని కూడా సమగ్రంగా సమీక్షించారు. సింగూరు భద్రతకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలని ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. డ్యామ్‌కు అవసరమైన మరమ్మతులు, పటిష్టీకరణ పనులను వేగవంతం చేయాలని, తాజా నీటి నిల్వలను మరోసారి ధ్రువీకరించి సాంకేతిక సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఇంజినీర్లకు సూచించారు. శ్రీశైలం ఎడమగట్టు కాలువ (ఎస్ఎల్‌బీసీ) సొరంగం పనుల పురోగతిని కూడా మంత్రి సమీక్షించారు. ఇన్‌లెట్, అవుట్‌లెట్ రెండు వైపుల నుంచి తవ్వకం కొనసాగుతున్నట్లు అధికారులు వివరించారు. భౌగోళికంగా అత్యంత క్లిష్టమైన ప్రాంతాల్లో ఇంజినీర్లు నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని, భద్రత విషయంలో ఎక్కడా రాజీపడకుండా పనుల వేగాన్ని పెంచాలని మంత్రి ఆదేశించారు. జలవనరులకు సంబంధించిన అన్ని సాంకేతిక అధ్యయనాల్లో కేంద్ర జల సంఘం, భారత వాతావరణ శాఖ తాజా సమాచారాన్నే ప్రామాణికంగా తీసుకోవాలని ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. కాలం చెల్లిన సమాచారంపై ఆధారపడకుండా నదుల క్రాస్ సెక్షన్లను తాజా పరిస్థితులకు అనుగుణంగా నవీకరించాలని సూచించారు. పోలవరం ప్రాజెక్టు వల్ల తెలంగాణలో ఏర్పడే అవకాశం ఉన్న ముంపు ప్రభావంపై అధ్యయనం చేస్తున్న ఐఐటీ నిపుణులతో త్వరితగతిన తదుపరి సంప్రదింపులు జరపాలని మంత్రి ఆదేశించారు. తెలంగాణ భూభాగంలో ఎంతమేర వరద ప్రభావం లేదా ముంపు ఏర్పడే అవకాశం ఉందన్న అంశంపై శాస్త్రీయమైన, తిరుగులేని సాంకేతిక ఆధారాలను సిద్ధం చేయాలని సూచించారు. అవసరమైన రక్షణ చర్యలను కేంద్రం నుంచి కోరేందుకు ఈ అధ్యయనం తెలంగాణకు బలమైన ఆధారంగా నిలవాలని పేర్కొన్నారు. అంతర్రాష్ట్ర జల వివాదాలపై కూడా మంత్రి విస్తృతంగా సమీక్షించారు. ట్రిబ్యునల్‌లో కొనసాగుతున్న విచారణలు, సుప్రీంకోర్టులోని కేసులు, కృష్ణా జలాల నిర్వహణ, విద్యుత్ ఉత్పత్తి, కృష్ణా నదీ యాజమాన్య బోర్డు పరిధి తదితర అంశాలపై ఇంజినీరింగ్, న్యాయ విభాగాల అధికారులు సమన్వయంతో సంక్షిప్తమైనా సమగ్రమైన నోట్ సిద్ధం చేయాలని ఆదేశించారు. "నీరు ప్రకృతి ఇచ్చే సంపద మాత్రమే కాదు... ప్రజల భవిష్యత్తుకు ప్రభుత్వం నిర్వహించాల్సిన బాధ్యత. తాగునీటిని కాపాడాలి... రైతు పంటను నిలబెట్టాలి... రేపటి అవసరాన్ని విస్మరించకుండా నేటి అవసరాన్ని తీర్చాలి. అందుకే ఈ సమయంలో ప్రతి టీఎంసీకి లెక్క ఉండాలి... ప్రతి విడుదలకు శాస్త్రీయ కారణం ఉండాలి... ప్రతి నిర్ణయంలో రైతు ప్రయోజనం, ప్రజల తాగునీటి భద్రత ప్రతిబింబించాలి" అన్న దిశలో అధికారులు పనిచేయాలని ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ సమీక్షలో నీటిపారుదల శాఖ కార్యదర్శి ఈ. శ్రీధర్, ఇంజినీర్–ఇన్–చీఫ్ (జనరల్) ఓ.వి. రమేష్ బాబు, జాయింట్ సెక్రటరీ కె. శ్రీనివాస్, టన్నెల్ నిపుణుడు కల్నల్ పరీక్షిత్ మెహ్రా, ఇంజినీర్–ఇన్–చీఫ్ (అడ్మినిస్ట్రేషన్) టి. శ్రీనివాస్, ఇంజినీర్–ఇన్–చీఫ్ ఆర్. మధుసూదన్ రావు తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఎస్సీ, బీసీల భూములను ప్రభుత్వం లాక్కుంటోంది

మొదటి పేజీ తరువాయి...

ఎస్సీ, బీసీల నుంచి 30 వేల ఎకరాల అసైన్డ్ భూములను ప్రభుత్వం లాక్కుంటోందని, ధరణి, భూభారతి రికార్డులను ప్రభుత్వం దుర్వినియోగం చేస్తోందని ఆమె వెల్లడించారు. ప్రొఫె సర్ జయశంకర్ జయంతిని పురస్కరించుకుని 'సామాజిక న్యాయ సంకల్ప సభ' నిర్వహి స్తున్నట్లు వెల్లడించారు. మేము సామాజిక న్యాయ తెలంగాణ సంకల్ప సభ పెట్టిన తర్వాతే ముఖ్యమంత్రి సామాజిక న్యాయం గురించి మాట్లాడటం మొదలుపెట్టాడు. మా సభ తర్వాత కచ్చితంగా సామాజిక తెలంగాణ గురించి మాట్లాడే అనివార్యత వస్తుందని చెప్పాం. ఇప్పుడు అదే జరిగింది. 31 నెలలుగా మాట్లాడని ముఖ్యమంత్రి మా ఒత్తిడి కారణంగా సామాజిక న్యాయం అనే మాట మాట్లాడుతున్నారు. మేము తీసుకొచ్చిన అనివార్యత కారణంగానే అధికారంలో ఉన్న పార్టీ దిగివచ్చి సామాజిక న్యాయం అంటోంది. కానీ ముఖ్యమంత్రి సామాజిక అన్యాయం అనాల్సింది పోయి సామాజిక న్యాయం అన్న ట్లు అనిపిస్తోంది. ఎందుకంటే ఆయన చేసేదే సామాజిక అన్యాయం. కానీ సామాజిక న్యా యం అంటాడని అన్నారు. నిజంగా సామాజిక న్యాయంపై చిత్తశుద్ధి ఉంటే మంత్రివర్గంలో 16 మంది ఉంటే ముగ్గురు మాత్రమే బీసీలు ఉంటారా? ఏడుగురు మాత్రమే బీసీలు ఉన్నారు. అందరికీ మంత్రి పదవులు సాధ్యమా అంటే ఎస్సీ, ఎస్టీలు ఉన్నారు కదా? వాళ్లలో మీకు ఎవరు కూడా అర్హత ఉన్నవాళ్లలాగ కనిపించలేదా? ఇద్దరు ఆడబిడ్డలకు మంత్రి పదవులు ఇచ్చామని చెబుతున్నారు. అది 33 శాతం అవుతుందా? తెలంగాణ ఉద్యమకారురాలు విజయశాంతి ని ఎమ్మెల్సీ చేసి సైలెంట్ చేశారు. ఆమెకు ఎందుకు మంత్రి పదవి ఇవ్వలేదు? అందుకే ఈ ముఖ్యమంత్రి సామాజిక న్యాయం అంటే మనం నమ్మవద్దు. మేక వన్నె పులి మాదిరిగా ఆయన సామాజిక న్యాయం అంటున్నాడని అన్నారు. ఇటీవల అడ్వయిజరీ పదవులు వీహెచ్ కి, శశిధర్ రెడ్డి కి ఇచ్చారు. కానీ వీహెచ్ కి చాలా తక్కువ జీతం, తక్కువ ర్యాంక్ ఇచ్చారు? కాంగ్రెస్ లో ఎప్పటి నుంచో ఉండి మేము చిన్ననాటి నుంచి కూడా రాజీవ్ గాంధీ జయంతి నిర్వహిస్తున్న వ్యక్తి వీహెచ్. ఆయనకు తక్కువ జీతం, తక్కువ ర్యాంక్ ఇచ్చారు. శశిధర్ రెడ్డికి మాత్రం రెండున్నర లక్షల జీతం ఇచ్చారు. ఎందుకు వారిద్దరిలో అంత వత్యాసం? దీనికి ముఖ్యమంత్రి సమాధానం చెప్పాలి. ఆర్టీఐ కమిషనర్లు ఇస్తే వారిలో ఒక్క బీసీ కూడా లేదు. పైగా ఆర్టీఐ కమిషనర్ భార్యను చిత్రపురి కాలనీ సొసైటీలో మెంబర్ ను చేశారు. చిత్రపురి కాలనీ వాళ్లకు న్యాయం చేస్తానని ఎన్నికల సమయంలో ముఖ్యమంత్రి ఊదరగొట్టారు. 52 జడ్జిమెంట్లు ఉన్నా సరే వారికి న్యాయం చేయటం లేదు. సంబంధం లేని వాళ్లకు సొసైటీలో పదవులు ఇచ్చారు. ఎటు పక్క చూసిన సరే అగ్రకులాలకు చెందిన వారికే పదవులు ఇస్తున్నారు. ఈ ముఖ్యమంత్రి మాట్లాడేది సామాజిక న్యాయం, కానీ చేసేది అటవీక న్యాయం. అడవిలో బలమైన జంతు వుదే రాజ్యం. మనం అలా ఉండకూడదని సొసైటీగా ఉండాలని అనుకున్నాం. మాటల్లో కాకుండా చేతల్లో సామాజిక న్యాయం అనేది చేసి చూపాలి. గత రెండేళ్లలో 5 లక్షల 96 వేల కోట్ల బడ్జెట్ పెడితే బీసీల కోసం ఖర్చు చేసింది 5 వేల 5 వందల కోట్లే. అంటే ఒక్క శాతం మాత్రమే బీసీల కోసం ఖర్చు చేశారంటే ఎంత అన్యాయం. బీసీల జనాభా ఎంత? మీరు ఖర్చు చేసింది ఎంత? మహిళలపై కూడా మీకు గౌరవం లేదు. గాంధీ భవన్ లో ఎంతమంది మహిళలు పదవుల కోసం ధర్నా చేశారు? ప్రియాంక గాంధీ పోటీ చేస్తే మీరంతా వెళ్లి గెలిపించుకుంటారు. కానీ మీనాక్షి నటరాజన్ ను మాత్రం ఈ ముఖ్యమంత్రే కుట్ర చేసి ఓడిస్తాడు. ఇదేనా మీరు చెప్పే సామాజిక న్యాయం, మాటల్లో కాదు చేతల్లో ఉండాలి. యాదగిరి గుట్టలో డిప్యూటీ సీఎం గారిని కింద కూర్చోబెట్టి అవమానించారు. ఎంపీ వంశీ కి కనీసం పుష్కరాల ఇన్విటేషన్ కూడా ఇవ్వలేదు. బీసీ బిడ్డలు మంత్రి వాకిటి, కొండా సురేఖలను పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఘోరంగా అవమానించారు. పొంగులేటి కన్నా సీనియర్ అయిన కొండా సురేఖను అవమానించలేదా? లంబాడాలు మినిస్టర్ గా లేని ఏకైక కేబినెట్ మీదేనని ఆరోపించారు.

ప్రేమ వ్యవహారంతో మనస్తాపం.. విద్యార్థిని మృతి

మల్లాపూర్, ఆగస్టు 18 (ప్రజా కలం ప్రతినిధి) గతంలో కొనసాగిన ప్రేమ వ్యవహారం కారణంగా మనస్తాపానికి గురైన ఓ విద్యార్థిని పురుగుల మందు సేవించి మృతి చెందిన ఘటన మల్లాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని సిరిపూర్ గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్సై ఏ. అనిల్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. సిరిపూర్ గ్రామానికి చెందిన నునావత్ శృతిక (17) పోలాస అగ్రికల్చర్ పాలిటెక్నిక్ కళాశాలలో డిప్లొమా ద్వితీయ సంవత్సరం చదువుతోంది. గతంలో ఓ వ్యక్తితో ఆమెకు ప్రేమ వ్యవహారం ఉన్నట్లు కుటుంబ సభ్యులకు తెలియడంతో, సదరు వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ క్రమంలో ఆగస్టు 17న శృతిక తండ్రి తిరుపతి కళాశాలకు వెళ్లగా, ఆమె మళ్లీ సదరు వ్యక్తితో ఫోన్‌లో మాట్లాడుతున్న విషయాన్ని కళాశాల సిబ్బంది ఆయనకు తెలియజేశారు. దీంతో తిరుపతి కుమార్తెను ఇంటికి తీసుకువచ్చి, అనంతరం కూరగాయలు విక్రయించేందుకు మల్లాపూర్ అంగడికి వెళ్లాడు. సాయంత్రం సుమారు 6 గంటల సమయంలో శృతిక ఇంట్లో అపస్మారక స్థితిలో ఉండటాన్ని కుటుంబ సభ్యులు గుర్తించి సమాచారం అందించారు. అయితే అప్పటికే ఆమె మృతి చెందినట్లు గుర్తించారు. గతంలో జరిగిన ప్రేమ వ్యవహారం కారణంగా మనస్తాపానికి గురై శృతిక ఈ ఘటనకు పాల్పడినట్లు కుటుంబ సభ్యులు ఫిర్యాదులో పేర్కొన్నారు. మృతురాలి తండ్రి తిరుపతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఏ. అనిల్ కుమార్ తెలిపారు.

ఘనంగా సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి వేడుకలు..

మల్లాపూర్, ఆగస్టు 18 (ప్రజా కలం ప్రతినిధి) మల్లాపూర్ మండల కేంద్రంలో మల్లాపూర్ గౌడ సంఘం ఆధ్వర్యంలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గీత పారిశ్రామిక సంఘం అధ్యక్షులు ముద్దం శరత్ గౌడ్, సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ సంఘం మండల అధ్యక్షులు బండి లింగస్వామి గౌడ్, ముద్దం సత్యనారాయణ గౌడ్, పెరుమాండ్ల అర్జున్, గొట్టిపడత సత్యం, ఆలాల నరసయ్య, గొట్టిపడత లక్ష్మీరాజం, పెరుమాండ్ల నవీన్, నాగుల నారాయణ, బండి సత్యం, ముద్దం శ్రీధర్, సతీష్, నవీన్, అజయ్, అనిల్, రవి, రమేష్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

గౌడ కులస్తులు ఆధ్వర్యంలో 376వ
సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి

నిర్మల్ ఆగస్టు (ప్రజా కలం జిల్లా ప్రతినిధి) మండల కేంద్రమైన కుబీర్ లోని ఎల్లమ్మ గుడి వద్ద గౌడ కులస్తులు ఆధ్వర్యంలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. పాపన్న గౌడ్ బహుజనుల ఆత్మగౌరవం కోసం పోరాడిన గొప్ప వీరుడని, ఆయన ఆశయాలను నేటి తరానికి తెలియజేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కనకా గౌడ్, శ్రీనివాస గౌడ్, కొండ కిష్ట గౌడ్, కొండ సతీష్ గౌడ్, రమేష్ గౌడ్, ఎం. నరేష్ గౌడ్, దేవేందర్ గౌడ్, వెంకటేష్ గౌడ్, అర్జున్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు. గౌడ సంఘం నాయకులు, సభ్యులు, యువత, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయంతి వేడుకలను విజయవంతం చేశారు.

మొగిలి గ్రామంలో ఘనంగా అన్నాభావు సాఠే జయంతి...

తానూర్, ఆగస్టు 18(ప్రజా కలం): మండలంలోని మొగలి గ్రామంలో లోక్‌షాహీర్ అన్నాభావు సాఠే 106వ జయంతి వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి,ముఖ్య అతిథిగా మాజీ జడ్పీటీసీ ఉత్తం భాలేరావు పాల్గొని జెండా ఆవిష్కరించారు, స్థానిక నాయకులతో కలిసి సాఠే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు,ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తన సాహిత్యం ద్వారా అన్నాభావు సాఠె తెచ్చిన సామాజిక చైతన్యం, అణగారిన వర్గాలకు చేసిన కృషి చిరస్మరణీయమన్నారు, యువత ఆయన ఆశయాలను ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు, ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ ఉషా-దర్శన్, ఉపసర్పంచ్ నితిన్ జాదవ్,మాజి ఎంపీటీసీ లక్ష్మణ్, మాజి సర్పంచ్ పుండలిక్, నాయకులు శాదుల్, సాయినాథ్,వార్డు సభ్యులు, గ్రామస్తులు, తదితరులు, పాల్గొన్నారు..

సర్పంచ్ వాసం సుస్మిత ఆధ్వర్యంలో డ్రైడే ఫ్రైడే విజయవంతం

నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి - సర్పంచ్ వాసం సుస్మిత

ఆళ్లపల్లి, ఆగస్టు 18 (ప్రజాకలం): ఆళ్లపల్లి మండలం మైలారం గ్రామంలో మంగళవారం 'డ్రై డే-ఫ్రైడే' కార్యక్రమాన్ని సర్పంచ్ వాసం సుస్మిత ఆధ్వర్యంలో నిర్వహించారు ఈ కార్యక్రమంలో భాగంగా ఆమె ఇంటింటికీ వెళ్లి ప్రజలకు అవగాహన కల్పించారు వర్షాకాలంలో దోమల వ్యాప్తి అధికంగా ఉంటుందని, డెంగ్యూ, మలేరియా, చికున్‌గున్యా వంటి సీజనల్ వ్యాధుల నివారణకు ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సర్పంచ్ సూచించారు. కూలర్లు, నీటి తొట్టెలు, పాత టైర్లు, కొబ్బరి చిప్పల్లో నీరు నిల్వ ఉండకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలని ప్రజలకు సూచించారు. "మన ఆరోగ్యం మన చేతుల్లోనే ఉందని దోమల నివారణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆమె పిలుపునిచ్చారు ఈ సందర్భంగా పంచాయతీ సెక్రటరీ ఉపేందర్, ఆశా కార్యకర్త సుగుణ, గ్రామ పెద్దలు, మహిళలు పాల్గొన్నారు. అధికారులు ఇంటింటికీ వెళ్లి నీరు నిల్వ ఉండే ప్రదేశాలను పరిశీలించి, దోమల నివారణ చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు

మల్దకల్ పశువుల సంత వెలవెల.. ఇంటిబాట పడుతున్న ఎద్దులు!

గద్వాల ప్రతినిధి ఆగస్టు 18 ప్రజా కలం:
జోగులాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండల కేంద్రంలో మంగళవారం నిర్వహించిన పశువుల సంతకు ఆదరణ తగ్గి వెలవెలబోయింది. గతంలో రైతులు, పశువుల వ్యాపారులతో సందడిగా కనిపించిన సంత ప్రస్తుతం కొనుగోలుదారులు, విక్రయదారులు లేక నిరాశాజనకంగా మారింది. పశువుల కొనుగోళ్లు తగ్గిపోవడంతో సంతకు తీసుకొచ్చిన ఎద్దులు, ఇతర పశువులు అమ్మకాలు లేక తిరిగి ఇంటిబాట పడుతున్నాయి. ఉదయం 9 గంటలకే సందడి తగ్గిపోవడంతో 10 గంటలలోపే సంత ముగిసే పరిస్థితి నెలకొంది. పశువుల సంతకు పూర్వ వైభవం తీసుకువచ్చేందుకు అధికారులు ప్రత్యేక దృష్టి సారించి అవసరమైన చర్యలు చేపట్టాలని రైతులు, వ్యాపారులు కోరుతున్నారు.

గద్వాల రైతాంగానికి భారీ సాగునీటి వరం

గట్టు ఎత్తిపోతల, గుడ్డెందొడ్డి రిజర్వాయర్ సామర్థ్యాల పెంపుపై సీఎంకు ఎమ్మెల్యే కృతజ్ఞతలు

గద్వాల ప్రతినిధి ఆగస్టు 18 ప్రజా కలం:
గట్టు ఎత్తిపోతల పథకం, గుడ్డెందొడ్డి రిజర్వాయర్ సామర్థ్యాలను పెంచేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం పట్ల గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. హైదరాబాద్‌లో ముఖ్యమంత్రిని కలిసి సన్మానించారు. గట్టు ఎత్తిపోతల పథకం సామర్థ్యాన్ని 1.3 టీఎంసీల నుంచి 3 టీఎంసీలకు, గుడ్డెందొడ్డి రిజర్వాయర్ సామర్థ్యాన్ని 1.9 టీఎంసీల నుంచి 15 టీఎంసీలకు పెంచేందుకు ప్రభుత్వం నిర్ణయించడం పట్ల ఎమ్మెల్యే, నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ గద్వాల నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటానని తెలిపారు. అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి రాష్ట్రంలో గద్వాలను అగ్రస్థానంలో నిలిపేందుకు కృషి చేస్తానన్నారు. భవిష్యత్తులో ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డికి అండగా ఉండాలని నాయకులకు సూచించారు. ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి మాట్లాడుతూ గద్వాల రైతాంగానికి శాశ్వతంగా సాగునీటి సమస్యను పరిష్కరించే దిశగా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ఎంతో సంతోషకరమన్నారు. రెండు పంటలకు చివరి ఆయకట్టు వరకు నీరందించేలా, సుమారు రెండు లక్షల ఎకరాలకు సాగునీరు అందే విధంగా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.

గద్వాల నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. గద్వాల నియోజకవర్గ ప్రజలు, రైతాంగం తరఫున ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, రాష్ట్ర మంత్రివర్గానికి ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సీనియర్ నాయకులు, ప్రజాప్రతినిధులు, రైతులు, అమరవాయి సర్పంచ్ తుమ్ కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

మల్దకల్‌లో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

విద్య, పెన్షన్లు, గ్రామాభివృద్ధిపై కీలక ఆదేశాలు -జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాష షేక్

గద్వాల ప్రతినిధి ఆగస్టు 18 ప్రజా కలం: జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ మంగళవారం మల్దకల్ మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్, గ్రామపంచాయతీ కార్యాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో పదో తరగతి విద్యార్థులతో మాట్లాడిన కలెక్టర్.. ప్రణాళికతో చదివితే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని, వంద శాతం ఉత్తీర్ణత లక్ష్యంగా కృషి చేయాలని సూచించారు. చదువులో వెనుకబడిన విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు. మధ్యాహ్న భోజనం నాణ్యతను పరిశీలించి, మెనూ ప్రకారం భోజనం, గుడ్లు తప్పనిసరిగా అందించాలని సూచించారు. అనంతరం గ్రామపంచాయతీ కార్యాలయంలో పెన్షన్లపై ఆరా తీసిన కలెక్టర్.. అర్హులైన ప్రతి ఒక్కరికీ చేయూత పెన్షన్లు అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జలసిరి కార్యక్రమంలో భాగంగా ఇంకుడు గుంతలు, నీటి కుంటల నిర్మాణాలను పెద్ద ఎత్తున చేపట్టాలని, వ్యక్తిగత, సామూహిక మరుగుదొడ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని సూచించారు. గ్రామపంచాయతీ స్థలాల్లో ఎవరైనా అనధికారికంగా డబ్బాలు ఏర్పాటు చేస్తే చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అనుమతులు పొందిన వారు నిర్ణీత అద్దెలు సక్రమంగా చెల్లించేలా చూడాలని, తద్వారా గ్రామపంచాయతీకి ఆదాయ వనరులు పెరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామంలో పనిచేస్తున్న మల్టీపర్పస్ కార్మికులకు జీతాలు సకాలంలో చెల్లించాలని ఆదేశించారు. అభివృద్ధి పనులన్నింటినీ సకాలంలో పూర్తి చేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ జి. సురేష్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నరేష్, పంచాయతీ కార్యదర్శి అర్జున్,గోపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులు సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించుకోవాలి:

– జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా

నిర్మల్ ఆగస్టు18 (ప్రజా కలం జిల్లా ప్రతినిధి)
విద్యార్థులు సాంకేతిక నైపుణ్యాలు పెంపొందించుకుంటూ, వచ్చిన అవకాశాలను అందిపుచ్చుకోవాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అన్నారు. మంగళవారం జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా, బాసర ఐఐఐటీలోని సమావేశ మందిరంలో నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఎన్ఐఈఎల్ఐటి) హైదరాబాద్ భాగస్వామ్యంతో నిర్వహించిన సెమికండక్టర్ డిజైన్ లపై ఐదు రోజుల ప్రత్యేక వర్క్ షాప్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని కలెక్టర్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రస్తుత డిజిటల్ యుగంలో సెమికండక్టర్ తయారీ, డిజైనింగ్ లకు ఎంతో డిమాండ్ ఉందని, ఈ రంగాలు అత్యంత కీలకమైనవని అన్నారు. ఐఐఐటీ విద్యార్థులకు ఇటువంటి శిక్షణ లభించడం ఎంతో గొప్ప విషయం అని తెలిపారు. విద్యార్థులు తమ కోర్ సబ్జెక్టులపై పట్టు సాధించాలని చెప్పారు. లభించిన ఈ అవకాశాన్ని పూర్తిగా వినియోగించుకుని శాస్త్ర సాంకేతిక రంగాల్లో గొప్పగా ఎదగాలని కాంక్షించారు. విద్యార్థుల్లో ప్రాక్టికల్ నాలెడ్జ్ పెంచేలా విద్యా బోధన సాగాలని సూచించారు. విద్యార్థులు అవసరమైన జ్ఞానాన్ని సంపాదించుకునేందుకు అన్ని వనరులను సమకూరుస్తున్నామని పేర్కొన్నారు. విద్య పూర్తికాకముందే ఉద్యోగ ఉపాధి అవకాశాలు పొందేలా తగిన అవకాశాలు కల్పిస్తున్నట్లు వివరించారు. విద్యార్థులకు బయట సమాజంలో ఉన్న అవకాశాలను వివరించి, వారిలో స్ఫూర్తిని నింపారు. ఏ విషయమైనా కూడా అధ్యాపకులను అడిగి విషయావగాహన పెంచుకోవాలని సూచించారు. ప్రతి విషయాన్ని లోతుగా విశ్లేషించుకొని, క్షుణ్ణంగా అర్థం చేసుకున్నప్పుడు అంశాలపై పట్టు సాధించవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, వర్సిటీ ఉపకులపతి గోవర్ధన్, ఎన్ఐఈఎల్ఐటి హైదరాబాద్ ఇన్చార్జ్ డైరెక్టర్ డాక్టర్ లక్ష్మణ్ కోర్ర, ఓఎస్డి మురళీ దర్శన్, ఐడెక్స్ మాజీ డైరెక్టర్ కల్నల్ (రిటైర్డ్) ఎ.కె. సింగ్, వీర టాక్టికల్ డైనమిక్స్ సీఈఓ సాయి తేజ, క్యూక్లైర్వాయన్స్ క్వాంటం ల్యాబ్స్ వి.పి. సేల్స్ శ్రీనివాస్, అధ్యాపకులు, విద్యార్థులు, అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

అణగారిన వర్గాల కోసం పోరాడిన మహనీయుడు

సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ - చిత్రపటానికి పూలమాలతో నివాళులు

- జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటీల్

నాగర్‌కర్నూల్ ఆగస్టు 18 ప్రజా కలం (ప్రతినిధి): సామాజిక సమానత్వం అణగారిన వర్గాల హక్కుల పరిరక్షణ కోసం పోరాడిన మహనీయుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ కొనియాడారు మంగళవారం నాడు నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రం కలెక్టరేట్‌లోని వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి వేడుకల సందర్భంగా చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు ఈ వేడుకలు ఉద్దేశించి మాట్లాడుతూ నేటి తరానికి ఆయన పోరాటాలు ఆశయాలు స్ఫూర్తిదాయకమన్నారు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ సమాజంలో నెలకొన్న అసమానతలు, దోపిడీ, అన్యాయాలకు వ్యతిరేకంగా ఆయన చేసిన పోరాటం చిరస్మరణీయమన్నారు. సమాజంలోని అన్ని వర్గాల ప్రజలకు సమాన అవకాశాలు, హక్కులు లభించేలా ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని సూచించారు. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా అధికారులు కృషి చేయాలని ఆదేశించారు. ఆయన ఆశయాలను కేవలం జయంతి వేడుకలకే పరిమితం చేయకుండా, సామాజిక సమానత్వం, సామాజిక న్యాయం, ప్రజా సంక్షేమం వంటి విలువలను ప్రతి ఒక్కరూ జీవితంలో ఆచరించాలని కలెక్టర్ సూచించారు. సమాజంలో వివక్షకు తావులేకుండా అన్ని వర్గాల ప్రజలు పరస్పర సహకారంతో ముందుకు సాగినప్పుడే సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు. వెనుకబడిన తరగతుల సంక్షేమం, విద్య, ఉపాధి, ఆర్థిక అభివృద్ధికి ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలను అందిపుచ్చుకోవాలని అన్నారు ఈ కార్యక్రమంలో ఏవో చంద్రశేఖర్ బీసీ సంక్షేమ శాఖ సహాయ అధికారి శ్రీరాములు వివిధ శాఖల జిల్లా అధికారులు గౌడ సంఘ నాయకులు ఇతర ప్రముఖులు పాల్గొని నివాళులర్పించారు

పసికందును కాపాడేందుకు దాతల సాయం కోసం వేడుకోలు

తానూర్, ఆగస్టు 18(ప్రజా కలం): మండల కేంద్రమైన ముథోల్ కు చెందిన రమేష్, జ్యోతి దంపతుల కుటుంబంలో వరుస విషాదాలు చోటుచేసుకున్నాయి, రెండో, మూడవ సంతానం పుట్టిన వెంటనే మృతిచెందడంతో ఆ తల్లిదండ్రులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు,నాల్గోవ సంతానం పుట్టిందన్న సంతోషం కూడా ఎంతోసేపు నిలవకముందే మరో విషాదం వారిని కుదిపేసింది, కళ్లు కూడా సరిగా తెరవని పసికందు ప్రస్తుతం నిజామాబాద్ లోని ఓ ఆస్పత్రిలోని ఐసీయూలో ప్రాణాలతో పోరాడుతున్నాడు, పసికందు పరిస్థితి విషమంగా ఉండటంతో వైద్యులు చికిత్స అందిస్తున్నారు, తల్లి జ్యోతి భైంసాలోని ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది, రమేష్, జ్యోతి దంపతుల కుటుంబ పరిస్థితి కూడా అత్యంత దయనీయంగా ఉంది, రేకుల ఇంట్లో నివసిస్తూ, రెక్కాడితే కానీ డొక్కాడని పరిస్థితిలో జీవనం సాగిస్తున్నారు, ఇలాంటి సమయంలో నవజాత శిశువుకు ఖరీదైన వైద్యం అవసరం కావడంతో కుటుంబం తీవ్ర ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటోంది, తన బిడ్డను ఎలాగైనా కాపాడాలని తల్లి చేతులు జోడించి కన్నీటితో వేడుకుంటున్న దృశ్యం పలువురిని కంటతడి పెట్టిస్తోంది,అభం శుభం తెలియనిఆ పసికందు ప్రాణాలకోసం కుటుంబ సభ్యులుదాతల సహాయం కోరుతున్నారు, మానవత్వంతో స్పందించే దాతలు తమకు తోచినంత ఆర్థిక సహాయం అందించి పసికందు చికిత్సకు అండగా నిలవాలని కుటుంబ సభ్యులు విజ్ఞప్తి చేస్తున్నారు.చిన్నారి ప్రాణాలను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని కోరుతున్నారు, సహాయం చేయదలచిన వారు 9100059340, 9704973532, 9966027148 ఫోన్ పే నెంబర్లకు పంపాలని కోరారు.

వర్షాల వల్ల దెబ్బతిన్న రోడ్లకు మరమ్మత్తులు చేపట్టాలి:- జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా

నిర్మల్, ఆగస్టు 18(ప్రజా కలం జిల్లా ప్రతినిధి): ఇటీవలి భారీ వర్షాలు కురిసినందున దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం బాసర మండలం బిద్రెల్లి సమీపంలో ఇటీవలి భారీ వర్షాలకు దెబ్బతిన్న అంతర్రాష్ట్ర రహదారిని కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంతమేరకు రోడ్లు దెబ్బతిన్నాయో అధికారుల నుంచి వివరాలను అడిగి తెలుసుకున్నారు. దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని పేర్కొన్నారు. ప్రయాణికులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా రహదారులు ఉండాలన్నారు. అవసరమైన సూచికల బోర్డులు తప్పనిసరిగా ఉండాలన్నారు. ఈ పరిశీలనలో భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, ఈఈ ఆర్ అండ్ బి సుభాష్, తహసిల్దార్ పవన చంద్ర, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

చేతన ఫౌండేషన్ ద్వారాప్రభుత్వ పాఠశాల
విద్యార్థులకు 700నోట్ బుక్స్ పంపిణీ

పాలేరు ఆగస్టు 18 (ప్రజా కలం న్యూస్)
కూసుమంచి మండల కేంద్రంలోనే మంగళవారం ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు చేతన ఫౌండేషన్ ద్వారా కూసుమంచి ప్రాథమిక పాఠశాల, కూసుమంచి ఎస్సి కాలనీ పాఠశాలల విద్యార్థులకు నాణ్యమైన 700 నోటుబుక్సు కూసుమంచి ఎంఈఓ రాయల.వీరస్వామి ఆధ్వర్యంలో మంగళవారం నాడు పంపిణీ చేశారు.ఈసందర్భంగా చేతన ఫౌండేషన్ ముఖ్య సభ్యుడు ముత్తినేని

సురేష్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదివే పేద విద్యార్థుల కోసం సుమారు 20వేల రూపాయలు విలువైన నోట్ బుక్స్ అందిస్తున్నామని, విద్యార్థులు వాటిని ఉపయోగించుకోవాలని కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని కోరారు.గతంలో తమ ఫౌండేషన్ ద్వారా కూసుమంచి ఉన్నత పాఠశాలకు 2లక్షల రూపాయిల విలువైన ఎల్ఈడి టీవీ అందించామని కరోనా సమయంలో నిరుపేద విద్యార్థులకు లక్ష రూపాయల విలువైన 100 స్కూల్ బ్యాగ్ కిట్స్ అందించామని తెలిపారు.ఈ సందర్భంగా ఎంఈఓ రాయల.వీరస్వామి మాట్లాడుతూ చేతన ఫౌండేషన్ సేవలు అభినందనియమని విద్యార్థులు వాటిని ఉపయోగించుకొని కష్టపడి చదవాలని అన్నారు.ఈ కార్యక్రమంలో కూసుమంచి గ్రామ సర్పంచ్ కొండా.కృష్ణవేణి,ఎస్సీకాలనీ పాఠశాల హెచ్ ఎం భాస్కర్, పాఠశాల సిబ్బంది,చేతన ఫౌండేషన్ సభ్యులు సంతోష్ కుమార్,విద్యార్థులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో పెద్దపల్లిలో నాగులచవితి వేడుకలు

గద్వాల ప్రతినిధి ఆగస్టు 18 ప్రజా కలం: నాగులచవితి పర్వదినాన్ని పురస్కరించుకుని జోగులాంబ గద్వాల జిల్లా, మల్దకల్ మండలం, పెద్దపల్లి గ్రామంలో భక్తిశ్రద్ధలతో వేడుకలు నిర్వహించారు. గ్రామ సర్పంచ్ అల్వాల శిరీష రాజశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో ఆంజనేయ స్వామిని ఎద్దుల బండిపై తిప్ప/గట్టు వద్దకు భక్తిపూర్వకంగా ఊరేగింపుగా తీసుకెళ్లారు. భజన బృందం, బ్యాండు మేళం, డోళ్ల నడుమ భక్తులు భజనలు చేస్తూ స్వామివారిని ఊరేగించారు.ఈ సందర్భంగా సర్పంచ్ శిరీష మాట్లాడుతూ గ్రామ ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని, సమృద్ధిగా వర్షాలు కురిసి పంటలు బాగా పండాలని స్వామివారిని ప్రార్థించినట్లు తెలిపారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ లక్ష్మి నరసింహ, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, యువకులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రజా కలం
బుధవారం, ఆగస్టు 19, 2026

ప్రజారోగ్యంతో ఆటలాడుతున్న.. కల్తీ రాక్షసులు!

మనిషి ఆరోగ్యానికి మందుల కంటే ముందుగా అవసరమయ్యేది సురక్షితమైన ఆహారం. కానీ నమ్మి తినే ఆహారమే కల్తీ బారిన పడితే ప్రజారోగ్యం ఎంతటి ముప్పును ఎదుర్కొంటుందో హైదరాబాద్‌లో వరుసగా వెలుగుచూస్తున్న ఘటనలు హెచ్చరిస్తున్నాయి. ఆగస్టు 18న హైదరాబాద్‌లో 130 ఆహార సంస్థల్లో తనిఖీలు నిర్వహించి సుమారు 36 టన్నుల కల్తీ నెయ్యి, ముడిపదార్థాలు స్వాధీనం చేసుకున్నారు. ఇందులో 25.5 టన్నుల కల్తీ నెయ్యి, 8.7 టన్నుల క్రీమ్, 1,200 లీటర్ల పామాయిల్, 600 లీటర్ల వనస్పతి ఉన్నాయి. చౌకైన నూనెలు, వనస్పతి, కృత్రిమ సువాసనలతో నెయ్యిని తయారు చేస్తున్నట్లు అధికారులు గుర్తించారు. ఇది ఒక్క నెయ్యి సమస్య కాదు. ఆగస్టు 4న హైదరాబాద్‌లో దాదాపు 25 టన్నుల కల్తీ మసాలాలు స్వాధీనం చేసుకున్నారు. అజ్వైన్, జీలకర్ర, లవంగాలు, ఆవాలు తదితర పదార్థాలు ఈ తనిఖీల్లో పట్టుబడ్డాయి. తెలంగాణలో సమస్య విస్తృతిని గణాంకాలు కూడా సూచిస్తున్నాయి. 2021 నుంచి 2024 సెప్టెంబరు వరకు పరీక్షించిన ఆహార నమూనాల్లో సుమారు 15 శాతం ఎఫ్ఎస్ఎస్ఏఐ ప్రమాణాలకు అనుగుణంగా లేవని కేంద్రం వెల్లడించినట్లు నివేదికలు పేర్కొంటున్నాయి. దేశవ్యాప్తంగా గత మూడు సంవత్సరాల్లో 5.18 లక్షలకు పైగా ఆహార నమూనాలను పరీక్షించగా, 88,192 జరిమానాలు విధించి, 3,614 కేసుల్లో శిక్షలు ఖరారయ్యాయని కేంద్ర ప్రభుత్వం తెలిపింది. అందుకే ఇప్పుడు అవసరమైంది అప్పుడప్పుడు దాడులు కాదు.. శాశ్వత నాణ్యత వ్యవస్థ. ప్రతి జిల్లాలో ఆధునిక ఆహార నాణ్యత ప్రయోగశాలలు ఏర్పాటు చేయాలి. నమూనాలు హైదరాబాద్‌కు పంపి ఫలితాల కోసం వేచి ఉండకుండా జిల్లాస్థాయిలోనే వేగంగా పరీక్షించే సదుపాయం ఉండాలి. అవసరమైన చోట సంచార ప్రయోగశాలలను ఏర్పాటు చేసి మార్కెట్లు, హోటళ్లు, తయారీ కేంద్రాల్లో అక్కడికక్కడే ప్రాథమిక పరీక్షలు నిర్వహించాలి. కల్తీ నిర్ధారణైనప్పుడు చర్యలు కూడా స్పష్టంగా ఉండాలి. తీవ్రమైన ఉల్లంఘనలకు భారీ జరిమానాతో పాటు లైసెన్సు తాత్కాలిక నిలిపివేత, పునరావృత ఉల్లంఘనలకు లైసెన్సు రద్దు, ప్రజారోగ్యానికి ప్రమాదకరమైన కల్తీకి క్రిమినల్ చర్యలు తప్పనిసరి కావాలి. అదే సమయంలో నిజాయితీగా వ్యాపారం చేసే చిన్న సంస్థలకు నాణ్యత ప్రమాణాలపై శిక్షణ, మార్గదర్శకత్వం అందించాలి. తయారీదారు నుంచి వినియోగదారుడి వరకు సరఫరా గొలుసును డిజిటల్‌గా గుర్తించే విధానం, ప్రతి బ్యాచ్‌కు గుర్తింపు సంఖ్య, త్వరిత ఫిర్యాదు పరిష్కార వ్యవస్థ అవసరం. కల్తీ ఆహారం వ్యాపార మోసం మాత్రమే కాదు.. ప్రజారోగ్యంపై దాడి. తనిఖీలు, నాణ్యత ప్రయోగశాలలు, సాంకేతిక పర్యవేక్షణ, కఠినమైన లైసెన్సింగ్ చర్యలు, ప్రజల అప్రమత్తత–ఇవన్నీ కలిసినప్పుడే ప్రతి కుటుంబానికి "తినే తిండి.. సురక్షితమైన తిండి" అనే భరోసా లభిస్తుంది. లాభం కోసం వ్యాపారం చేయవచ్చు.. ప్రజల ఆరోగ్యాన్ని పణంగా పెట్టి కాదు.

(రచయిత: హెచ్. ప్రతాప్)

నూతన నాయకత్వంతో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ గ్రామ కమిటీలు

అయినవోలు, ఆగస్టు 18:–(ప్రజా కలం ప్రతినిధి)

పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు అయినవోలు మండలంలోని గర్నెపెల్లి, ఉడుతగూడెం గ్రామాల్లో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ అనుబంధ సంఘాల నూతన గ్రామ కమిటీలను మంగళవారం ఎన్నుకున్నారు. మండల ఇన్‌చార్జి బరిగెల ఏలియా మాదిగ, కో–ఇన్‌చార్జిలు ఇస్రాం బాబు, సింగారపు చంద్రమౌళి, కటుకూరి రమేష్, మరుపట్ల దేవదాస్ తదితరుల ఆధ్వర్యంలో ఎన్నికలు జరిగాయి. గర్నెపెల్లి ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడిగా గబ్బెట అనీల్ మాదిగ, అధికార ప్రతినిధిగా శిథిరాల నాగరాజు, ప్రధాన కార్యదర్శిగా దర్శనాల జోసెఫ్, ఉపాధ్యక్షులుగా శిథిరాల రవి, గబ్బెట రాజు, కోశాధికారిగా గబ్బెట వెంకట్ వెంకటేష్‌ను ఎన్నుకున్నారు. ఎంఎస్పీ అధ్యక్షుడిగా దర్శనాల బాబు, అధికార ప్రతినిధిగా గబ్బెట రాజు, ప్రధాన కార్యదర్శిగా దర్శనాల హరీష్, ఉపాధ్యక్షులుగా దర్శనాల యాకయ్య, గబ్బెట మైసయ్య, కోశాధికారిగా గబ్బెట చేరాలను ఎన్నుకున్నారు. ఉడుతగూడెం ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడిగా మిద్దెపాక రాజు మాదిగ, అధికార ప్రతినిధిగా బరిగెల రమేష్ మాదిగ, ప్రధాన కార్యదర్శిగా తాటికాయల రవి, ఉపాధ్యక్షులుగా గడ్డం సారయ్య, వన్ ఇల్లందల కుమార్, మొలుగూరి రాకేష్, అంబాల వంశీ, కోశాధికారిగా తాటికాయల మహేందర్‌ను ఎన్నుకున్నారు. ఎంఎస్పీ అధ్యక్షుడిగా గడ్డం యాదగిరి మాదిగను ఎంపిక చేశారు. కార్యక్రమంలో పలువురు యువకులు పాల్గొన్నారు. మందకృష్ణ మాదిగ నాయకత్వం వర్ధిల్లాలి.. జై మాదిగ అంటూ నినాదాలు చేశారు. రేపు జరిగే మండల సమావేశానికి అన్ని గ్రామాల అధ్యక్షులు, ఉపాధ్యక్షులు ఉదయం 10 గంటలకు అయినవోలు అంబేద్కర్ విగ్రహం వద్దకు హాజరుకావాలని మండల ఇన్‌చార్జి బరిగెల ఏలియా మాదిగ పిలుపునిచ్చారు.

అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి

– సీపీఎం జిల్లా కార్యదర్శి వర్ధం పర్వతాలు డిమాండ్
– రైతు కుటుంబాన్ని పరామర్శించిన సీపీఎం జిల్లా బృందం

నాగర్ కర్నూల్ ఆగస్టు 18 ప్రజా కలం ప్రతినిధి):

నాగర్ కర్నూల్ జిల్లాలోని తెలకపల్లి మండలం గట్టురాయిపాకుల గ్రామంలో అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్న రైతు చల్ల సుబ్బయ్య కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్ధం పర్వతాలు డిమాండ్ చేశారు. మంగళవారం నాడు సీపీఎం జిల్లా బృందం సుబ్బయ్య కుటుంబాన్ని పరామర్శించి కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది వర్షాలు సమృద్ధిగా కురుస్తాయనే ఆశతో సుబ్బయ్య తనకున్న 5 ఎకరాల భూమితో పాటు మరో 7ఎకరాల వ్యవసాయ భూమిని కౌలుకు తీసుకుని సాగు చేపట్టారని తెలిపారు. ఇందులో 4ఎకరాల్లో పత్తి, 3ఎకరాల్లో వరి సాగు చేశారని పేర్కొన్నారు. వ్యవసాయ పనుల విస్తరణ కోసం హార్వెస్టర్, ట్రాక్టర్ తదితర అవసరాల నిమిత్తం అప్పులు చేయడంతో మొత్తం అప్పు సుమారు రూ.30 లక్షలకు చేరిందని అన్నారు. అప్పుల భారం, ఆర్థిక ఇబ్బందులతో తీవ్ర మనస్తాపానికి గురైన సుబ్బయ్య ఆత్మహత్య చేసుకోవడం అత్యంత విషాదకరమని ఆవేదన వ్యక్తం చేశారు. రైతు కుటుంబం తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నందున ప్రభుత్వం తక్షణమే స్పందించాలని ఆదుకోవాలని కోరారు. స్థానిక ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్ వెంటనే రైతు కుటుంబాన్ని పరామర్శించి, కుటుంబానికి రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా అందించాలని డిమాండ్ చేశారు. కుటుంబానికి ప్రభుత్వ పరంగా అవసరమైన అన్ని సహాయ సహకారాలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్. శ్రీనివాసులు రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఎం. శ్రీనివాసులు, సీపీఎం జిల్లా నాయకులు నాగపూర్ మధు తదితరులు పాల్గొన్నారు.

సర్వాయి పాపన్న గౌడ్ ఆశయాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకం

- జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా

మహబూబ్ నగర్ ప్రజా కలం ప్రతినిధి ఆగష్టు 18:

సర్వాయి పాపన్న గౌడ్ జయంతి సందర్భంగా మహబూబ్‌నగర్ నగరంలోని పద్మావతి కాలనీ గ్రీన్ బెల్ట్‌లో నిర్వహించిన జయంతి వేడుకల్లో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి, మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ, దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి, జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి, జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా, మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్ తదితరులు పాల్గొని సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ సామాజిక అసమానతలకు వ్యతిరేకంగా పోరాడి, బడుగు, బలహీన వర్గాల ఆత్మగౌరవం కోసం కృషి చేసిన మహనీయుడు సర్వాయి పాపన్న గౌడ్ అని కొనియాడారు. అణగారిన వర్గాలకు సమాన హక్కులు, ఆత్మగౌరవం కల్పించాలనే లక్ష్యంతో ఆయన సాగించిన పోరాటం.స్ఫూర్తిదాయకమన్నారు. ఆయన ధైర్యసాహసాలు, ప్రజల కోసం చేసిన పోరాటం నేటి తరానికి ఆదర్శంగా నిలుస్తాయని పేర్కొన్నారు. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి ప్రజా ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని, అన్ని వర్గాలకు సమాన అవకాశాలు కల్పిస్తూ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తున్నామని తెలిపారు. సర్వాయి పాపన్న గౌడ్ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని సమానత్వం, సామాజిక న్యాయం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ మాట్లాడుతూ బహుజన రాజ్యాధికార సాధన కోసం పోరాడిన యోధుడు సర్వాయి పాపన్న గౌడ్ అని అన్నారు. అణగారిన వర్గాల హక్కులు, ఆత్మగౌరవం కోసం ఆయన చేసిన పోరాటం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిందని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా మాట్లాడుతూ ప్రజల హక్కులు, ఆత్మగౌరవం కోసం పోరాడిన ధీరుడు సర్వాయి పాపన్న గౌడ్ అని అన్నారు. ఆయన ధైర్యసాహసాలు, సామాజిక సమానత్వం కోసం చేసిన కృషి చిరస్మరణీయమని, ఆయన ఆశయాలు నేటి తరానికి ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి, నగర మేయర్ శ్రీమతి గుమ్మాల మమత శ్రీనివాస్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ బెక్కరి అనిత మధుసూదన్ రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు సంజీవ్ ముదిరాజ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వినోద్ కుమార్, సత్తూర్ చంద్రకుమార్ గౌడ్, సీజే బెనహర్, వివిధ డివిజన్ల కార్పొరేటర్లు, ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పిల్లల భవిష్యత్తుపై దృష్టి పెట్టాలి

- ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి ఉన్నత చదువులు చదివించండి
- ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి

మహబూబ్ నగర్ ప్రజా కలం ప్రతినిధి ఆగష్టు 18: కార్మిక కుటుంబాల పిల్లలు ఉన్నత విద్యను అభ్యసించి మంచి స్థాయికి ఎదగాలని, వారి భవిష్యత్తు కోసం తల్లిదండ్రులు ఇప్పటి నుంచే ప్రత్యేక శ్రద్ధ వహించాలని ప్రభుత్వ విప్, మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే శ్రీ యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ఎస్డీఎఫ్, ముడా నిధులు–25.50 లక్షలతో నిర్మించిన ప్లంబర్స్ అసోసియేషన్ భవనాన్ని గౌరవ ప్రభుత్వ విప్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. నగరంలో సుమారు 500 మంది ప్లంబర్లు, వారి కుటుంబాలు ఈ వృత్తిపై ఆధారపడి జీవిస్తున్నారని తెలిపారు. ప్లంబర్ల వృత్తి ఎంతో కష్టంతో కూడుకున్నదని, గోడలు ఎక్కడం, గుంతల్లోకి దిగి పనిచేయడం, డ్రైనేజీ పైపులైన్లు ఏర్పాటు చేయడం వంటి ప్రమాదకర పరిస్థితుల్లో పనిచేస్తున్నారని అన్నారు. మురుగు నీరు, దుర్వాసన మధ్య పనిచేయాల్సి రావడం వల్ల ఆరోగ్యపరమైన ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉన్నప్పటికీ ప్రజలకు అవసరమైన సేవలను అందిస్తున్నారని అభినందించారు. ప్లంబర్లు తమ పిల్లలను కూడా ఇదే కష్టమైన వృత్తిలోకి తీసుకురావడం కంటే వారికి మంచి విద్య అందించి ఉన్నత స్థాయికి తీసుకెళ్లాలని సూచించారు. కార్మికులు, రైతులు, పేద, మధ్యతరగతి కుటుంబాల పిల్లలు ఉన్నత చదువులు చదివితేనే వారి కుటుంబాల భవిష్యత్తు మెరుగుపడుతుందని అన్నారు. పిల్లల చదువుల కోసం వేల రూపాయలు అప్పులు చేసి ప్రైవేట్ పాఠశాలల్లో చేర్పించాల్సిన అవసరం లేదని ఎమ్మెల్యే సూచించారు. సమీపంలోని ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు మెరుగుపడుతున్నాయని, అవసరమైన మౌలిక వసతులు, సౌకర్యాల కల్పనపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు కూడా మంచి మార్కులు, ర్యాంకులు సాధిస్తున్నారని చెప్పారు. ఏదైనా పాఠశాలలో సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని, వాటి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కష్టపడి సంపాదించే డబ్బును పిల్లల చదువులు, కుటుంబ భవిష్యత్తు కోసం వినియోగించాలని యెన్నం శ్రీనివాస్ రెడ్డి సూచించారు. మద్యం వంటి వ్యసనాలకు బానిస కాకుండా తల్లిదండ్రులు క్రమశిక్షణతో ఉండాలని కోరారు. తల్లిదండ్రుల ప్రవర్తనను పిల్లలు అనుసరిస్తారని, చెడు అలవాట్లు పిల్లలపై ప్రతికూల ప్రభావం చూపుతాయని తెలిపారు. పిల్లలు చదువుకునే వయసులో తల్లిదండ్రులు వారికి ఆదర్శంగా నిలవాలని, పిల్లలు చెడు వ్యసనాలకు గురికాకుండా జాగ్రత్త తీసుకోవాలని సూచించారు. కుటుంబ భవిష్యత్తు, పిల్లల భవిష్యత్తు కోసం కొన్ని సందర్భాల్లో తల్లిదండ్రులు నిగ్రహంతో, బాధ్యతాయుతంగా వ్యవహరించాలని అన్నారు. ప్లంబర్స్ అసోసియేషన్ భవన నిర్మాణానికి కృషి చేసిన ప్రతినిధులను ఎమ్మెల్యే అభినందించారు. అసోసియేషన్‌కు భవిష్యత్తులో అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. భవనానికి సంబంధించిన మిగిలిన పనులు, అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు కూడా తన వంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. కార్మికులు కష్టపడి ఆత్మగౌరవంతో జీవిస్తున్నారని, వారి సంక్షేమంతో పాటు వారి పిల్లల భవిష్యత్తు కూడా ముఖ్యమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. "మీ కష్టం మీ కుటుంబాన్ని నిలబెడుతుంది.. మీ పిల్లల చదువు వారి భవిష్యత్తును నిర్మిస్తుంది" అని అన్నారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ శ్రీమతి గుమ్మాల మమత శ్రీనివాస్, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి, కార్పొరేటర్ మరియు ప్లంబర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ముక్తార్ ఖాన్, సభ్యులు ఆరీఫ్ ఖాన్, శేఖర్, నజీర్, జహీర్ ఖాన్, సిఐటియు కురుమూర్తి, ప్రతినిధులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

వర్షం కురిసినా వెనక్కి తగ్గని పాలిటెక్నిక్ విద్యార్థులు!

'శక్తి'లో పాలిటెక్నిక్ కోర్సును కలపొద్దంటూ గద్వాల్ కలెక్టరేట్ ఎదుట నిరసన

గద్వాల ప్రతినిధి ఆగస్టు 18 ప్రజా కలం:జోగులాంబ గద్వాల్ జిల్లా జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు వర్షాన్ని సైతం లెక్కచేయకుండా నిరసన చేపట్టారు. పాలిటెక్నిక్ కోర్సును 'శక్తి'లో కలపవద్దని డిమాండ్ చేస్తూ విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేశారు. పాలిటెక్నిక్ కోర్సును యథావిధిగా కొనసాగించాలని, తమ విద్యా భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఎలాంటి మార్పులు చేయరాదని విద్యార్థులు కోరారు. ప్రభుత్వం వెంటనే స్పందించి తమ సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

వర్షం కురుస్తున్నప్పటికీ విద్యార్థులు నిరసన కొనసాగిస్తూ తమ డిమాండ్లను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. పాలిటెక్నిక్ కోర్సును 'శక్తి'లో విలీనం చేయకుండా ప్రభుత్వం తక్షణమే నిర్ణయం తీసుకోవాలని విద్యార్థులు కోరారు.

ఇందిరమ్మ ఇంటితో పేదల కల సాకారం

–మేకలసోంపల్లిలో ఇళ్లను ప్రారంభించిన ఎమ్మెల్యే బండ్ల

గద్వాల ప్రతినిధి ఆగస్టు 18 ప్రజాబలం:

పేద ప్రజల సొంతింటి కలను నెరవేర్చడమే ప్రజాపాలన ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి అన్నారు. మల్దకల్ మండలం మేకలసోంపల్లి గ్రామంలో నిర్మాణం పూర్తయిన ఇందిరమ్మ ఇళ్లను ఆయన ప్రారంభించారు. లబ్ధిదారులు మహేశ్వరి, సువర్ణమ్మ నూతన గృహప్రవేశం సందర్భంగా ఎమ్మెల్యే రిబ్బన్ కట్ చేసి ఇళ్లను ప్రారంభించి, గృహప్రవేశ కానుకలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఒక్కో ఇంటికి రూ.5 లక్షల ఆర్థిక సాయం అందిస్తూ పేదల సొంతింటి కలను సాకారం చేస్తోందన్నారు. గద్వాల నియోజకవర్గంలో మొదటి విడతగా 3,500 ఇళ్లు మంజూరు కాగా, 2,000కు పైగా ఇళ్ల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. అర్హులైన ప్రతి కుటుంబానికి రెండో విడతలో ఇందిరమ్మ ఇల్లు అందేలా కృషి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడు రాజశేఖర్, మాజీ ఎంపీపీ రాజారెడ్డి, మాజీ జెడ్పీటీసీ ప్రభాకర్ రెడ్డి, సర్పంచ్ జయరాముడు, పంచాయతీ కార్యదర్శి భాస్కర్ రెడ్డి, నాయకులు శ్రీనివాస్ రెడ్డి, రమేశ్వర్ రెడ్డి, వెంకటేశ్వర్ రెడ్డి,చంద్రశేఖర్ రెడ్డి,ఉప సర్పంచ్ శివ,కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రారంభానికి సిద్ధమైన నూతన పంచాయతీ భవనం

ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభం

గద్వాల ప్రతినిధి ఆగస్టు 18 ప్రజా కలం: జోగులాంబ గద్వాల జిల్లా గద్వాల మండలం పరిధిలోని జిల్లేడ బండ గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామపంచాయతీ భవనం ప్రారంభానికి సిద్ధమైంది. బుధవారం ఉదయం 9 గంటలకు ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి చేతుల మీదుగా నూతన భవనాన్ని ప్రారంభించనున్నట్లు గ్రామ సర్పంచ్ నాగేష్ తెలిపారు. గ్రామ ప్రజల సౌకర్యార్థం నూతన పంచాయతీ భవనం అందుబాటులోకి రానుండటం సంతోషకరమని సర్పంచ్ తెలిపారు. భవనం అందుబాటులోకి రావడంతో గ్రామపంచాయతీ పాలన, ప్రజలకు అందించే సేవలు మరింత సులభతరం కానున్నాయని పేర్కొన్నారు. ప్రారంభోత్సవ కార్యక్రమానికి గ్రామ వార్డు సభ్యులు, అధికారులు, నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సర్పంచ్ నాగేష్ కోరారు.

గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ముమ్మరంగా పారిశుధ్య పనులు

నిర్మల్ ఆగస్టు 18 (ప్రజా కలం జిల్లా ప్రతినిధి) కుబీర్ మండలం లోని పార్డి(బి) గ్రామంలో పారిశుధ్య నిర్వహణకు పార్డి(బి) గ్రామ పంచాయతీ ప్రత్యేక చర్యలు చేపట్టింది. మంగళవారం పంచాయతీ ఆధ్వర్యంలో పారిశుధ్య సిబ్బంది గ్రామంలోని ప్రధాన వీధులు, కాలనీలు, రహదారులు, పరిసరాల్లో ముమ్మరంగా శుభ్రత పనులు చేపట్టారు. మురికి కాలువలలో ఎక్కడికక్కడ పేరుకుపోయిన చెత్తాచెదారం, వ్యర్థాలను తొలగించి నీరు సాఫీగా వెళ్లేలా శుభ్రం చేశారు. దోమలు, ఈగలు వ్యాప్తి చెందకుండా మురుగు ప్రాంతాలను శుభ్రం చేయడంతో పాటు బ్లీచింగ్ పౌడర్ లను చెల్లారు. ఈ పనులను గ్రామ పంచాయతీ వార్డు సభ్యులు కోల్కొండ శ్రీనివాస్ దగ్గరుండి పారిశుద్ధ్య పనులు చేయించారు. వర్షాకాలంలో పారిశుధ్య లోపాల కారణంగా ప్రజలు ఇబ్బందులు పడకుండా ముందస్తు చర్యల్లో భాగంగా ఈ పనులను చేపడుతున్నట్లు పంచాయతీ కార్యదర్శి భుమేశ్ తెలిపారు. గ్రామంలోని ప్రతి కుటుంబం తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, చెత్తను రోడ్లపై, కాలువల్లో వేయకుండా పంచాయతీ సిబ్బందికి సహకరించాలని ఆయన సూచించారు.

సర్దార్ పాపన్న గౌడ్ ఆశయాలను బహుజనులు ముందుకు తీసుకెళ్లాలి : డాక్టర్ కొరిపల్లి శ్రీనివాస్



ఖమ్మం ఆగస్టు 18 (ప్రజా కలం న్యూస్) ఖమ్మం నగరంలోని మంగళవారం ట్యాంక్‌బండ్ వద్ద సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి వేడుకలను బహుజన కులాల జేఏసీ, తెలంగాణ మాదిగ హక్కుల దండోరా (టీఎంహెచ్‌డీ) ఖమ్మం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన తెలంగాణ మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర అధ్యక్షులు, దళితరత్న డాక్టర్ కొరిపల్లి శ్రీనివాస్ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ కొరిపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ.. మొఘలాయిల పెత్తనంపై సమర శంఖారావం పూరించి గోల్కొండ కోటపై జెండా ఎగురవేసిన బహుజన చక్రవర్తి సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని కొనియాడారు. తెలంగాణ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిన మహనీయుడైన పాపన్న గౌడ్ వందల ఏళ్ల క్రితమే బహుజన వర్గాల కోసం పోరాటం చేశారని అన్నారు. ఆయన ఆశయాలను వారసులుగా బహుజన వర్గాల ప్రజలు ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీసీ జేఏసీ రాష్ట్ర కార్యదర్శి పోడకంటి రాంబాబు, ముస్లిం లీగల్ పార్టీ అధ్యక్షులు షేక్ బాజీ బాబా, మాల మహానాడు జిల్లా అధ్యక్షులు దాసరి శ్రీనివాస్, మాల దాసరి సంఘం రాష్ట్ర కార్యదర్శి మార్కాపురం శ్రీనివాస్, బుడగ జంగం ఖమ్మం జిల్లా అధ్యక్షులు గంగు స్వామి, కొలుపుల సంఘం జిల్లా అధ్యక్షులు ఏ. రాఘవులు, పిల్లి గుండ్ల ముత్తయ్య, జంగం వెంకయ్య, చిర్రా నరేష్, రామారావు, మధు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376వ జయంతి వేడుకలు

ఆళ్లపల్లి, ఆగస్టు 18, ప్రజాకలం:ఆత్మగౌరవానికి ప్రతీక, తెలంగాణ వీర యోధుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376వ జయంతి వేడుకలను మర్కోడు, ఆళ్లపల్లి మండలాల్లో గౌడ సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ర్యాలీలు నిర్వహించి పాపన్న గౌడ్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. మర్కోడులో నిర్వహించిన కార్యక్రమంలో గౌడ సంఘం పెద్దలు తాళ్లపల్లి వెంకన్న, యాసరపు బాబు మాట్లాడుతూ.. మొగల్ సామ్రాజ్యానికి వ్యతిరేకంగా పోరాడి తెలంగాణ గడ్డపై స్వయంపాలన సాధించిన తొలి వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని కొనియాడారు. ఆయన త్యాగాలు నేటి తరానికి ఆదర్శమని పేర్కొన్నారు. పాపన్న గౌడ్ ఆశయాలను కొనసాగిస్తూ బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తీర్మానించారు.

కార్యక్రమంలో సంఘ నాయకులు పొదల రాము, తాళ్లపల్లి రామ్మూర్తి, బుర్ణ రాంబాబు, తాళ్లపల్లి రమేష్, కసబోయిన వెంకటేశ్వర్లు, కొంపెల్లి సాంబయ్య, కోరుకొప్పుల యాకయ్య, బత్తిని శ్రీను, తాళ్లపల్లి ఎల్లా గౌడ్, తాళ్లపల్లి రవి, తాళ్లపల్లి చిరంజీవి, వగలబోయిన సతీష్, రణం మల్లికార్జున్, తాళ్లపల్లి నవీన్, తాళ్లపల్లి సదయ్య, కుర్ర ఎల్లా గౌడ్, వగలబోయిన రాంబాబు, రణం శేఖర్, యాసరపు సతీష్, గుండు నరేందర్, తాళ్లపల్లి సుధాకర్, యాసరపు జనార్ధన్, తాళ్లపల్లి శ్రావణ్, తాళ్లపల్లి శేఖర్, బుర్ణ సతీష్ తదితరులు, మహిళలు, యువకులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల కమిటీ రద్దు చేయాలి

- వార్డు సభ్యులకే ఎంపిక బాధ్యత ఇవ్వాలి
- గుండా ఉపేందర్ రెడ్డి

పాలేరు ఆగష్టు 18(ప్రజా కలం న్యూస్)

కూసుమంచి పేదలకు న్యాయం జరగాలంటే ఇందిరమ్మ ఇళ్ల కమిటీలను రద్దు చేసి, ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన వార్డు సభ్యులకు ఇళ్ల ఎంపిక బాధ్యత అప్పగించాలని తెలంగాణ వార్డు మెంబర్స్ ఫోరం జిల్లా ఇన్‌చార్జ్ గుండా ఉపేందర్ రెడ్డి డిమాండ్ చేశారు. కూసుమంచి మండల కేంద్రంలో తెలంగాణ వార్డు మెంబర్స్ ఫోరం మండల ఇన్‌చార్జ్ కర్ల రామారావు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇళ్ల కమిటీల ఏర్పాటు, అర్హులైన పేదల ఎంపికపై వార్డు సభ్యులు చర్చించారు. సమావేశంలో గుండా ఉపేందర్ రెడ్డి మాట్లాడుతూ. గతంలో స్థానిక సంస్థలకు ఎన్నికలు జరగకపోవడంతో ప్రజా ప్రతినిధులు అందుబాటులో లేని పరిస్థితుల్లో ప్రభుత్వం జీవో నంబర్ 33 ద్వారా ఇందిరమ్మ ఇళ్ల కమిటీలను ఏర్పాటు చేసిందన్నారు. అయితే కమిటీల్లో మెజార్టీ సభ్యులు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ఉండటంతో అర్హులైన పేదలకు ఇళ్ల ఎంపికలో అన్యాయం జరిగే అవకాశం ఉందని ఆరోపించారు. ప్రస్తుతం ప్రతి గ్రామంలో ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన వార్డు సభ్యులు ఉన్నందున, జీవో నంబర్ 33ను రద్దు చేసి స్థానిక ప్రజా ప్రతినిధులైన వార్డు సభ్యులకు ఇందిరమ్మ ఇళ్ల ఎంపిక బాధ్యత అప్పగించాలని కోరారు. తమ వార్డుల్లోని పేదలు, అర్హులైన లబ్ధిదారులు ఎవరో వార్డు సభ్యులకు పూర్తి అవగాహన ఉంటుందని తెలిపారు. అర్హులైన పేదలకు న్యాయం జరగాలంటే ఇందిరమ్మ ఇళ్ల ఎంపిక బాధ్యతను వార్డు సభ్యులకే అప్పగించాలని డిమాండ్ చేశారు. ఎన్నికైన వార్డు సభ్యులను గౌరవించి ఇందిరమ్మ ఇళ్ల కమిటీల్లో వారికి సభ్యులుగా అవకాశం కల్పించాలని కోరారు. లేనిపక్షంలో ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన వార్డు సభ్యులందరినీ ఏకం చేసి కమిటీ రద్దు అయ్యేంత వరకు పోరాటం కొనసాగిస్తామని, తమ న్యాయపరమైన హక్కులను సాధించుకుంటామని గుండా ఉపేందర్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ సమావేశంలో వార్డు సభ్యులు చెరుకుపల్లి వీరయ్య, ఐతగాని నవీన్, అర్వపల్లి ఉపేందర్ గౌడ్, మంద నవ్య చంద్రశేఖర్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ బలోపేతమే లక్ష్యం

సమన్వయంతో ముందుకు సాగాలి - ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి

మహబూబ్ నగర్ ప్రజా కలం ప్రతినిధి ఆగష్టు 18: కాంగ్రెస్ పార్టీని సంస్థాగతంగా మరింత బలోపేతం చేసి, నాయకులు, కార్యకర్తల సమన్వయంతో ముందుకు సాగుతామని ప్రభుత్వ విప్, మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే లిశ్రీ యెన్నం శ్రీనివాస్ రెడ్డి లి తెలిపారు. మహబూబ్‌నగర్ జిల్లా కాంగ్రెస్ పొలిటికల్ అఫైర్స్ కమిటీ సమావేశం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఎఐసిసి కార్యదర్శి లిశ్రీ సచిన్ సావంత్ లి ముఖ్య అతిథిగా పాల్గొని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సంబంధించి పాత్రికేయులతో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే లిశ్రీ యెన్నం శ్రీనివాస్ రెడ్డి లి మాట్లాడుతూ, జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన మహబూబ్‌నగర్ జిల్లా కాంగ్రెస్ పొలిటికల్ అఫైర్స్ కమిటీ సమావేశంలో పలు అంశాలపై విస్తృతంగా చర్చించామని, ఈ సమావేశానికి రాష్ట్ర మంత్రి లిశ్రీ వాకిటి శ్రీహరి లి మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, వివిధ అనుబంధ విభాగాల చైర్మన్ లు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు హాజరయ్యారని తెలిపారు. ఏఐసీసీ కార్యదర్శి లిశ్రీ సచిన్ సావంత్ లి ప్రత్యేకంగా పాల్గొని పార్టీ సంస్థాగత వ్యవహారాలు, భవిష్యత్ కార్యాచరణపై నాయకులకు దిశానిర్దేశం చేశారని. సమావేశంలో ప్రధానంగా ఎస్ఐఆర్ ప్రక్రియపై చర్చ జరిగినట్లు ప్రభుత్వ విప్ తెలిపారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ అవకాశం కల్పించేలా చర్యలు తీసుకోవాలని, ఇప్పటివరకు ఎస్ఐఆర్ ఫారాలు సమర్పించని వారికి అవకాశం లభించినప్పుడు ఫారాలు సమర్పించేలా చూడాలని నిర్ణయించినట్లు చెప్పారు. క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న ఇబ్బందులు, లోపాలను గుర్తించి పరిష్కరించేందుకు సమన్వయంతో పనిచేయాలని సూచించినట్లు తెలిపారు. గ్రామస్థాయి నుంచి మండల, నియోజకవర్గ, జిల్లా స్థాయి వరకు నాయకులు, కార్యకర్తల మధ్య సమన్వయాన్ని మరింత పెంచాలని, క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సమస్యలను మండల, జిల్లా స్థాయిలో చర్చించి పరిష్కరించే విధంగా పార్టీ వ్యవస్థను బలోపేతం చేయాలని సూచించినట్లు ఆయన తెలిపారు. ప్రతి నెల ఒకరోజు పొలిటికల్ అఫైర్స్ కమిటీ సమావేశం నిర్వహించాలని నిర్ణయించినట్లు తెలిపారు. గత సమావేశాల్లో తీసుకున్న నిర్ణయాలు ఎంతవరకు అమలయ్యాయి, వాటి ఫలితాలు ఏమిటి, ఇంకా చేపట్టాల్సిన చర్యలు ఏమిటి అనే అంశాలపై తదుపరి సమావేశంలో సమీక్ష నిర్వహిస్తామని చెప్పారు. సమావేశాల మినిట్స్‌ను క్రమపద్ధతిలో నమోదు చేసి పీసీసీకి పంపేలా చర్యలు తీసుకుంటామని, అక్కడ నుంచి ఎఐసిసికి పంపిస్తామని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ సంస్థాగత నిర్మాణాన్ని మరింత బలోపేతం చేయడంతో పాటు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను పార్టీ నాయకులు, కార్యకర్తల ద్వారా ఇంటింటికీ తీసుకెళ్లడంపై సమావేశంలో ప్రత్యేకంగా చర్చించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ప్రతి నియోజకవర్గం, ప్రతి జిల్లాలో స్థానిక పరిస్థితులకు అనుగుణంగా ప్రత్యేక వ్యూహాన్ని రూపొందించుకొని అమలు చేయాలని ఏఐసీసీ కార్యదర్శి లిశ్రీ సచిన్ సావంత్ లి సూచించినట్లు చెప్పారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలను ప్రజలకు వివరించడంతో పాటు పార్టీ కార్యక్రమాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించినట్లు తెలిపారు. రాబోయే రెండు, మూడు సంవత్సరాల పాటు పార్టీ కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తూ, వాటి పై క్రమం తప్పకుండా ఫాలోఅప్ నిర్వహించాలని నిర్ణయించినట్లు ఆయన చెప్పారు. వచ్చే ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని ఇప్పటి నుంచే నాయకులు, కార్యకర్తలను చురుకుగా పనిచేసేలా కార్యాచరణ రూపొందిస్తున్నామని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ సంస్థాగత బలోపేతం, నాయకులు, కార్యకర్తల సమన్వయం, ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రచారం, క్షేత్రస్థాయి సమస్యల పరిష్కారం వంటి అంశాలపై సమగ్ర ప్రణాళిక రూపొందించుకొని ముందుకు సాగుతామని ప్రభుత్వ విప్ పేర్కొన్నారు.

ప్రభుత్వ విద్యా ప్రమాణాల పెంపుతో పాటు మౌళిక వసతుల బలోపేతానికి ప్రాధాన్యత

- విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి పీఎం శ్రీ కేంద్రీయ విద్యాలయాలు వేదికలుగా నిలవాలి - విద్యార్థులకు సురక్షితమైన, ఆహ్లాదకరమైన విద్యా వాతావరణం కల్పించాలి
- పీఎం శ్రీ కేంద్రీయ విద్యాలయం 2026-27 విద్యా సంవత్సరానికి సంబంధించి విద్యాలయ మేనేజ్మెంట్ కమిటీ సమావేశం లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్

పాలేరు ఆగస్టు18(ప్రజా కలం న్యూస్)

విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి పీఎం శ్రీ కేంద్రీయ విద్యాలయాలు వేదికలుగా నిలవాలని, ప్రభుత్వ విద్యా ప్రమాణాల పెంపుతో పాటు మౌళిక వసతుల బలోపేతానికి ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అన్నారు. మంగళవారం ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని పోలేపల్లి షిరిడి సాయినాథ్ నగర్ లోని ఖమ్మం పీఎం శ్రీ కేంద్రీయ విద్యాలయం 2026--27 విద్యా సంవత్సరానికి సంబంధించి విద్యాలయ మేనేజ్మెంట్ కమిటీ(విఎంసి) సమావేశం జిల్లా కలెక్టర్, వియంసి చైర్మన్ దివాకర టీఎస్ అధ్యక్షతన నిర్వహించారు. విద్యాలయంలోని విద్యా ప్రమాణాలు, విద్యార్థుల పరీక్ష ఫలితాలు, ప్రవేశాల పరిస్థితి, సహపాఠ్య కార్యక్రమాలు, పీఎం శ్రీ కార్యక్రమాల అమలు, డిజిటల్ విద్య, మౌళిక వసతులు, విద్యార్థుల భద్రత, విద్యాలయ అభివృద్ధికి అవసరమైన కార్యచరణ, అభివృద్ధి పనులపై సమగ్రంగా సమీక్షించారు. విద్యార్థుల విద్యా ప్రగతిపై నిరంతర పర్యవేక్షణ ముందుగా విద్యాలయం లో గత విద్యా సంవత్సరంలో సాధించిన విద్యా ఫలితాలు, విద్యార్థుల ప్రగతి, సహ పాఠ్య కార్యక్రమాల్లో సాధించిన విజయాలపై అధికారులు, ఉపాధ్యాయుల నుంచి వివరాలను కలెక్టర్ తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ, విద్యార్థుల విద్యా సామర్థ్యాలను నిరంతరం అంచనా వేస్తూ, వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. విద్యార్థులలో కేవలం పుస్తక పరిజ్ఞానాన్ని పెంపొందించడం మాత్రమే కాకుండా, భవిష్యత్తులో ఉన్నత విద్య, పోటీ పరీక్షలు, ఉపాధి అవకాశాలను ఎదుర్కొనే విధంగా అవసరమైన నైపుణ్యాలను పెంపొందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని కలెక్టర్ అన్నారు. 2026-27 విద్యా సంవత్సరంలో పీఎం శ్రీ కేంద్రీయ విద్యాలయంలో కొత్తగా మొత్తం 256 మంది విద్యార్థులకు ప్రవేశాలు కల్పించినట్లు సమావేశంలో అధికారులు వివరించారు. ఇందులో 1వ తరగతిలో 121 మంది విద్యార్థులకు ఆన్‌లైన్ ద్వారా ప్రవేశాలు కల్పించగా, కేవీఎస్ నిబంధనల ప్రకారం మరో 22 మంది విద్యార్థులకు ప్రవేశాలు కల్పించినట్లు వివరించారు.

విద్యార్థుల ప్రవేశ ప్రక్రియలో పారదర్శకత, నిబంధనల అమలు తప్పనిసరిగా ఉండాలని కలెక్టర్ సూచించారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా తరగతి గదులు, ఫర్నిచర్, తాగునీరు, పారిశుద్ధ్యం, మరుగుదొడ్లు, విద్యుత్, డిజిటల్ పరికరాలు వంటి సౌకర్యాలు సమృద్ధిగా ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.

డిజిటల్ విద్యకు ప్రాధాన్యత

విద్యాలయంలో డిజిటల్ విద్యకు అందుబాటులో పాఠశాలలో 55 కంప్యూటర్లు, హైస్పీడ్ బ్రాడ్‌బ్యాండ్, వై-ఫై కనెక్టివిటీ, 25 ఈ-క్లాస్‌రూమ్‌లు/ ఇంటరాక్టివ్ బోర్డు ప్యానెల్స్ అందుబాటులో ఉన్నాయని అధికారులు వివరించారు.

సీనియర్, జూనియర్ కంప్యూటర్ ల్యాబ్‌లను విద్యార్థుల అవసరాలకు అనుగుణంగా మరింత సమర్థవంతంగా వినియోగించాలని కలెక్టర్ సూచించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని విద్యార్థుల అభ్యసనలో భాగం చేయాలని, డిజిటల్ వనరుల ద్వారా బోధనను మరింత ఆసక్తికరంగా, ప్రభావవంతంగా నిర్వహించాలని అన్నారు.

క్రీడలకు ప్రత్యేక ప్రాధాన్యత

విద్యాలయంలో సుమారు మూడు ఎకరాల విస్తీర్ణంలో విశాలమైన క్రీడా మైదానం ఉందని, బాస్కెట్‌బాల్, ఫుట్‌బాల్, హ్యాండ్‌బాల్, రెండు ఖో--ఖో కోర్టులు, కబడ్డీ కోర్టు వంటి సదుపాయాలు ఉన్నాయని అధికారులు వివరించారు. విద్యాలయ అవసరాలను సమీక్షించిన సందర్భంగా పలు అభివృద్ధి పనులను చేపట్టేందుకు ప్రతిపాదనలు సమావేశం చర్చించారు. విద్యాలయంలో ప్రధాన సమస్యలుగా గుర్తించిన సమస్యలపై, విద్యార్థుల భద్రత విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని కలెక్టర్ స్పష్టం చేశారు. పాఠశాల ఆవరణలో చెట్ల కొమ్మలను తొలగించడం, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం, పాములు సంచరించే అవకాశం ఉన్న ప్రాంతాలను గుర్తించి ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు.

కోతి బెడద నివారణకు సంబంధిత శాఖల సమన్వయంతో చర్యలు చేపట్టాలని, విద్యార్థులు పాఠశాలకు రాకపోకలు సాగించే అప్రోచ్ రోడ్డును సురక్షితంగా మార్చేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు. పాఠశాల పరిసరాలు పరిశుభ్రంగా, పచ్చదనంతో, ఆహ్లాదకరంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని, మొక్కల సంరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ పేర్కొన్నారు.

పాలేరు మత్స్య పరిశోధన కేంద్రంలో బయోఫ్లాక్ చేపల సాగుపై నైపుణ్యాభివృద్ధి శిక్షణ

పాలేరు ఆగష్టు 18(ప్రజా కలం న్యూస్)

మత్స్య పరిశోధన స్థానం, పాలేరు, పి.వి. నరసింహారావు తెలంగాణ పశువైద్య విశ్వవిద్యాలయం, హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో, భారతీయ వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి బ్యాంకు, వ్యవసాయ, రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వం, న్యూఢిల్లీ వారి ఆర్థిక సహకారంతో తెలంగాణ మత్స్యకారులు, మత్స్య రైతులకు నిర్వహిస్తున్న "బయోఫ్లాక్ విధానంలో చేపల సాగు" అంశంపై మూడు రోజుల నైపుణ్యాభివృద్ధి శిక్షణ కార్యక్రమం రెండో రోజు విజయవంతంగా ముగిసింది. ఈ కార్యక్రమానికి ఖమ్మం, రాజన్న సిరిసిల్ల, నిర్మల్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలకు చెందిన 25 మంది మత్స్య రైతులు, మత్స్యకారులు హాజరయ్యారు. మత్స్య పరిశోధన స్థానం పాలేరు సీనియర్ మత్స్య శాస్త్రవేత్త, అధిపతి డాక్టర్ ఎం. శ్యాం ప్రసాద్ మాట్లాడుతూ బయోఫ్లాక్ విధానంలో చేపల సాగుకు బ్లోయర్లు, వాటి ద్వారా అందించే ఏరియేషన్ ప్రాధాన్యతను మత్స్య రైతులకు వివరించారు. మత్స్య శాస్త్రవేత్త శ్రీ బి. రవీందర్ బయోఫ్లాక్ విధానంలో ఉపయోగించే వివిధ రకాల ట్యాంకుల్లో నీటి ఘనపరిమాణం కొలిచే విధానం, బయోఫ్లాక్ తయారీ, వివిధ రకాల చేపల నిల్వ సాంద్రతపై అవగాహన కల్పించారు.

రిషిక్ ఆక్వా ఫార్మ్స్, మంగళగూడెం ప్రొడక్షన్ మేనేజర్ శ్రీ పి. రమేష్ బయోఫ్లాక్ సాంకేతికత ద్వారా రొయ్యల పెంపకం, ఈ విధానంలో పెంచదగిన వివిధ రకాల సాగు చేపల గురించి వివరించారు. అదే సంస్థకు చెందిన సాంకేతిక మేనేజర్ శ్రీ ఎ. సాయికృష్ణ బయోఫ్లాక్ యూనిట్ ఏర్పాటు, ఆర్థిక విశ్లేషణ, భూమి సమతలీకరణ, లేఅవుట్ మార్కింగ్, యూనిట్ నిర్మాణం, ట్యాంకుల రకాలు, వాటి అమరిక తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. బయోఫ్లాక్‌లో చేప పిల్లలను విడుదల చేసే సమయంలో అవి సమాన పరిమాణంలో, ఒకే రంగులో, ఒకే సైజులో, చురుకుగా ఉండటంతో పాటు వ్యాధులు లేని ఆరోగ్యకరమైన చేప పిల్లలను ఎంపిక చేసుకోవాలని సూచించారు. బయోఫ్లాక్ సాగులో పాటించాల్సిన మెరుగైన యాజమాన్య పద్ధతులను కూడా వివరించారు. శిక్షణలో భాగంగా ఖమ్మం జిల్లాలోని చేగొమ్మలో క్షేత్రస్థాయిలో ఉన్న బయోఫ్లాక్ యూనిట్‌ను, సిరిపురంలోని శ్రీ లక్ష్మీ ప్రియ సమీకృత వ్యవసాయ క్షేత్రాన్ని, జుజ్జులరావుపేటలోని శ్రీ రాణి సమీకృత కోళ్లు-చేపల పెంపకం క్షేత్రాలను మత్స్య రైతులు సందర్శించారు. క్షేత్రస్థాయిలో బయోఫ్లాక్ సాగు విధానాన్ని పరిశీలించి, తమ సందేహాలను నిపుణులను అడిగి నివృత్తి చేసుకున్నారు. మత్స్య రైతులకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన కల్పిస్తూ నిర్వహిస్తున్న ఈ శిక్షణ కార్యక్రమం ఎంతో ఉపయోగకరంగా ఉందని నిర్వాహకులు తెలిపారు.

కొత్తగూడెం ప్రభుత్వాస్పత్రిలో ఎంపీ రఘురాం రెడ్డి ఆకస్మిక తనిఖీ

- మందుల కొరత, సౌకర్యాలపై ఆరా

ఖమ్మం ఆగస్టు 18 (ప్రజా కలం న్యూస్) ఉమ్మడి ఖమ్మం జిల్లాకొత్తగూడెం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రిని ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాం రెడ్డి మంగళవారం మధ్యాహ్నం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పత్రిలోని ఐసీయూ (ఇంటెన్సివ్ కేర్ యూనిట్)తో పాటు జనరల్ వార్డును పరిశీలించి, రోగులకు అందుతున్న వైద్య సేవలు, మందుల నిల్వలు మరియు ఇతర వసతుల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ తనిఖీ సమయంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ అందుబాటులో లేకపోవడం గమనార్హం. మందుల స్టాక్‌కు సంబంధించిన వివరాలపై ఆరా తీయగా, ఇటీవలె బదిలీపై వచ్చానని అక్కడ అందుబాటులో ఉన్న ఒక మహిళా వైద్యురాలు సమాధానమిచ్చారు. ఆస్పత్రిలో మందుల కొరత ఉందంటూ తనకు పలు ఫిర్యాదులు అందాయని, రోగులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా మెరుగైన వైద్యం అందించాలని ఈ సందర్భంగా ఎంపీ అధికారులను ఆదేశించారు. అనంతరం దిశ సమావేశం సమయం కావడంతో ఆయన మధ్యాహ్నం 3:10 గంటల ప్రాంతంలో కలెక్టరేట్ కు బయలుదేరి వెళ్లారు.

ఘనంగా సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి వేడుకలు

రుద్రంగి, ఆగష్టు 18, (ప్రజాకలం ప్రతినిధి) 376వ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి పురస్కరించుకొని మంగళవారం రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి మండల కేంద్రంలో బహుజన సమాజ్ పార్టీ మండల అధ్యక్షుడు దయ్యాల ఉదయ్ ఆధ్వర్యంలో జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌక్ వద్ద సర్ధార్ సర్వాయి పాపన్న చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం ముఖ్య అతిథిగా హాజరైన పార్టీ జిల్లా కార్యదర్శి కట్కూరి రమేష్ మాట్లాడుతూ.. బహుజన హక్కులు, ఆత్మగౌరవం కోసం పోరాడిన గొప్ప యోధుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని కొనియాడారు. ఆయన ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు ఎనుగందుల సతీష్, గ్రామశాఖ అధ్యక్షుడు నల్ల నవదీప్, లింగాల రవి, ప్రధాన కార్యదర్శి లింగంపల్లి సుదర్శన్, కోశాధికారి కర్రె గణేష్, కట్కూరి వినోద్, మండల కోశాధికారి కాదాసు అనిల్, సలహాదారు కాదాసు సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యల పరిష్కారానికి నిరంతర కృషి

మున్సిపల్ చైర్మన్ మైలారపు లింబాద్రి

మెట్‌పల్లి టౌన్ ప్రతినిధి ఆగస్టు 18 (ప్రజాకలం)

మెట్‌పల్లి పట్టణ ప్రజల తాగునీటి సమస్యల పరిష్కారానికి మున్సిపాలిటీ నిరంతరం కృషి చేస్తుందని మున్సిపల్ చైర్మన్ మైలారపు లింబాద్రి అన్నారు. మెట్‌పల్లి పట్టణంలోని 25వ వార్డులో గత కొంతకాలంగా నిరుపయోగంగా ఉన్న బోరుబావిని మున్సిపాలిటీ ఆధ్వర్యంలో పునరుద్ధరించారు. బోరును మరింత లోతుగా ఫ్లషింగ్, డ్రిల్లింగ్ చేయడంతో పాటు కాలిపోయిన పాత మోటార్‌ను తొలగించి నూతన మోటార్ పంపును ఏర్పాటు చేశారు. పనులు పూర్తికావడంతో మంగళవారం మున్సిపల్ చైర్మన్ మైలారపు లింబాద్రి, వైస్ చైర్మన్‌తో కలిసి స్థానిక ప్రజాప్రతినిధులతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కొబ్బరికాయ కొట్టి మోటార్‌ను స్విచ్ ఆన్ చేసి బోరుబావిని ప్రజలకు అందుబాటులోకి తెచ్చారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ వార్డులో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా యుద్ధప్రాతిపదికన బోరుబావిని పునరుద్ధరించి ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చామని తెలిపారు. పట్టణంలోని ఇతర ప్రాంతాల్లోనూ తాగునీటి సమస్యలు ఉంటే వాటిని గుర్తించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ 13వ వార్డు కౌన్సిలర్ గుడికందుల అజయ్, నాయకులు జావిద్, ఇతర ప్రజాప్రతినిధులు, మున్సిపల్ సిబ్బంది, వార్డు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యల పరిష్కరానికి కృషి

రుద్రంగి, ఆగష్టు 18,(ప్రజాకలం ప్రతినిధి) విద్యుత్ వినియోగదారుల ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించేందుకు కృషి చేస్తామని ఏఈ శ్రీనివాస్ అన్నారు. మంగళవారం రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి మండల కేంద్రంలోని రైతువేదికలో సీజీఆర్ఎఫ్ ఆధ్వర్యంలో విద్యుత్ వినియోగదారుల ఫిర్యాదుల పరిష్కార వేదిక ఏర్పాటు చేసారు. వేములవాడ, వేములవాడ రూరల్, చందూర్తి, రుద్రంగి మండలాలకు చెందిన విద్యుత్ వినియోగదారులు సమస్యల గురించి అధికారుల దృష్టి కి తీసుకురావాలని కోరారు. ఏఈ మాట్లాడుతూ.. వినియోగదారుల విద్యుత్ సమస్యలను పరిష్కరించడానికి, విద్యుత్ సరఫరాలో ఎలాంటి సేవలోపం ఉన్న అధికారులకు ఫిర్యాదు చేయవచ్చని మీ ఫిర్యాదు రాత పూర్వకంగా సర్వీస్ కనెక్షన్ నెంబర్ మరియు మీ యొక్క పూర్తి చిరునామాతో పోస్ట్ ద్వారా గాని మేలు ద్వారా గాని వ్యక్తిగతంగా గాని వాట్సాప్ గాని ఆఫీసు కు పంపగలరని ఎలాంటి రుసుములు చెల్లించనక్కర్లేదని, ఫిర్యాదుదారుల నుంచి మరింత వివరములు తెలుసుకొనుటకు అవసరమైన యేడల ఫోరం సభ్యులు మీ వద్దకే వచ్చి సమస్యల పరిష్కారానికి కావలసిన వివరములు సేకరిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండలాల ఏఇలు లైన్మెన్లు విద్యుత్ అధికారులు లబ్ధిదారులు పాల్గొన్నారు.

టీఆర్ఎస్‌లో మహిళా సంఘం, యూత్ సభ్యుల చేరిక

మెట్‌పల్లి టౌన్ ప్రతినిధి ఆగస్టు 18 (ప్రజాకలం) తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్)లో చేరికలు కొనసాగుతున్నాయి. తాజాగా మెట్‌పల్లి పట్టణంలోని 20వ వార్డుకు చెందిన ఎంఏ ముఖిమ్ ఆధ్వర్యంలో మహిళా సంఘం సభ్యులు, యువతకు చెందిన సుమారు 40 మంది మంగళవారం టీఆర్ఎస్‌లో చేరారు. మెట్‌పల్లిలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో టీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ రఘు వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా డాక్టర్ రఘు మాట్లాడుతూ ప్రజలు మార్పును కోరుకుంటున్నారని, అందుకే పెద్ద సంఖ్యలో టీఆర్ఎస్‌లో చేరుతున్నారని అన్నారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో నియోజకవర్గంలో టీఆర్ఎస్ జెండా ఎగరడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సామాజిక న్యాయానికి స్ఫూర్తి

సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్

జగిత్యాల కలెక్టరేట్ లో ఘనంగా జయంతి వేడుకలు - పాల్గొన్న జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్

జగిత్యాల ప్రతినిధి ఆగస్టు 18 (ప్రజాకలం)

జగిత్యాల జిల్లా కలెక్టరేట్ లో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించగా జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ పాల్గొని ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ సామాన్య కుటుంబంలో జన్మించి, తన కాలంలోని సామాజిక, ఆర్థిక, రాజకీయ అసమానతలను ప్రశ్నిస్తూ, అణగారిన వర్గాల ఆత్మగౌరవం కోసం పోరాడిన వీరుడిగా చరిత్రలో తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నారని అన్నారు. పాపన్న కేవలం ఒక యుద్ధ వీరుడు కాదు. కోటలను జయించిన సైనిక నాయకుడిగా మాత్రమే ఆయనను చూడటం ఆయన చారిత్రక ప్రాధాన్యతను పరిమితం చేయడమే అవుతుంది. గోల్కొండ కోటను ఏలిన బహుజన చక్రవర్తిగా వివిధ సామాజిక వర్గాలకు చెందిన ప్రజలను సమీకరించి, అప్పటి ఆధిపత్య వ్యవస్థలను సవాలు చేసిన ప్రజా నాయకుడిగా ఆయన తెలంగాణ ప్రజల జ్ఞాపకాల్లో చిరస్థాయిగా నిలిచారు. ఆయన గాథలో ఆత్మగౌరవం, సమానత్వం, సామాజిక న్యాయం, ప్రజా భాగస్వామ్యం, అధికారంలో భాగస్వామ్యం వంటి విలువలు అంతర్లీనంగా కనిపిస్తాయి. 17వ శతాబ్దంలోనే

సామాజికంగా వెనుకబడిన, అణగారిన వర్గాల ప్రజలను ఏకం చేసి తన పోరాటానికి పునాది వేసిన పాపన్న... అధికారం కొద్దిమంది చేతుల్లోనే కేంద్రీకృతమై ఉండాల్సిన అవసరం లేదని తన కార్యాచరణ ద్వారా చాటిచెప్పిన ప్రజా నాయకుడిగా గుర్తింపు పొందారని అన్నారు. ఈ సందర్భంగా ఆయన పోరాట పటిమను స్ఫూర్తిగా తీసుకుని ముందుకు వెళ్లాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు బి. ఎస్ లత, బి. రాజ గౌడ్, డి ఆర్ వో ప్రసాద్, జగిత్యాల ఆర్డీవో మధు సూదన్, జిల్లా స్థాయి అధికారులు, కలెక్టరేట్ ఉద్యోగులు, సిబ్బంది, కుల సంఘ నాయకులు పాల్గొన్నారు.

నూకపల్లి అర్బన్ కాలనీ వసతుల కల్పనకు

చర్యలు తీసుకోవాలి

- జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్

జగిత్యాల ప్రతినిధి ఆగస్టు 18 (ప్రజాకలం)

జగిత్యాల నూకపల్లి అర్బన్ కాలనీలో మౌలిక వసతుల కల్పనకు అవసరమైన స్థలాలను జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మంగళవారం జగిత్యాలఎమ్మెల్యే సంజయ్ కుమార్ తో కలిసి పరిశీలించారు. కాలనీలో పాఠశాల, అంగన్వాడీ భవనాల నిర్మాణానికి అనువైన స్థలాలను పరిశీలించి, ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు అందుబాటులోకి తీసుకురావడానికి అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అనంతరం నూకపల్లి అర్బన్ కాలనీలోని డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్, ఇళ్ల చుట్టుపక్కల పేరుకుపోయిన చెత్త, డ్రైనేజీలు, పిచ్చి మొక్కలు, గడ్డి తదితరాలను తొలగించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని అధికారులకు సూచించారు. డ్రైనేజీ వ్యవస్థను ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తూ మురుగునీరు నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ మాట్లాడుతూ నూకపల్లి అర్బన్ కాలనీలో నివసిస్తున్న ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందన్నారు. పాఠశాల, అంగన్వాడీ భవనాల ఏర్పాటుతో స్థానిక ప్రజలకు మరింత సౌకర్యం కలుగుతుందని తెలిపారు. కాలనీలో పారిశుద్ధ్య సమస్యలు తలెత్తకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ నూకపల్లి అర్బన్ కాలనీలో ప్రజలకు మెరుగైన వసతులు కల్పించేందుకు ప్రాధాన్యతనిస్తూ చర్యలు చేపడుతున్నామని తెలిపారు. పాఠశాల,అంగన్వాడీ భవనాల నిర్మాణానికి అవసరమైన స్థలాలను పరిశీలించి, తదుపరి చర్యలు వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పరిసరాల్లో పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, డ్రైనేజీలను శుభ్రంగా ఉంచడంతో పాటు పిచ్చి మొక్కలు, గడ్డి తొలగించి పరిశుభ్రమైన వాతావరణం కల్పించాలని అధికారులకు సూచించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మౌలిక వసతుల పనులను సమన్వయంతో చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో. అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు బి.రాజ గౌడ్, హౌసింగ్ డి ఈ భాస్కర్, మున్సిపల్ కమిషనర్ సత్య ప్రణవ్ సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అదనపు ఉపాధ్యాయులను కేటాయించాలని వినతి

రుద్రంగి, ఆగష్టు 18, (ప్రజాకలం ప్రతినిధి)

రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి మండలం మానాల గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలపై నమ్మకం పెంచుతూ మన ఊరు-మన బడి కార్యక్రమంలో భాగంగా మానాల గ్రామంలోని జడ్పీఎస్ఎస్ ఉన్నత పాఠశాలలో 240 మంది నూతన విద్యార్థులను చేర్పించామని, విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా అదనపు ఉపాధ్యాయులను కేటాయించాలని గ్రామస్తులు, గ్రామ పంచాయతీ పాలకవర్గం జిల్లా విద్యాశాఖ అధికారులను కోరారు. గ్రామ సర్పంచ్ బుర్ర శంకర్,ఉపసర్పంచ్ దాసరి అశోక్, యువకులు, గ్రామ ప్రజలు సమష్టిగా కృషి చేసి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పాఠశాలల్లో విద్య, వసతులపై అవగాహన కల్పిస్తూ విద్యార్థులను చేర్పించారని తెలిపారు. దీంతో పాఠశాలలో 200 శాతం అడ్మిషన్లు నమోదయ్యాయని, ఈ సందర్భంగా ఆగస్టు 15న కలెక్టర్, డీఈఓ చేతుల మీదుగా ప్రత్యేక ప్రశంసా పత్రం అందుకున్నామని పేర్కొన్నారు. విద్యార్థుల సంఖ్య భారీగా పెరిగిన నేపథ్యంలో వారికి నాణ్యమైన విద్యాబోధన అందించేందుకు అవసరమైన సంఖ్యలో ఉపాధ్యాయులను

వెంటనే కేటాయించాలని కోరారు. అలాగే మానాల జడ్పీఎస్ఎస్ పాఠశాలలో ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్‌గా విధులు నిర్వహిస్తున్న నవీన్ సార్‌ను పాఠశాలలోనే కొనసాగించేలా డిప్యూటేషన్‌కు అనుమతించాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలలో పెద్ద సంఖ్యలో అడ్మిషన్లు సాధించిన మానాల గ్రామాన్ని ఆదర్శంగా తీసుకుని విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఉపాధ్యాయుల కొరత లేకుండా విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరారు. ఈ కార్యక్రమంలో లక్కాకుల రమేష్,బాదనవేణి రాజారాం లు ఉన్నారు.

స్మార్ట్ రేషన్ కార్డు పై మోడీ ఫోటో

ముద్రించాలని తహసిల్దార్ కు వినతి

- ఎండపల్లి మండల బీజేపి పార్టీ ఆధ్వర్యంలో

ఎండపల్లి, ఆగస్టు 18 : (ప్రజా కలం ప్రతినిధి) మండల కేంద్రంలో మండల బీజేపి పార్టీ అధ్యక్షులు రావు హనుమంత రావు ఆధ్వర్యం లో స్మార్ట్ రేషన్ కార్డు లో నరేంద్ర మోడీ ఫోటో ఉంచాలని ఎండపల్లి మండల తహసిల్దార్ కు వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా అధ్యక్షులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నుండి ఐదు కిలోల బియ్యం రావడం జరుగుతుంది. రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఒక కిలో బియ్యం రావడం జరుగుతుంది. ఒక కిలో బియ్యం ఇచ్చే రాష్ట్ర ప్రభుత్వమే రెండు మూడు ఫోటోలు వేసుకుంటే మరి ఐదు కిలోలు ఇచ్చే నరేంద్ర మోడీ ఫోటో ఎంత పెద్దగా వేయాలి అని ప్రశ్నిస్తూ ఖచ్చితంగా రేషన్ కార్డుల పైన నరేంద్ర మోడీ ఫోటో ఉంచాలని ఆయన వ్యాఖ్యలు చేశారు ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీజేపి కౌన్సిల్ మెంబర్, అసెంబ్లీ కన్వీనర్ కొమ్ము

రాంబాబు, మండల ప్రధాన కార్యదర్శి పొన్నం నరేష్, మండల బీజేవైఎం అధ్యక్షులు జక్కుల సాగర్, ఓబిసి అధ్యక్షులు అమర గొండ దివాకర్, దేవి సంతోష్, ఎనగంటి రమేష్, ప్రశాంత్, రాకేష్, మేడిపల్లి రాజు, డి మల్లేశం, కే నరేష్, బెల్లి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ పథకాలపై

బిఆర్ఎస్ అబద్ధపు ప్రచారాలు మానుకోవాలి

- టిపిసిసి లీగల్ సెల్ రాష్ట్ర కన్వీనర్ శేర్ నర్సారెడ్డి

మెట్ పల్లి టౌన్ ప్రతినిధి ఆగస్టు 18 (ప్రజా కలం) కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల అమలుపై బిఆర్ఎస్ నాయకులు చేస్తున్న నిరాధారమైన అబద్ధపు ఆరోపణలు చేయడం వారి దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమని టిపిసిసి లీగల్ సెల్ రాష్ట్ర కన్వీనర్ శేర్ నర్సారెడ్డి మండిపడ్డారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కళ్యాణ లక్ష్మి పథకానికి చట్టబద్ధత కల్పించకపోవడం వల్లే నేడు హైకోర్టులో న్యాయపరమైన సమస్యలు తలెత్తితే.... అసలు ఈ పథకాలనే నిలిపివేస్తున్నారంటూ అబద్ధపు ప్రచారం చేయడం సిగ్గుచేటని ధ్వజమెత్తారు. కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలపై బిఆర్ఎస్ మొసలి కన్నీరు కారుస్తోందని, ఏలాంటి లొసుగులు లేకుండా సరైన విధానంలో గత బిఆర్ఎస్ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేస్తే ప్రస్తుతం ఈ పరిస్థితి ఉత్పన్నమయ్యేది కాదని శేర్ నర్సారెడ్డి అభిప్రాయపడ్డారు. ఇట్టి పథకాలపై లోపభూయిష్టమైన జీవోలు ఇవ్వడమే ప్రస్తుత పరిస్థితికి కారణమనీ, అబద్ధపు ప్రచారాలు చేస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం వీటిని నిలిపివేసినట్లు తప్పుడు అబద్ధపు ప్రచారాలు చేస్తున్నారని విమర్శించారు. కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాల అమలుకు కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయంలో జరిగిన పొరపాటు కారణంగానే ఈ పథకాలను నిలిపివేస్తూ హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులను ఇచ్చిందని, ఈ ఆదేశాలను రాష్ట్ర ప్రభుత్వం డివిజనల్ బెంచ్ లో అప్పీలు చేయనున్నట్లు పేర్కొన్నారు. బిఆర్ఎస్ నాయకులు కల్లబొల్లి మాటలు మానుకోవాలనీ, కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం యధావిధిగా కొనసాగిస్తుందని టిపిసిసి లీగల్ సెల్ రాష్ట్ర కన్వీనర్ శేర్ నర్సారెడ్డి స్పష్టం చేశారు.

మెట్‌పల్లిలో ఘనంగా సర్వాయి పాపన్న జయంతి వేడుకలు

- విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన టీపీసీసీ సీనియర్ నేత జువ్వాడి కృష్ణారావు, మున్సిపల్ చైర్మన్ మైలారపు లింబాద్రి

మెట్‌పల్లి టౌన్ ప్రతినిధి ఆగస్టు 18 (ప్రజాకలం) సర్దార్ సర్వాయి పాపన్న జయంతి వేడుకలను మెట్‌పల్లి పట్టణంలో ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని న్యూ బస్టాండ్ వద్ద ఉన్న సర్వాయి పాపన్న విగ్రహానికి టీపీసీసీ సీనియర్ నేత జువ్వాడి కృష్ణారావు, మెట్‌పల్లి మున్సిపల్ చైర్మన్ మైలారపు లింబాద్రి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సమాజంలోని అణగారిన వర్గాల హక్కులు, ఆత్మగౌరవం కోసం సర్వాయి పాపన్న చేసిన పోరాటం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందని పేర్కొన్నారు. ఆయన ఆశయాలను నేటి తరానికి తెలియజేస్తూ, సామాజిక సమానత్వం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ఓంకార్ నవీన్, కమిషనర్ శ్రీనివాస్ గౌడ్, మున్సిపల్ గౌరవ కౌన్సిలర్లు, స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు, గౌడ కుల బాంధవులు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

వెల్లుల్ల జడ్పీహెచ్ఎస్‌లో విద్యార్థులతో కలిసి భోజనం చేసిన ప్రజాప్రతినిధులు

మెట్ పల్లి రూరల్, ఆగస్టు 18: (ప్రజా కలం);వెల్లుల్ల గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం మధ్యాహ్న భోజన పథకం అమలును ప్రజాప్రతినిధులు, వైద్య సిబ్బంది, పాఠశాల ఉపాధ్యాయులు పరిశీలించారు. ఈ సందర్భంగా సర్పంచ్ గూడూరు తిరుపతి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు గడ్డం శ్రీనివాస్‌రెడ్డి, మెడికల్ ఆఫీసర్ అంజిత్‌రెడ్డి, జీపీఓలు నాగరాణి, రాజేశం, ఏఎన్ఎం సువర్ణ, వార్డు సభ్యులు, ఉపాధ్యాయులు విద్యార్థులతో కలిసి పాఠశాలలో మధ్యాహ్న భోజనం చేశారు.

పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న భోజనం నాణ్యత, రుచి, పరిశుభ్రతను వారు ప్రత్యక్షంగా పరిశీలించారు. అనంతరం పాఠశాలలో నిల్వ ఉంచినబియ్యం,పప్పులు,నూనె,కూరగాయలు, ఇతర వంట సామగ్రిని తనిఖీ చేశారు. వంటగది పరిశుభ్రత, వంట సామగ్రి నిల్వ విధానం, భోజనం తయారీలో పాటిస్తున్న జాగ్రత్తలను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. విద్యార్థులకు నాణ్యమైన, ఆరోగ్యకరమైన భోజనం అందించడంలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని అధికారులు సూచించారు. వంటగది పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, వంటకు ఉపయోగించే బియ్యం, పప్పులు, నూనె, కూరగాయలను నాణ్యత పరిశీలించిన అనంతరం మాత్రమే వినియోగించాలని తెలిపారు. మధ్యాహ్న భోజనం వడ్డించే ముందు బాధ్యత వహించే ఉపాధ్యాయులు రుచి చూసి, నాణ్యతను నిర్ధారించిన తర్వాతే విద్యార్థులకు అందించాలని పేర్కొన్నారు.

సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376వ జయంతి వేడుకలు

ఎండపల్లి, ఆగస్టు 18 : (ప్రజా కలం ప్రతినిధి) మండలం లోని గుల్లకోట, ఎండపల్లి పలు గ్రామాల లో మండల కేంద్రంలో కళ్లు గీత కార్మిక సంఘం ఆధ్వర్యం లో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గుల్లకోట గౌడ సంఘం అధ్యక్షులు గొల్లపెల్లి సత్యం గౌడ్ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జయంతి సందర్భంగా కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు సమాజం కోసం సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ చేసిన పోరాటాలు, సేవలను ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. అలాగే ఎండపల్లి మండల కేంద్రం లో గౌడ సంఘం అధ్యక్షులు సర్దార్ సర్వాయి పాపన్న చిత్రపటానికి పూల మాలవేసి నివాళులు అర్పించారు నేటి యువత పాపన్న గౌడ్ ఆశయాలను ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం లో గౌడ సంఘం అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, డైరెక్టర్లు, సంఘ సభ్యులు, యువకులు పాల్గొన్నారు.

సింగరేణి కార్మికుల మారు పేర్ల సమస్య పరిష్కరించాలి

- పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ

పెద్దపల్లి,ఆగస్టు 08:(ప్రజాకలం జిల్లాప్రతినిధి) సింగరేణి కార్మికులు దీర్ఘకాలంగా ఎదుర్కొంటున్న మారు పేర్ల సమస్యకు తక్షణమే శాశ్వత పరిష్కారం చూపి వారికి న్యాయం చేయాలని పెద్దపల్లి పార్లమెంటు సభ్యులు గడ్డం వంశీకృష్ణ డిమాండ్ డిమాండ్ చేశారు.సింగరేణి సంస్థను, అందులో శ్రమిస్తున్న కార్మికులను కాపాడుకోవాల్సిన బాధ్యత కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలపై ఉందని ఆయన స్పష్టం చేశారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ కార్మికుల సమస్య పరిష్కారం కోసం ఇప్పటికే కేంద్రంలోని విద్యుత్,ఆర్థిక మంత్రిత్వ శాఖలకు పలుమార్లు లేఖలు రాయడంతో పాటు,తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క దృష్టికి కూడా తీసుకెళ్లినట్లు తెలిపారు.సింగరేణి యాజమాన్యానికి విజ్ఞప్తి చేసినప్పటికీ సమస్య ఇప్పటికీ కొలిక్కి రాకపోవడం బాధాకరమన్నారు.కోర్టు కేసులు ఉన్నాయంటూ సాకులతో సమస్యను కాలయాపన చేయడం,పక్కదారి పట్టించడం సరికాదని హితవు పలికారు.కార్మికులు ఇప్పటికే అనేకసార్లు ధర్నాలు,నిరసనలు, వినతిపత్రాల ద్వారా తమ గోడును వెళ్లగక్కారని గుర్తుచేశారు. ప్రాణాలను సైతం లెక్కచేయకుండా బొగ్గును వెలికితీస్తూ దేశానికి వెలుగునిస్తున్న కార్మికుల కష్టాన్ని, సేవలను విస్మరించి కేవలం అధికారుల నిర్ణయాలతో సంస్థను నడపడం సరైన విధానం కాదన్నారు.కార్మికుల హక్కుల కోసం స్వర్గీయ జి.వెంకటస్వామి చేసిన చారిత్రాత్మక పోరాటాలను ఈ సందర్భంగా వంశీకృష్ణ స్మరించుకున్నారు. సింగరేణి సంస్థ దేశానికి ఎంతో కీలకమని పేర్కొన్న ఆయన,కార్మికుల సమస్య పరిష్కారంలో యాజమాన్యం నిర్లక్ష్యం వహిస్తే భవిష్యత్తులో సంస్థకే ముప్పు వాటిల్లుతుందని, ఇందుకు అధికారులే పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరిస్తూ మారు పేర్ల సమస్యకు వెంటనే పరిష్కారం చూపాలని కోరారు.

అభివృద్ధి పనుల భూ సేకరణను వేగవంతం చేయాలి -జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష

పెద్దపల్లి,ఆగస్టు18:(ప్రజాకలం జిల్లాప్రతినిధి) అభివృద్ధి పనులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న భూ సేకరణ ప్రక్రియను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షలి సంబంధిత అధికారులను ఆదేశించారు.మంగళవారం సమీకృత జిల్లా కలెక్టరేట్లో అదనపు కలెక్టర్ బి.శ్రీరాములతో కలిసి అభివృద్ధి పనులకు సంబంధించి పెండింగ్ భూ సేకరణపై సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ పెద్దపల్లి బైపాస్ రోడ్డు, కూనారం రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి,తదితర అభివృద్ధి పనులకు అవసరమైన భూ సేకరణను నిర్ణీత సమయంలోగా పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని సూచించారు.భూ సేకరణ ప్రక్రియలో ఎలాంటి జాప్యం లేకుండా రెగ్యులర్‌గా ఫాలోఅప్ చేయాలని కలెక్టర్ ఆదేశించారు.క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యలను గుర్తించి సంబంధిత అధికారుల సమన్వయంతో వెంటనే పరిష్కరించాలని సూచించారు.భూ యజమానులకు సంబంధించిన సమస్యలు,భూ వివరాల పరిశీలన,రికార్డుల పరిశీలన,పరిహారం చెల్లింపులు తదితర అంశాలను వేగవంతం చేయాలని తెలిపారు.అభివృద్ధి పనులకు భూ సేకరణ కీలకమైనందున,పెండింగ్ అంశాలను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ నిర్ణీత లక్ష్యాల మేరకు పురోగతి సాధించాలని అధికారులను ఆదేశించారు. భూ సేకరణ సజావుగా జరిగేలా అవసరమైన చోట భూ యజమానులతో సమన్వయం చేసుకుంటూ సమస్యలను పరిష్కరించాలని,అభివృద్ధి పనుల పురోగతికి భూ సేకరణ కారణంగా ఎలాంటి జాప్యం జరగకుండా ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.అనంతరం కూనారం ఆరోబీ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించిన కలెక్టర్ అక్టోబర్ 15 నాటికి రైల్వే ఓవర్ బ్రిడ్జి పూర్తి చేసి వాహనాల రాకపోకలు జరిగే విధంగా ప్రజలకు అందుబాటులోకి తీసుకొని రావాలని అధికారులను ఆదేశించారు.ఈ సమావేశంలో ఆర్ అండ్ బి ఈ ఈ. భావ్ సింగ్,రెవెన్యూ డివిజనల్ అధికారులు బి.గంగయ్య,సంబంధిత అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

జాతీయ మహాసభను విజయవంతం చేయాలి

- జగ్గాసాగర్‌లో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ గ్రామ కమిటీల నిర్మాణం

మెట్ పల్లి రూరల్,ఆగస్టు 18:(ప్రజా కలం);సెప్టెంబర్ 9న వరంగల్‌లో నిర్వహించనున్న జాతీయ మహాసభను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నాయకులు పిలుపునిచ్చారు. మత దురహంకారం, కుల వివక్షత, సామాజిక అసమానతలు లేని సమసమాజ నిర్మాణం కోసం గ్రామస్థాయిలో సంఘటితంగా పనిచేయాల్సిన అవసరం ఉందని వారు అన్నారు.మెట్టుపల్లి మండలంలోని జగ్గాసాగర్ గ్రామంలో మంగళవారం ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ మరియు అనుబంధ సంఘాల గ్రామ కమిటీల నిర్మాణం చేపట్టారు. కోరుట్ల నియోజకవర్గ ఇన్‌చార్జి చెట్టుపెల్లి లక్ష్మణ్ మాదిగ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి మాదిగ సంఘం పెద్దమనుషులు, యువజన సంఘం నాయకులు, మహిళా సంఘాల ప్రతినిధులు, సభ్యులు హాజరయ్యారు.ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ జిల్లా మాజీ అధ్యక్షుడు దుమాల గంగారం మాదిగ, జిల్లా మాజీ వర్కింగ్ ప్రెసిడెంట్ చెట్టుపెల్లి లక్ష్మణ్ మాదిగ మాట్లాడుతూ, "పద్మశ్రీ" మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు గ్రామస్థాయిలో కమిటీలను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. సమాజంలోని ప్రతి పేద కుటుంబానికి న్యాయం జరిగేలా, అణగారిన వర్గాల అభివృద్ధికి అనేక పోరాటాలు నిర్వహించిన మందకృష్ణ మాదిగ నాయకత్వాన్ని ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు.జాతి సమగ్ర అభివృద్ధితో పాటు అన్ని వర్గాల్లోని పేదల సామాజిక, ఆర్థిక అభివృద్ధి కోసం ఎమ్మార్పీఎస్ శక్తివంచన లేకుండా పనిచేస్తుందని నాయకులు పేర్కొన్నారు. మహాత్మా జ్యోతిరావు పూలే, డాక్టర్ బీఆర్ అంబేద్కర్, బాబూ జగ్జీవన్‌రామ్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే సంస్థ లక్ష్యమని అన్నారు.రాబోయే రోజుల్లో సామాజిక, ఆర్థిక అసమానతలకు వ్యతిరేకంగా మరో ప్రజా ఉద్యమానికి మాదిగలు సిద్ధంగా ఉండాలని నాయకులు కోరారు. సమాజానికి, మాదిగల సామాజిక ఉద్యమానికి దిక్సూచిగా నిలిచేలా గ్రామస్థాయి నుంచి ఉద్యమ నిర్మాణం జరగాలని సూచించారు. సెప్టెంబర్ 9న వరంగల్‌లో జరిగే జాతీయ మహాసభకు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.సమావేశంలో గ్రామ సంఘం పెద్దమనుషులు గొర్రె అంజయ్య, బొల్లెగుంట గంగాధర్, జిల్లా నాయకులు బోనగిరి కిషన్, ఇబ్రహీంపట్నం మండల ఇన్‌చార్జి బంగారి హరిదాస్, కొత్తూరి రాజేశ్వర్, బొల్లె నడిపి రాజం, గొర్రె సురేష్, టప్ప రాజేశ్వర్, గొర్రె శంకర్, బొల్లె సురేష్, గొర్రె పెద్ద సురేష్, బొల్లె గంగ నరసయ్య, సుద్దాల విజయ్, మోర్తాడ్ చిన్న నరసయ్య, మోర్తాడ్ విజయ, బొల్లె సుశీల, జాగర్ల లత, బొల్లె జ్యోతి తదితరులు పాల్గొన్నారు. గ్రామానికి చెందిన మాదిగ యువజన సంఘం, మహిళా సంఘాల నాయకులు, సభ్యులు సమావేశంలో పాల్గొన్నారు.

ఎస్సీ యాక్షన్ ప్లాన్ లక్ష్యాలు త్వరగా పూర్తి చేయాలి

- జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష

పెద్దపల్లి,ఆగస్టు 18:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి)

ఎస్సీ యాక్షన్ ప్లాన్ కింద నిర్దేశించిన లక్ష్యాలను అధికారులు త్వరితగతిన పూర్తి చేయాలని పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశించారు.సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో ఎస్సీ యాక్షన్ ప్లాన్,పీఎం అజయ్ పథకం,ప్రీ మరియు పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్‌లు,సంక్షేమ వసతి గృహాల నిర్వహణపై సంబంధిత అధికారులతో ఆయన మంగళవారం సమగ్ర సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎస్సీ యాక్షన్ ప్లాన్‌కు సంబంధించి సబ్సిడీ రుణాల లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు.జిల్లాలో ఎస్సీ కార్పొరేషన్ సబ్సిడీ రుణాల లక్ష్యం 297 మంది కాగా,ఇప్పటివరకు 192 మందిని ఎంపిక చేసినట్లు తెలిపారు.ఎంపికైన వారిలో 117 మందికి బ్యాంకు ఖాతాలు ప్రారంభించామని, మిగిలిన లబ్ధిదారుల ఎంపికను త్వరగా పూర్తి చేయాలని పేర్కొన్నారు.సబ్సిడీ మొత్తాన్ని క్లెయిమ్ చేసేందుకు వీలుగా లబ్ధిదారుల పేరుతో నాన్-ఆపరేటివ్ బ్యాంకు ఖాతాలు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని బ్యాంకర్లను ఆదేశించారు.పీఎం అజయ్ పథకం కింద ఎస్సీ రైతులకు అవసరమైన బోర్‌వెల్స్ ఏర్పాటు ప్రక్రియను వేగవంతం చేయాలని,అర్హులైన రైతులకు ఈ పథకం ప్రయోజనాలు పూర్తిగా అందేలా ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు.ప్రీ మెట్రిక్,పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్‌లకు అర్హులైన విద్యార్థులందరూ సకాలంలో దరఖాస్తులు సమర్పించేలా చర్యలు తీసుకోవాలని,ఒక్క అర్హత కలిగిన విద్యార్థి కూడా స్కాలర్‌షిప్‌కు దూరం కాకుండా దరఖాస్తుల ప్రక్రియను నిరంతరం పర్యవేక్షించాలని స్పష్టం చేశారు.సంక్షేమ వసతి గృహాల్లో అవసరమైన మరమ్మతు పనులను వెంటనే చేపట్టి పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు.హాస్టళ్లలో విద్యార్థుల సంఖ్యను పెంచేలా చర్యలు తీసుకోవడంతో పాటు,ప్రభుత్వం నిర్దేశించిన డైట్‌ను విద్యార్థులకు తప్పనిసరిగా అందించాలని పేర్కొన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన వసతి,మంచి వాతావరణం కల్పించాలని,వారి అవసరాలను ఎప్పటికప్పుడు గుర్తించి పరిష్కరించేలా వసతి గృహాల నిర్వహణలో ఎలాంటి లోపాలు లేకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని హెచ్చరించారు.ఈ సమావేశంలో ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శ్రవణ్ కుమార్,డీఎస్‌సీడీవో రవీందర్, తదితర సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రతి పశువుకూ డిజిటల్ ట్యాగింగ్ తప్పనిసరి

- భారత్ పశుధన్ పోర్టల్‌లో వివరాల నమోదు తప్పనిసరి

పెద్దపల్లి,ఆగస్టు 18:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి)

జిల్లాలో జాతీయ డిజిటల్ పశుసంపద మిషన్‌ను పకడ్బందీగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు.జాతీయ డిజిటల్ పశుసంపద మిషన్ అమలుపై జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మంగళవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో ప్రాజెక్టర్ ద్వారా సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ జాతీయ డిజిటల్ పశుసంపద మిషన్‌ను భారత్ పశుధన్ పోర్టల్ మొబైల్ యాప్ ద్వారా సమర్థవంతంగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు.ప్రతి పశువుకు ప్రత్యేక డిజిటల్ గుర్తింపు కల్పించేలా 12 అంకెల బార్‌కోడ్‌తో కూడిన చెవి ట్యాగ్‌ను ఏర్పాటు చేయాలని సూచించారు.ఈ ట్యాగ్‌ను పశువు యజమాని ఆధార్, మొబైల్ నంబర్‌తో అనుసంధానం చేయాలని తెలిపారు.పశువుల జాతి, వయస్సు,లింగం,పుట్టిన తేదీ,మరణం, పాల ఉత్పత్తి,గర్భధారణ, పొడి దశ తదితర వివరాలను భారత్ పశుధన్ పోర్టల్‌లో తప్పనిసరిగా నమోదు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. పశువుల క్రయవిక్రయాలు జరిగినప్పుడు వాటి కదలికలను సంబంధిత ట్యాగ్ ఐడీకి అనుసంధానం చేసి నమోదు చేయాలని సూచించారు.ప్రతి పశువుకు అందించే వ్యాక్సినేషన్, వైద్య చికిత్స, ఫాలోఅప్ వివరాలను కూడా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని తెలిపారు. పశువుల సంతానోత్పత్తికి సంబంధించిన కృత్రిమ గర్భధారణ,గర్భ నిర్ధారణ,దూడ పుట్టిన వివరాలను నమోదు చేయాలని ఆదేశించారు.పాలిచ్చే పశువులు,పొడి దశలో ఉన్న పశువుల పనితీరు వివరాలను కూడా నమోదు చేయాలని సూచించారు. పశువుల యజమానుల ఆధార్ నంబర్,మొబైల్ నంబర్,పూర్తి చిరునామా,స్థానం,పేరు, వయస్సు,లింగం, సామాజిక వర్గం,పాల ఉత్పత్తిదారుల సంఘం-మిల్క్ యూనియన్ సభ్యత్వం,భూమి వివరాలు తదితర సమాచారాన్ని నమోదు చేయాలని కలెక్టర్ తెలిపారు. గొర్రెలు,మేకలకు సంబంధించిన మంద నిర్వహణ,పశువుల ఆరోగ్యం, వ్యాక్సినేషన్,చికిత్స,ఫాలోఅప్ తదితర వివరాలను కూడా డిజిటల్ ప్లాట్‌ఫాంలో నమోదు చేయాలని సూచించారు.కుక్కల నియంత్రణకు సంబంధించిన యానిమల్ బర్త్ కంట్రోల్ కార్యక్రమం,వ్యాధుల పర్యవేక్షణ,వ్యాధి నియంత్రణ చర్యలు,పశుసంవర్ధక శాఖకు సంబంధించిన మౌలిక వసతుల మ్యాపింగ్ వివరాలను కూడా యాప్‌లో పొందుపరచాలని ఆదేశించారు.జిల్లా స్థాయిలో జిల్లా కలెక్టర్ చైర్మన్‌గా,మండల స్థాయిలో సంబంధిత అధికారులతో అమలు కమిటీలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.ఈ కమిటీలు సమన్వయంతో పనిచేస్తూ ప్రతి పశువుకు సంబంధించిన సమాచారం ఖచ్చితంగా డిజిటల్ ప్లాట్‌ఫాంలో నమోదయ్యేలా చూడాలని ఆదేశించారు.పశువులకు డిజిటల్ గుర్తింపు కల్పించడం ద్వారా వాటి ఆరోగ్యం, వ్యాధుల నియంత్రణ,సంతానోత్పత్తి,పాల ఉత్పత్తి, క్రయవిక్రయాలు,రవాణా తదితర అంశాలపై సమగ్ర సమాచారం అందుబాటులోకి వస్తుందని పేర్కొన్నారు.ఎన్‌డిఎల్‌ఎం అమలులో ఎలాంటి నిర్లక్ష్యం లేకుండా క్షేత్రస్థాయిలో అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు.ఈ సమావేశంలో పశుసంవర్ధక శాఖ అధికారి డా.వేణు గోపాల్ రావు,జెడ్పీ సి.ఈ.ఓ.నరేందర్, ఇంచార్జీ డి.పి.ఓ.శ్రీమాల,జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శ్రీనివాస్,మున్సిపల్ కమిషనర్‌లు,మండల పశు వైద్య అధికారులు,సంబంధిత అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

వరి సాగు చేసిన రైతులు సన్న రకం విత్తనాల నమోదు తప్పనిసరి

- మండల వ్యవసాయ అధికారి కామల్ల మహేష్

ఎండపల్లి, ఆగస్టు 18 : (ప్రజా కలం ప్రతినిధి) వానాకాలం-2026 లో ప్రభుత్వం ప్రోత్సహిస్తున్న ఏడు ప్రాధాన్య వరి సన్న రకాల విత్తనాలను సాగు చేసిన రైతులు తప్పని సరిగా విత్తనాల నమోదు చేసుకోవాలి. బీపిటి 5204, ఆర్ఎన్ఆర్ 15048, హెచ్ఎంటి సోనా, జై శ్రీరామ్, కేఎన్ఎం-1638, డబ్ల్యూజిల్-44, కేఎన్ఎం- 7715 రకాల విత్తనాలకు ఈ నిబంధన వర్తిస్తుంది. డీలర్ల వద్ద విత్తనాలు కొనుగోలు చేసిన రైతులు సంబంధిత డీలర్ వద్ద పాసుబుక్, మొబైల్ నంబర్, విత్తన రకం, బ్యాగుల సంఖ్య నమోదు చేయించుకోవాలి. గత పంట నుంచి సొంత విత్తనాన్ని ఉపయోగించిన రైతులు స్వీయ ప్రకటన పూరించాల్సి ఉంటుంది. అనంతరం తమ క్లస్టర్ వ్యవసాయ విస్తరణ అధికారి ద్వారా టి-ఆగ్రీ సీడ్స్ పోర్టల్లో వివరాలు నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి కామల్ల మహేష్ తెలిపారు.

నిరుద్యోగ బీసీ మహిళలకు ఉపాధి

- ఇందిరమ్మ కుట్టు మిషన్ పథకానికి దరఖాస్తుల ఆహ్వానం
- జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ అధికారి జె.రంగారెడ్డి

పెద్దపల్లి,ఆగస్టు18:(ప్రజాకలం జిల్లాప్రతినిధి) తెలంగాణ ప్రభుత్వం,బీసీ సంక్షేమ శాఖ ద్వారా 2026-27 ఆర్థిక సంవత్సరానికి గాను ఇంటింటికి ఇందిరమ్మ కుట్టు మిషన్ పథకాన్ని ప్రారంభించిందని జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ అధికారి జె.రంగారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.ఈ పథకం ద్వారా బీసీ నిరుద్యోగ మహిళలకు 100 శాతం సబ్సిడీతో రూ.12వేల విలువల ఆటోమేటిక్ కుట్టు మిషన్‌ను అందించి,వారిని ఆర్థికంగా ప్రోత్సహించడం పథకం యొక్క ముఖ్య ఉద్దేశమని,18 సంవత్సరాల నుండి 55 ఏళ్ల వయస్సు గల బీసీ మహిళలు అర్హులని,రేషన్ కార్డు కలిగి ఉండి,వార్షిక కుటుంబ ఆదాయం గ్రామీణ ప్రాంతాల్లో రూ.1.50 లక్షలు,పట్టణ ప్రాంతాల్లో రూ.2లక్షలకు మించరాదని,ఆసక్తిగల అభ్యర్థులు సెప్టెంబర్ 15 లోపు ఆన్‌లైన్ ద్వారా https://tgobmms.cgg.gov.in/ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవాలని,ఒక కుటుంబానికి ఒక యూనిట్ మాత్రమే మంజూరు చేయబడుతుందని, ప్రాథమిక అక్షరాస్యత కలిగి ఉండాలని,దరఖాస్తులు అధికంగా వచ్చిన పక్షంలో కనీసం 5వ తరగతి ఉత్తీర్ణతకు ప్రాధాన్యత ఉంటుందని,మేరా లేదా మేరు కమ్యూనిటీకి,వితంతువులు, నిరాశ్రయులు,ఒంటరి మహిళలు,అనాథలు,కుట్టు పనిలో నైపుణ్యం గల వారికి ప్రాధాన్యత ఇవ్వబడుతుందని,దరఖాస్తులు సంబంధిత ధృవపత్రాల పరిశీలన కొరకు ఎంపీడీఓ, మున్సిపల్ కమిషనర్,జోనల్ కమిషనర్ కార్యాలయంలో సమర్పించాలని,ఆసక్తి గల అర్హులైన మహిళలు గడువు తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ అధికారి ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

పాపన్న గౌడ్ సేవలు చిరస్మరణీయం

- అదనపు కలెక్టర్ బి.శ్రీరాములు

పెద్దపల్లి,ఆగస్టు18:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి) సమానత్వానికి,వీరోచిత పోరాటానికి ప్రతీకగా నిలిచిన చారిత్రక యోధుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని అదనపు కలెక్టర్ బి.శ్రీరాములు పిలుపునిచ్చారు.రాష్ట్ర ప్రభుత్వ అధికారిక ఆదేశాల మేరకు మంగళవారం పెద్దపల్లి సమీకృత జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి వేడుకలను నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అదనపు కలెక్టర్ బి.శ్రీరాములు జ్యోతి ప్రజ్వలన చేసి,పాపన్న గౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ బి.శ్రీరాములు మాట్లాడుతూ సర్వాయి పాపన్న గౌడ్ 1650 ఆగస్టు 18న ఒక సాధారణ కుటుంబం జన్మించి,అసాధారణ సాహసంతో గోల్కొండ కోటను స్వాధీనం చేసుకుని గొప్ప పరిపాలన అందించారని ప్రజల కోసం ఆయన చేసిన పోరాటాలు త్యాగాలను స్మరించుకుంటూ ఏటా అధికారికంగా జయంతి వేడుకలు నిర్వహించడం గర్వకారణమన్నారు.?బీసీ సంఘాల నాయకుల విజ్ఞప్తి మేరకు, భవిష్యత్తులో సర్వాయి పాపన్న గౌడ్ జయంతి వేడుకలను మండల,గ్రామ స్థాయిలో అధికారికంగా నిర్వహించేలా జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని అదనపు కలెక్టర్ తెలిపారు.?ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ అభివృద్ధి అధికారిజె.రంగారెడ్డి,జిల్లా అధికారులు,జిల్లా బీసీ సంఘాల నాయకులు,తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాల అభ్యున్నతికి చేయూత

- సొంతూరి బడికి మంత్రి రమేష్ రూ.50 వేల విలువైన కంప్యూటర్ అందజేత

పెద్దపల్లి,ఆగస్టు18:(ప్రజాకలం జిల్లాప్రతినిధి) జన్మభూమిపై మమకారంతో ఓ వ్యక్తి ప్రభుత్వ పాఠశాలకు అండగా నిలిచారు.కమాన్‌పూర్ మండలం రొంపికుంట గ్రామానికి చెందిన మంత్రి రమేష్ తన గ్రామంలోని జిల్లా పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలకు సుమారు 50 వేల రూపాయల విలువైన కంప్యూటర్లను విరాళంగా అందజేశారు. విద్యార్థులకు ఆధునిక సాంకేతిక విద్యను చేరువ చేయాలనే ఉద్దేశంతో ఈ సత్కారం చేపట్టారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రొంపికుంట సర్పంచ్ గుమ్మడి శ్రీనివాస్ మాట్లాడుతూ,గ్రామీణ ప్రాంత విద్యార్థుల అభ్యున్నతికి మంత్రి రమేష్ ముందుకు రావడం అభినందనీయమని పేర్కొంటూ కృతజ్ఞతలు తెలిపారు.పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులందరికీ తన వంతు సహకారంగా పాఠశాల యూనిఫారాలను కూడా అందజేస్తామని మంత్రి రమేష్ ఈ వేదికగా ప్రకటించారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ గుమ్మడి శ్రీనివాస్‌తో పాటు పెరాపల్లి సర్పంచ్ బొంగోని సదయ్య,మాజీ సర్పంచ్‌లు కటకం రవీందర్,కుందారపు బాపు,మిడివెళ్లి రవితేజ,బుస సాయి,పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నిర్మల జ్యోతి,శ్రీనివాస్ రెడ్డి,సీనియర్ ఉపాధ్యాయులు రఘు,సుధాకర్,ప్రవీణ్ అశోక్ కుమార్,కర్రె ప్రవీణ్,కుర్మ శ్రీనివాస్ తదితర ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

గాజులపేట గ్రామపంచాయతీ, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆకస్మిక తనిఖీ

– రికార్డుల నిర్వహణలో లోపాలు, నిధుల దుర్వినియోగం గుర్తింపు

– పంచాయతీ కార్యదర్శి సస్పెన్షన్‌కు ఆదేశం : జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా

మహబూబ్ నగర్
ప్రజా కలం ప్రతినిధి ఆగష్టు 18:

మహబూబ్‌నగర్ రూరల్ మండలం గాజులపేట గ్రామపంచాయతీ కార్యాలయం, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. గ్రామపంచాయతీ కార్యాలయంలోని రికార్డులను పరిశీలించిన కలెక్టర్, గ్రామపంచాయతీ తీర్మానం లేకుండానే నిధులు వినియోగించినట్లు గుర్తించారు. అలాగే, పంచాయతీ కార్యదర్శి చూపించిన కొన్ని తీర్మానాలు నకిలీవి గా ఉన్నట్లు పరిశీలనలో తేలింది. రికార్డుల నిర్వహణకు సంబంధించిన పత్రాలు కూడా సక్రమంగా లేవని కలెక్టర్ గుర్తించారు. దీంతో గాజులపేట పంచాయతీ కార్యదర్శిని సస్పెండ్ చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. గ్రామపంచాయతీ నిధుల వినియోగం, రికార్డుల నిర్వహణలో నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. దోమల నివారణ కోసం వినియోగించే ఫాగింగ్ మిషన్ల వివరాలు, వాటి సంఖ్య, నిర్వహణకు సంబంధించిన రిజిస్టర్లను కూడా ఆమె పరిశీలించారు. అనంతరం గాజులపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను కలెక్టర్ సందర్శించారు. అక్షయపాత్ర ద్వారా విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. అనంతరం 10వ తరగతి గదిని సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. ప్రస్తుతం ఏ పాఠ్యాంశం జరుగుతోందని అడిగి తెలుసుకున్నారు.

విద్యార్థులు బయాలజీ చదువుతున్నామని తెలపగా, చదువు ఎలా సాగుతోంది, ఉపాధ్యాయులు పాఠాలను బాగా బోధిస్తున్నారా, ఏమైనా సమస్యలు ఉన్నాయా అని కలెక్టర్ ఆరా తీశారు. పాఠశాలలో విద్యుత్ సౌకర్యం, ఫ్యాన్లు, లైట్లు అందుబాటులో ఉన్నాయా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ప్రతి తరగతి గదిలో ఫ్యాన్లు, లైట్లు తప్పనిసరిగా ఉండేలా చూడాలని,

విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా నాణ్యమైన విద్య అందించాలని పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బందిని కలెక్టర్ ఆదేశించారు. అనుమతులు లేకుండా మద్యం తరలిస్తున్న వాహనం సీజ్‌కు ఆదేశం గ్రామంలో పర్యటిస్తున్న సమయంలో అనుమతులు లేకుండా మద్యం తరలిస్తున్న వాహనాన్ని కలెక్టర్ గుర్తించారు. గ్రామంలోని బెల్ట్‌షాపులకు అనధికారికంగా మద్యం విక్రయిస్తున్నట్లు ప్రాథమిక విచారణలో తేలింది. దీంతో ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి, వాహనాన్ని స్వాధీనం చేసుకోవాలని సంబంధిత ఎక్సైజ్ శాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అలాగే, అక్రమ మద్యం విక్రయాలకు సంబంధించి బాధ్యులైన వారి లైసెన్స్ రద్దుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ తనిఖీల్లో మహబూబ్‌నగర్ రూరల్ తహసీల్దార్, ఎం.పి.డి. ఓ , ఎం.పి. ఓ తదితర అధికారులు పాల్గొన్నారు.

వీరన్నకు ఎమ్మెల్యే చేయూత.. వైద్యానికి రూ.లక్ష ఎల్ఓసీ

గద్వాల ప్రతినిధి ఆగస్టు 18 ప్రజా కలం:
గద్వాల జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మల్దకల్ మండల కేంద్రానికి చెందిన వీరన్న (తండ్రి శివన్న)కు మెరుగైన వైద్య చికిత్స కోసం ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన రూ.1 లక్ష ఎల్ఓసీ లేఖను గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేద, మధ్యతరగతి కుటుంబాలకు మెరుగైన వైద్యం అందించేందుకు ప్రభుత్వం ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఆర్థిక సహాయం అందిస్తోందన్నారు. లబ్ధిదారుడు వీరన్న త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.
ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ యాకోబు, నాయకులు తిమ్మరాజు, పరశు రాముడు, తిమ్మప్ప, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సమాజ మార్పే లక్ష్యంగా రచనలు

ఆకుతోట రాజేందర్‌కు 'అక్షర శ్రీ' పురస్కారం

ఆగస్టు 17మడికొండ:-(ప్రజా కలం ప్రతినిధి)

తన రచనల ద్వారా సమాజంలో మార్పు తీసుకురావడమే లక్ష్యంగా నిరంతరం సాహిత్య సేవ చేస్తున్న హనుమకొండ జిల్లా మడికొండకు చెందిన ప్రముఖ రచయిత ఆకుతోట రాజేందర్‌కు ప్రతిష్ఠాత్మక 'అక్షర శ్రీ' పురస్కారం లభించింది. సాహిత్య రంగంలో రాజేందర్ చేస్తున్న విశేష సేవలను గుర్తించిన

ప్రముఖ జాతీయ సాంస్కృతిక సేవా సంస్థ విశ్వసాహితీ కళా వేదిక ఆయనను ఈ పురస్కారానికి ఎంపిక చేసింది. ఆంధ్రప్రదేశ్‌లోని తాడేపల్లిగూడెంలో ఇటీవల నిర్వహించిన సాహిత్య సదస్సులో సంస్థ చైర్మన్ కొల్లి రమావతి, ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం చైర్మన్ పి. త్రివిక్రమరావు చేతుల మీదుగా రాజేందర్ అవార్డును అందుకున్నారు. సమాజంలోని సమస్యలు, ప్రజల జీవన పరిస్థితులు, సామాజిక బాధ్యత వంటి అంశాలను తన రచనల్లో ప్రతిబింబిస్తూ ప్రజల్లో చైతన్యం తీసుకురావడానికి రాజేందర్ చేస్తున్న కృషి ప్రశంసనీయమని సాహితీవేత్తలు కొనియాడారు. రచనను కేవలం సాహిత్య ప్రక్రియగా కాకుండా సమాజాన్ని మేల్కొలిపే సాధనంగా మలుచుకుంటున్న రాజేందర్‌కు 'అక్షర శ్రీ' పురస్కారం దక్కడం మడికొండకు గర్వకారణమని పలువురు అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా రాజేందర్‌ను సాహిత్యాభిమానులు, మిత్రులు, స్థానికులు అభినందించారు. తనకు లభించిన ఈ పురస్కారం మరింత బాధ్యతను పెంచిందని, భవిష్యత్తులోనూ సమాజ హితం, ప్రజా చైతన్యమే లక్ష్యంగా మరిన్ని రచనలు చేస్తానని రాజేందర్ తెలిపారు.

అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు ఉండాలి

ఎస్ఐఆర్ విజయవంతానికి రాజకీయ పార్టీలు సహకరించాలి: కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

గద్వాల ప్రతినిధి ఆగస్టు 18 ప్రజా కలం:

ముసాయిదా ఓటరు జాబితాను ప్రకటించిన నేపథ్యంలో ఓటర్లందరూ పోలింగ్ స్టేషన్‌ల వారీగా జాబితాలో తమ పేర్లు, వివరాలను సరిచూసుకోవాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ సూచించారు. మంగళవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఎస్ఐఆర్‌పై నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు.
ముసాయిదా జాబితాలో పేరు, పుట్టిన తేదీ, చిరునామా తదితర వివరాల్లో తప్పులు ఉంటే సెప్టెంబర్ 16లోగా అభ్యంతరాలు తెలియజేయాలని తెలిపారు. జిల్లాలో 63,925 మంది ఎన్యూమరేషన్ ఫారాలు సమర్పించలేదని, వారిలో అర్హులైన వారు సంబంధిత అధికారులను సంప్రదిస్తే తుది ఓటరు జాబితాలో నమోదు చేసుకోవచ్చన్నారు.
సుమారు 1.25 లక్షల మంది ఓటర్లు అనమలీస్ జాబితాలో ఉన్నారని, వారు ఎన్నికల సంఘం సూచించిన 12 గుర్తింపు పత్రాల్లో ఏదైనా ఒకటి సమర్పించాలని సూచించారు. అర్హులైన ఏ ఒక్కరి ఓటు తొలగిపోకుండా రాజకీయ పార్టీలు తమ బూత్ లెవెల్ ఏజెంట్ల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించాలని కలెక్టర్ కోరారు.
క్షేత్రస్థాయిలో సందేహాలు ఉంటే సంబంధిత తహసీల్దార్లు, ఎన్నికల అధికారులను సంప్రదించి పరిష్కరించుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ మధుమోహన్, ఆర్డీవో శ్రీనివాసరావు, ఎన్నికల విభాగం అధికారి మంజుల, గద్వాల తహసీల్దార్ హరికృష్ణ, ఇతర అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఘనంగా సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376 వ జయంతి

(వరంగల్/ పర్వతగిరి) ఆగస్టు 18, ప్రజాకలం ప్రతినిధి పర్వతగిరి మండల కేంద్రంలో మండల తెలంగాణ గౌడ సంఘం ఆధ్వర్యంలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ గారి జయంతి ఉత్సవాలను వారి చిత్రపటానికి పూలమాలలతో నివాళులర్పించిన PACS

చైర్మెన్ యం. మనోజ్ గౌడ్. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులు పట్టపురం ఏకాంతం గౌడ్, మండల అధ్యక్షులు రంగు జనార్దన్ గౌడ్, బి ఆర్ ఎస్ మాజీ మండల అధ్యక్షులు రంగు కుమార్ గౌడ్, గౌడ సంఘం సొసైటీ అధ్యక్షులు పుల్లూరు సారయ్య గౌడ్, గ్రామ పార్టీ అధ్యక్షులు మెరుగు వెంకటేశ్వర్లు గౌడ్, చింతల శ్రీనివాస్ గౌడ్, పూజారి రామలింగం గౌడ్, బూర శ్యామ్ గౌడ్, బాల్య వెంకటరాజ్యం గౌడ్, కుమార్ గౌడ్, స్వామి గౌడ్, వెంకన్న గౌడ్, దొమ్మటి రాజు గౌడ్, రవి గౌడ్, ఉప్పలయ్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

దేవీలాల్ తండాలో ఘనంగా తీజ్ ఉత్సవాలు

(వరంగల్/ పర్వతగిరి) ఆగస్టు 18, ప్రజాకలం ప్రతినిధిపర్వతగిరి మండల కేంద్రంలోని

దేవీలాల్ తండాలో తీజ్ ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ ఉత్సవాల్లో సర్పంచ్ శంకర్, కంటెస్టెడ్ జడ్పీటీసీ జాటోత్ శ్రీనివాస్ నాయక్ పాల్గొని సేవాలాల్ మహారాజ్, తుల్జా భవాని, మేరమ్మ యాడి, శీతల భవాని దేవతలకు కొబ్బరికాయలు కొట్టి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ శంకర్ మాట్లాడుతూ గిరిజన సాంప్రదాయాలు, ఆచారాలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. గిరిజన యువతీ యువకులు తమ కులదైవమైన సేవాలాల్ మహారాజ్‌తో పాటు మేరమ్మ యాడి, శీతల భవానిలను భక్తిశ్రద్ధలతో పూజిస్తూ సంప్రదాయాలను కొనసాగించడం అభినందనీయమన్నారు. జాటోత్ శ్రీనివాస్ నాయక్ మాట్లాడుతూ, పర్వతగిరి మండలంలోని 33 గ్రామాలు, పలు తండాలు, గ్రామపంచాయతీలలో తీజ్ పండుగను గిరిజన యువతీ యువకులు అత్యంత వైభవంగా, ఆనందోత్సాహాలతో నిర్వహిస్తున్నారని తెలిపారు. గిరిజన దేవతలను పూజిస్తూ పాడిపంటలు సమృద్ధిగా పండాలని, కుటుంబాలు సుఖసంతోషాలతో ఉండాలని పెద్దలు అందించిన సందేశాన్ని నేటి తరం కొనసాగిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో దేవీలాల్ తండా మహిళలు, ఆడపడుచులు, యువతీ యువకులు, పర్వతగిరి టౌన్ అధ్యక్షుడు కుసం రామచందర్, యువజన నాయకుడు నరేడ్ల సంతోష్, బొట్ల కనకరాజు, మహిళా నాయకురాలు ఎండీ సుల్తానా, ఉప సర్పంచ్ కొమ్ము రమేష్, తండా పెద్దలు, తీజ్ ఉత్సవాల కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ బలోపేతంపై విస్తృత సమీక్ష

నాగర్‌కర్నూల్ ప్రజా కలం ప్రతినిధి ఆగష్టు 18:

నాగర్‌కర్నూల్ మున్సిపల్ పరిధిలోని సౌభాగ్య గార్డెన్‌లో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు డాక్టర్ వంశీకృష్ణ అధ్యక్షతన నిర్వహించగా ముఖ్య అతిథి ఏఐసీసీ కార్యదర్శి సచిన్ సావంత్ కాంగ్రెస్ పీఏసీ సమావేశం పాల్గొన్నారు ఈ సమావేశంలో నాగర్‌కర్నూల్ జిల్లాలో ఎస్ఐఆర్ ఫేజ్-2 కార్యాచరణ ప్రణాళిక, పట్టణ, డివిజన్, మండల కమిటీల నియామకాలు, బీఎల్ఏ-2 కార్యకలాపాల పర్యవేక్షణ, జిల్లా, నియోజకవర్గాల్లో ప్రస్తుత రాజకీయ పరిస్థితులు, కాంగ్రెస్ పార్టీ కార్యకలాపాలపై విస్తృతంగా సమీక్ష నిర్వహించారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లడం, ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజలకు వివరించడం, పార్టీని గ్రామస్థాయి నుంచి మరింత బలోపేతం చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలపై నాయకులకు దిశానిర్దేశం చేశారు. రాబోయే కార్యక్రమాలను సమన్వయంతో నిర్వహిస్తూ పార్టీ శ్రేణులు ప్రజలకు మరింత చేరువ కావాలని సూచించారు. ఈ సమావేశంలో కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, గోట్ అండ్ ఫిషరీస్ చైర్మన్ సరిత, నాగర్‌కర్నూల్ మున్సిపల్ చైర్మన్ సురేంద్ర, కాంగ్రెస్ పార్టీ నాగర్‌కర్నూల్ జిల్లా హెడ్‌క్వార్టర్స్ అధ్యక్షుడు జక్క రాజ్‌కుమార్‌రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి కృష్ణారెడ్డి, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు వినోద్, మైనార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు, జిల్లా అధ్యక్షులు మహమ్మద్ అబీబ్, కొల్లాపూర్ మున్సిపల్ చైర్మన్, వివిధ విభాగాల అధ్యక్షులు, పార్లమెంట్ ఇన్‌చార్జిలు, అసెంబ్లీ ఇన్‌చార్జిలు, ఇతర కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పాపన్న గౌడ్ ఆశయాల సాధనకు కృషి చేయాలి

- పాపన్న గౌడ్ విగ్రహ ఏర్పాటుకు సహకరిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు
- అయినవోలు మండల కేంద్రంలో పాపన్న గౌడ్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలి
- గౌడ కులస్తుల కొత్త పెన్షన్లు ఎక్సైషియా సమస్యలను వెంటనే పరిష్కరించాలి
- ఎమ్మెల్యే, కలెక్టర్ ను కోరిన మాజీ ఎంపీటీసీ బొల్లెపల్లి మధుచంద్ర గౌడ్

హనుమకొండ ఆగస్టు 17 :(ప్రజా కలం ప్రతినిధి)

బహుజన వీరుడు, గౌడ జాతి ముద్దుబిడ్డ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి సందర్భంగా హనుమకొండ కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన బహుజన సదస్సుకు వర్ధన్నపేట ఎమ్మెల్యే కె.ఆర్. నాగరాజు హాజరయ్యారు. కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ సమక్షంలో జరిగిన ఈ కార్యక్రమంలో అయినవోలు మాజీ ఎంపీటీసీ బొల్లెపెల్లి మధు గౌడ్ పాల్గొని సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ సేవలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా మధు గౌడ్ మాట్లాడుతూ బహుజనుల కోసం పోరాడిన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ చరిత్రను భావితరాలకు అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. పాపన్న గౌడ్ విగ్రహ ఏర్పాటుకు సహకరిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. హనుమకొండ జిల్లాలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే నాగరాజుతో కలిసి కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్‌ను కోరారు.

అదేవిధంగా అయినవోలు మండల కేంద్రంలో సైతం సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే కె.ఆర్. నాగరాజును మధు గౌడ్ కోరారు. గౌడ సమాజానికి సంబంధించిన సమస్యలు, సమావేశాలు, సామాజిక కార్యక్రమాలు నిర్వహించుకునేందుకు అయినవోలు మండల కేంద్రంలో గౌడ కమ్యూనిటీ భవనం ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై ఎమ్మెల్యే నాగరాజు సానుకూలంగా స్పందించడంతో పాటు వెంటనే అందుకు సంబంధించిన స్థల సేకరణ కావాల్సిన నిధులు సమకూర్చాలని అధికారులను ఆదేశించినట్లుహో అందుకు మధు గౌడ్ కృతజ్ఞతలు తెలిపారు. అదే విధంగా గౌడ కులస్తులు మృతి చెందిన సందర్భాల్లో ఎక్సైజ్ ఎక్స్‌గ్రేషియా మంజూరు విషయంలో ఎదురవుతున్న సమస్యలను వెంటనే పరిష్కరించి బాధిత కుటుంబాలకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని మధు గౌడ్ కోరారు. అలాగే గౌడ సభ్యులకు కొత్త పెన్షన్లు మంజూరు విషయంలో ఏర్పడుతున్న సమస్యలను పరిష్కరించి అర్హులైన ప్రతి ఒక్కరికీ పెన్షన్ అందేలా చూడాలని కోరారు. ఈ అంశాలపై సంబంధిత ఎక్సైజ్ అధికారు లకు ఎమ్మెల్యే నాగరాజు తగిన సూచనలు చేసి, సమస్యలను త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ చూపిన పోరాట స్ఫూర్తిని ఆదర్శం గా తీసుకుని గౌడ సమాజ సంక్షేమం, అభ్యున్నతికి ప్రభుత్వం మరింతగా సహకరించాలని మధు గౌడ్ కోరారు. గౌడ సమాజ సమస్యలనుఎమ్మెల్యే నాగరాజు సానుకూలంగా స్వీకరించి పరిష్కా రానికి హామీ ఇవ్వడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు.

ఘనంగా సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్

376వ జయంతి వేడుకలు

నందిగామ ఆగస్ట్ 18 ప్రజా కలం ప్రతినిధి

నందిగామ మండల కేంద్రంలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్దార్ సర్వాయి పాపన్న యువజన సంఘం నందిగామ మండల అధ్యక్షులు అగ్గి మహేష్ గౌడ్ పాల్గొని సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అగ్గి మహేష్ గౌడ్ మాట్లాడుతూ.. బడుగు, బలహీన వర్గాల హక్కుల కోసం పోరాడిన గొప్ప వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని అన్నారు. సామాన్య ప్రజల కోసం పోరాడుతూ అణగారిన వర్గాలకు ఆత్మగౌరవాన్ని, ధైర్యాన్ని కల్పించిన మహనీయుడు పాపన్న గౌడ్ అని కొనియాడారు. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ఆశయాలను నేటి యువత ఆదర్శంగా తీసుకుని సమాజ అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. యువత విద్య, ఉద్యోగ, ఉపాధి రంగాల్లో ముందుకు సాగడంతో పాటు సామాజిక ఐక్యతను కాపాడాలని అన్నారు. పాపన్న గౌడ్ చరిత్రను భావితరాలకు తెలియజేయాల్సిన బాధ్యత ప్రతి

ఒక్కరిపై ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సర్దార్ సర్వాయి పాపన్న యువజన సంఘం నందిగామ మండల అధ్యక్షుడు అగ్గి మహేష్ గౌడ్, మాజీ ఎమ్మెల్యే చల్లపల్లి ప్రతాపరెడ్డి, మాజీ ఎంపీపీ శివశంకర్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ మండల ప్రెసిడెంట్ కుమార స్వామి గౌడ్, నందిగామ సర్పంచ్ కొమ్ము కృష్ణ, కుందారం వెంకటరెడ్డి, డిప్యూటీ సర్పంచ్ ఎర్ర వెంకటేష్ గౌడ, సంఘం నాయకులు దేపల్లె అశోక్ గౌడ్, చించేటి కృష్ణ,ఎదిరే శ్రీకాంత్, బంట్రపు లింగం, బంట్రపు జంగయ్య అగ్గిప్రసాద్ గౌడ్, చించేటి శివకుమార్, అగ్గి ప్రవీణ్ గౌడ్ ఏదిరే శ్రీహరి, పాశం వెంకటేష్, శ్రీశైలం చించేటి బాలరాజ్, పాశం బాలరాజ్, చించేటి శేఖర్ గౌడ్, పాలమాకుల పెంటయ్య గౌడ్, అగ్గి అంజయ్య గౌడ్, బి సురేష్ గౌడ్ పాల్గొన్నారు

భూ భారతి దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలి

కొడిమ్యాల తహసీల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్

జగిత్యాల ప్రతినిధి, ఆగస్టు 18(ప్రజాకలం): కొడిమ్యాల మండల తహసీల్దార్ కార్యాలయాన్ని మంగళవారం జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యాలయంలో భూ భారతి సంబంధిత పెండింగ్ అంశాలు, సాదా బైనామా, మీసేవ ఫైళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, నూతనంగా ప్రవేశపెట్టిన భూ భారతి రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన భూ సమస్యలకు సంబంధించిన ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. మీసేవ ద్వారా జారీ చేయాల్సిన సర్టిఫికెట్లు పెండింగ్‌లో లేకుండా ఎప్పటికప్పుడు పూర్తి చేసి ప్రజలకు అందించాలని సూచించారు. అనంతరం పలు రెవెన్యూ రికార్డులను పరిశీలించిన కలెక్టర్.. అధికారులు, సిబ్బంది సమయపాలన పాటించాలని, క్షేత్రస్థాయిలో ప్రజల సమస్యలను గుర్తించి పరిష్కరించాలని అన్నారు. నివేదికలను నిర్ణీత సమయంలో సమర్పించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ తనిఖీలో జగిత్యాల ఆర్డీవో మధుసూదన్, కొడిమ్యాల తహసీల్దార్ నరేష్, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగ కళాకారుల ఉద్యమాన్ని ఉధృతం చేస్తాం

- ఇచ్చిన హామీని కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే అమలు చేయాలి: అనువోజు వెంకటేశం

సిద్దిపేట టౌన్:18 ఆగస్టు 2026 (ప్రజా కలం ప్రతినిధి)

తెలంగాణ నిరుద్యోగ కళాకారులకు ఉద్యోగాలు కల్పిస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలని,లేనిపక్షంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని తెలంగాణ ఉద్యమ నిరుద్యోగ కళాకారుల సంఘం రాష్ట్ర చైర్మన్ అనువోజు వెంకటేశం హెచ్చరించారు. సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో తెలంగాణ ఉద్యమ నిరుద్యోగ కళాకారుల సంఘం సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు ఎర్రవల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన అనువోజు వెంకటేశం మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం తన మేనిఫెస్టోలో

ఇచ్చిన హామీ మేరకు తెలంగాణ సాంస్కృతిక సారథిలో నిరుద్యోగ కళాకారులకు ఉద్యోగాలు కల్పిస్తామని ప్రకటించి, అధికారంలోకి వచ్చి మూడేళ్లు కావస్తున్నా హామీని అమలు చేయడంలో జాప్యం చేస్తోందని ఆరోపించారు. ఈ నేపథ్యంలో ఆగస్టు 31, సెప్టెంబర్ 1,2 తేదీల్లో రాష్ట్రంలోని ఉమ్మడి పది జిల్లాల కలెక్టరేట్ల ఎదుట నిరసన దీక్షలు చేపట్టనున్నట్లు తెలిపారు.రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు నిరుద్యోగ కళాకారులందరూ ఆయా తేదీల్లో తమ ఉమ్మడి జిల్లా కలెక్టరేట్ల ఎదుట నిర్వహించే ఒకరోజు నిరసన దీక్షల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు.ఏ జిల్లాలో ఏ తేదీన దీక్ష నిర్వహించాలనే వివరాలను త్వరలో ప్రకటిస్తామని వెల్లడించారు.ఆగస్టు 31లోపు ముఖ్యమంత్రి నిరుద్యోగ కళాకారులతో చర్చలు జరిపి సమస్యను పరిష్కరించాలని కోరారు.ప్రభుత్వం ఇచ్చిన హామీని వెంటనే అమలు చేసి నిరుద్యోగ కళాకారులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.ఈ సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి పిన్నింటి దాసు,రాష్ట్ర కమిటీ సభ్యులు కుంచం శ్రీనివాస్,పిల్లిట్ల భుజంగం, జిల్లా ప్రధాన కార్యదర్శి పరమేష్ చిన్నగుండవెల్లి, ఉపాధ్యక్షులు తునికి రాజు,పాకాల భూపతి,గౌరవ అధ్యక్షుడు శ్యామ్ సుందర్,ప్రచార కమిటీ సభ్యులు రాజు చిన్నగుండవెల్లి,కోశాధికారి రాజు కందకట్ల, సలహాదారులు శశిధర్,ఇనుప సురేష్‌తో పాటు నిరుద్యోగ కళాకారులు యాదగిరి,విష్ణు, శ్రీనివాస్,బొల్లం గజ్జెల సూర్యావంశీ,రాకేష్,రేణుక తదితరులు పాల్గొన్నారు.

కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను యథావిధిగా కొనసాగించాలి

- గజ్వేల్ ఆర్డీవోకు వినతిపత్రం అందజేసిన బీఆర్ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్ రెడ్డి

గజ్వేల్:18 ఆగస్టు
(ప్రజా కలం ప్రతినిధి)

పేదింటి ఆడబిడ్డల వివాహాలకు ఆర్థిక భరోసా కల్పించే కళ్యాణ లక్ష్మి,షాదీ ముబారక్ పథకాలను యథావిధిగా కొనసాగించాలని బీఆర్ఎస్ పార్టీ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్ రెడ్డి డిమాండ్ చేశారు. పథకాలను పునరుద్ధరించాలని కోరుతూ మంగళవారం బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి గజ్వేల్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నుంచి ఆర్డీవో కార్యాలయం వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆర్డీవో కార్యాలయం ఎదుట బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం ఆర్డీవోకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వంటేరు ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ పేదింటి ఆడబిడ్డల వివాహాలకు ఆర్థిక భారం తగ్గించేందుకు కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను అమలు చేశారని తెలిపారు. ఈ పథకాల ద్వారా

దాదాపు 13 లక్షల మంది ఆడబిడ్డలకు రూ.13 వేల కోట్ల ఆర్థిక సాయం అందించినట్లు పేర్కొన్నారు. కోవిడ్ వంటి క్లిష్ట పరిస్థితుల్లోనూ ఈ పథకాలను కొనసాగించారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎన్నికల హామీలను అమలు చేయకుండా కళ్యాణ లక్ష్మి,షాదీ ముబారక్ పథకాలను నిర్వీర్యం చేసేందుకు ప్రయత్నిస్తోందని ఆయన ఆరోపించారు. పెళ్లి చేసుకున్న ఆడబిడ్డలకు ఇప్పటికీ పథకం సాయం అందకపోవడంతో అనేక కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయని తెలిపారు.

కళ్యాణ లక్ష్మి,షాదీ ముబారక్ పథకాలకు సంబంధించిన న్యాయపరమైన అంశాలపై ప్రభుత్వం వెంటనే స్పందించి అవసరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పేద ఆడబిడ్డల సంక్షేమానికి సంబంధించిన పథకాల విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడం సరికాదన్నారు. వెంటనే కేబినెట్ సమావేశం నిర్వహించి పథకాలను పునరుద్ధరిస్తూ జీవో జారీ చేయాలని కోరారు. అలాగే ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు మహిళలకు నెలకు రూ.2,500 ఆర్థిక సాయం అందించాలని,విద్యార్థినులకు స్కూటీల పంపిణీ చేపట్టాలని డిమాండ్ చేశారు. గ్రామాల్లో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. రైతు బీమా ప్రీమియం చెల్లించి,అర్హులైన మృత రైతు కుటుంబాలకు రూ.5 లక్షల బీమా సాయం అందించాలని డిమాండ్ చేశారు.కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను వెంటనే పునరుద్ధరించకపోతే బీఆర్ఎస్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ధర్నాలు, రాస్తారోకోలు,ఆందోళనలు చేపడతామని వంటేరు ప్రతాప్ రెడ్డి హెచ్చరించారు. పేద ప్రజలకు సంక్షేమ పథకాలు అందే వరకు బీఆర్ఎస్ పార్టీ పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిశెట్టి చందన రవీందర్,వైస్ చైర్‌పర్సన్ కళ్యాణ్‌కార్ పద్మాభాయ్ నర్సింగరావు,ఏఎంసీ మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, రైతుబంధు సమితి రాష్ట్ర మాజీ కోఆర్డినేటర్ దేవి రవీందర్,మైనార్టీ రాష్ట్ర నాయకులు జుబేర్ పాషా,గజ్వేల్ మండల అధ్యక్షుడు బెండే మధు,వివిధ మండలాల అధ్యక్షులు,బీఆర్ఎస్ కౌన్సిలర్లు, నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

సర్దార్ సర్వాయి పాపన్నకు ఘన నివాళులు అర్పించిన డిసిసి అధ్యక్షురాలు నిర్మలా జగ్గారెడ్డి

సంగారెడ్డి ప్రతినిధి ఆగస్టు 18(ప్రజా కలం):

సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతిని పురస్కరించుకుని సంగారెడ్డి డీసీసీ అధ్యక్షురాలు నిర్మలా జగ్గారెడ్డి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భం గా సంగారెడ్డి పట్టణం లోని కలెక్టరేట్ ఎదురుగా ఉన్న సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహానికి పూలమాల వేసి ఆయనను స్మరించుకున్నారు. గౌడ సంఘం నాయకులు నిర్మలా జగ్గారెడ్డి ని శాలువా తో సత్కరించారు. ఈ సందర్భంగా నిర్మలా జగ్గారెడ్డి

మాట్లాడుతూ, సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ధైర్యసాహసాలకు, సామాజిక న్యాయం కోసం ఆయన చేసిన పోరాటానికి చరిత్రలో ప్రత్యేక స్థానం ఉందన్నారు. అణగారిన వర్గాల హక్కుల కోసం పోరాడిన మహనీయుడు పాపన్న గౌడ్ అని కొనియాడారు.

సమాజంలో సమానత్వం, ఆత్మగౌరవం, సామాజిక న్యాయం కోసం ఆయన చూపిన మార్గం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. పాపన్న గౌడ్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆమె పిలుపునిచ్చారు. ఆయన జీవిత చరిత్రను, పోరాట స్ఫూర్తిని యువతకు తెలియజేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తోపాజీ అనంత్ కిషన్ , మున్సిప ల్ చైర్మెన్ కూన వనితా సంతోష్, టౌన్ ప్రెసిడెంట్ కిరణ్ గౌడ్, కూన సంతోష్ కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, గౌడ సంఘం నాయకులు తదితరులు పాల్గొని సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్‌కు ఘన నివాళులు అర్పించారు.

బాల్య వివాహాల రహిత జిల్లాగా సిద్దిపేటను తీర్చిదిద్దాలి

అధికారులు,ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు సమిష్టిగా కృషి చేయాలి: కలెక్టర్ కె. హైమావతి

సిద్దిపేట జిల్లా ప్రతినిధి:18ఆగస్టు (ప్రజా కలం ప్రతినిధి)

సిద్దిపేట జిల్లాను బాల్య వివాహాల రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు,స్వచ్ఛంద సంస్థలు సమిష్టిగా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ కె. హైమావతి పిలుపునిచ్చారు. మంగళవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (ఐడీఓసీ)లోని సమావేశ మందిరంలో బాల్య వివాహాల నిరోధక చట్టం--2006 అమలుపై సంబంధిత శాఖల అధికారులు,స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో నిర్వహించిన జిల్లా స్థాయి కన్వర్జెన్సీ సమావేశానికి కలెక్టర్ అధ్యక్షత వహించారు.ఈ సందర్భంగా బాల్య వివాహాల నిర్మూలనకు చేపట్టాల్సిన చర్యలపై అధికారులకు పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు.జిల్లాలో ఎక్కడైనా బాల్య వివాహం జరుగుతున్నట్లు సమాచారం అందిన వెంటనే సంబంధిత అధికారులు స్పందించి సత్వర చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.గ్రామాల్లో బాల్య వివాహాలు జరగకుండా సర్పంచులు ప్రత్యేక బాధ్యత తీసుకోవాలని సూచించారు. ఫంక్షన్‌హాళ్లు,దేవాలయాల్లో వివాహాల నిర్వహణ సందర్భంగా వధూవరుల వయస్సు ధ్రువీకరణ పత్రాలను పరిశీలించేలా చర్యలు చేపట్టాలని డీపీఓను ఆదేశించారు.గ్రామస్థాయిలో బాల్య వివాహాలపై విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని,తహసీల్దార్లు, పోలీస్ అధికారులు,మున్సిపల్ కమిషనర్లు,ఎంపీపీలు, సర్పంచులు సమన్వయంతో పనిచేస్తూ నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. పాఠశాలల్లో విద్యార్థులు క్రమం తప్పకుండా హాజరు కాకపోతే అందుకు గల కారణాలను ఉపాధ్యాయులు తెలుసుకుని పర్యవేక్షించాలని డీఈఓకు సూచించారు.బాల్య వివాహాలకు ఆర్థిక సమస్యలు కూడా ఒక కారణంగా ఉన్నందున,అర్హులైన కుటుంబాలకు ఉపాధి, ఆర్థిక ప్రయోజనాలు కల్పించే దిశగా సంబంధిత శాఖలు చర్యలు చేపట్టాలని ఆదేశించారు.బాల్య వివాహాలపై సత్వర చర్యలు చేపట్టేందుకు గ్రామస్థాయి కమిటీల సమావేశాలను క్రమం తప్పకుండా నిర్వహించాలని అన్నారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి జిల్లా స్థాయి కన్వర్జెన్సీ సమావేశం నిర్వహించాలని సూచించారు.మంగళ, గురువారాల్లో నిర్వహించే శానిటేషన్ డ్రైవ్‌ల సందర్భంగా బాల్య వివాహాల నిర్మూలనపై ప్రత్యేక అవగాహన కల్పించాలని తెలిపారు.ప్రతి పాఠశాలలో బాల్య వివాహాల నిరోధక చట్టం--2006తో పాటు పిల్లలకు కల్పించిన హక్కులపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్ అందె వెంకటేశ్వర్లు బాల్య వివాహాల నిరోధక చట్టం--2006పై అధికారులకు అవగాహన కల్పించారు. అనంతరం బాల్య వివాహాల నిర్మూలనపై రూపొందించిన వాయిస్‌ఓవర్, వాల్ పోస్టర్లను కలెక్టర్ ఆవిష్కరించారు.బాల్య వివాహాల నిర్మూలనపై అధికారులు,సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు.ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈఓ రమేష్, డీఆర్వో నాగరాజమ్మ, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి ధనరాజ్,జిల్లా సంక్షేమ అధికారి శారద,డీపీఓ రవీందర్, రిసోర్స్ పర్సన్ అందె వెంకటేశ్వర్లు,సంబంధిత శాఖల అధికారులు,స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయాల్లో సిటిజన్ చార్ట్ ఏర్పాటు చేయాలి

గజ్వేల్ ఆర్డీవోకు వినతిపత్రం అందజేసిన తెలంగాణ రక్షణ సేన

గజ్వేల్:18 ఆగస్టు 2026 (ప్రజా కలం ప్రతినిధి)

గజ్వేల్ రెవెన్యూ డివిజన్ పరిధిలోని అన్ని తహసీల్దార్ కార్యాలయాల్లో సిటిజన్ చార్ట్‌ను వెంటనే ఏర్పాటు చేసి, పక్కాగా అమలు చేయాలని తెలంగాణ రక్షణ సేన నాయకులు డిమాండ్ చేశారు.ఈ మేరకు గజ్వేల్ ఐఓసీ కార్యాలయంలో ఆర్డీవోకు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ తహసీల్దార్ కార్యాలయాల్లో ప్రజలకు అందించే వివిధ రెవెన్యూ సేవలకు సంబంధించిన గడువులు,విధివిధానాలు తెలిపే సిటిజన్ చార్టులు అందుబాటులో

లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.పౌతీ, సక్సెషన్,పహాణీ తదితర రెవెన్యూ సేవలను నిర్దేశిత గడువులోగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు.ప్రజలకు పారదర్శకంగా,నిర్ణీత సమయంలో సేవలు అందించేందుకు ప్రతి తహసీల్దార్ కార్యాలయంలో సిటిజన్ చార్ట్‌ను స్పష్టంగా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆదేశాల మేరకు ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాటం చేస్తున్నామని తెలిపారు.తమ వినతిపై ఆర్డీవో సానుకూలంగా స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని వెల్లడించారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ ఎడ్ల నర్సింలు,శ్రీకాంత్,రాజు, మధు,నర్సింలు,మిస్బా,స్వామి, కుమార్,నరేందర్ రెడ్డి తదితర తెలంగాణ రక్షణ సేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376వ జయంతి వేడుకలు

గజ్వేల్:18 ఆగష్టు 2026 (ప్రజా కలం ప్రతినిధి)

సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376వ జయంతి వేడుకలను గజ్వేల్ పట్టణంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ బడుగు,బలహీన వర్గాల హక్కుల కోసం పోరాడిన గొప్ప వీరుడని కొనియాడారు. ఆయన ఆశయాలను నేటి యువత ఆదర్శంగా తీసుకుని సమాజ అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో గజ్వేల్ మార్కెట్ వైస్ చైర్మన్ సర్దార్ ఖాన్,నక్క రేగొండ గౌడ్, సంగీతం అశోక్ గౌడ్,నక్క రాములు గౌడ్,గుంటుకు శ్రీనివాస్,ఆర్యవైశ్య సభ్యులు నంగునూరు సత్యనారాయణ గుప్త, రాయపోల్ రమేష్ గౌడ్,బాగమొల్ల మల్లేశం,బడే సత్యనారాయణ, ర్యాకము నరసింహులు,ముత్యాలు, బడే రవి,బైరం బాబు తదితరులు పాల్గొన్నారు.



కెసిఆర్ మళ్లీ సీఎం కావాలని సంకల్పంతో 270 కి.మీ. పాదయాత్ర

కొమురవెల్లి కమాన్ వద్ద జాడే తిరుపతి, దుర్గం శంకర్‌కు స్వాగతం పలికిన బిఆర్ఎస్ నాయకుడు మహేష్..

గజ్వేల్ నియోజకవర్గం
:18 ఆగష్టు 2026 (ప్రజాకలం ప్రతినిధి)

కెసిఆర్ మళ్లీ తెలంగాణ రాష్ట్రానికి ముఖ్యమంత్రి అయితేనే ప్రజలంతా సుభిక్షంగా, సంతోషంగా ఉంటారు'అనే సంకల్పంతో కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి మండలానికి చెందిన జాడే తిరుపతి,దుర్గం శంకర్ సుమారు 270 కిలోమీటర్ల పాదయాత్ర చేపట్టారు.ఈ పాదయాత్రలో భాగంగా మంగళవారం రాజీవ్ రహదారిపై ఉన్న కొమురవెల్లి కమాన్ వద్దకు వారు చేరుకున్నారు.

ఈ సందర్భంగా కొమురవెల్లి మండల బీఆర్ఎస్ నాయకులు వారికి ఘనంగా స్వాగతం పలికారు. పాదయాత్రికులకు తాగునీరు

అందించడంతో పాటు అరటిపండ్లు అందించి తమ అభిమానం చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఎర్పుల మహేష్,కనకయ్య యాదవ్, ముక్కు బాబు,మందాల బాబు, గీస చిన్న బిక్షపతి,రాజు,నవీన్ తదితరులు పాల్గొన్నారు.

అంగరంగ వైభవంగా మహేశ్వరం శ్రీ గడికోట మైసమ్మ పునఃప్రతిష్ఠ వేడుకలు

మహేశ్వరం, ఆగస్టు 18, (ప్రజా కలం)

మహేశ్వరం మండల కేంద్రంలోని శ్రీ గడికోట మైసమ్మ అమ్మవారి విగ్రహ పునఃప్రతిష్ఠ కార్యక్రమాలు వైభవంగా కొనసాగుతున్నాయి. మూడు రోజుల పాటు నిర్వహిస్తున్న ఈ వేడుకల్లో భాగంగా మంగళవారం పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు.

వేదమంత్రోచ్చారణల మధ్య హోమాలు

మంగళవారం ప్రాతఃకాల పూజల అనంతరం ఆవాహిత మండప దేవత హోమాలు నిర్వహించారు. అనంతరం గణపతి, రుద్ర, నవగ్రహ, అమ్మవారి మూలమంత్ర హోమాలను అర్చకులు వేదమంత్రోచ్చారణల మధ్య నిర్వహించారు.ఇప్పటికే సోమవారం గోపూజ, గణపతి పూజ, పుణ్యవచనం, పంచగవ్యం, యాగశాల ప్రవేశం, అఖండ దీపారాధన, కలశ స్థాపన, నవగ్రహ వాస్తు, అంకురారోపణ, అగ్నిప్రతిష్ఠ, హోమాలు తదితర కార్యక్రమాలను నిర్వహించారు.

బుధవారం ప్రాణప్రతిష్ఠ

బుధవారం ప్రాతఃకాల పూజలు, దీక్షా హోమాలతో పాటు యంత్ర ప్రతిష్ఠ నిర్వహించనున్నారు. ఉదయం 8.29 గంటలకు అమ్మవారి ప్రాణప్రతిష్ఠ కార్యక్రమం జరగనుంది. అనంతరం బింబ కళాన్యాసం, గర్భ పూజలు, దిష్టికుంభం, బలి ప్రధానం, మహాపూర్ణాహుతి తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నారు. అమ్మవారి విగ్రహ పునఃప్రతిష్ఠ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, యువకులు, గ్రామ పెద్దలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని సర్పంచ్ మునగపాటి నవీన్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ జోరల రమేష్, శివగంగ దేవాలయ చైర్మన్ అల్లే కుమార్, మాజీ ఎంపీటీసీ సుదర్శన్ యాదవ్, మాజీ సర్పంచ్ కూన యాదయ్య, స్వర్ణగంటి ఆనందం, కాకి ఈశ్వర్, శివమూర్తి, పోతర్ల అంబయ్య యాదవ్, నిమ్మగూడెం సుధీర్ గౌడ్, వీరిబాబుతో పాటు గ్రామ పెద్దలు, యువకులు, చిన్నారులు పాల్గొన్నారు.

కందుకూరులో సంచార పశువైద్య అంబులెన్స్ ఆకస్మిక తనిఖీ చేసిన అంబులెన్స్ నిర్మాణాధికారి శ్రీహరి

కందుకూరు, ఆగస్టు 18,(ప్రజా కలం)

కందుకూరు మండల కేంద్రంలోని సంచార పశువైద్యశాల అంబులెన్స్ – 1962 ను అంబులెన్స్ నిర్మాణాధికారి శ్రీహరి ఆకస్మికంగా తనిఖీ చేశారు. అంబులెన్స్‌లోని వైద్య పరికరాలు మందుల స్టాక్ రికార్డుల నిర్వహణ సిబ్బంది పనితీరు అత్యవసర సమయంలో పశువులు ఆస్పత్రికి వెళ్లలేని పరిస్థితిలో రైతులు 1962 కు ఫోన్ చేసిన వెంటనే అంబులెన్స్ సిబ్బంది ఎలా స్పందించి చికిత్స అందిస్తారో శ్రీ హరి స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పశువులకు అనారోగ్యం వచ్చినప్పుడు సిబ్బంది వెంటనే స్పందించి రైతులకు సేవలు అందించాలని సూచించారు. ఈ తనిఖీలో అంబులెన్స్ సిబ్బంది సాయికిరణ్, యాదయ్య, వెంకటేష్ పాల్గొన్నారు.

కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను ఆపడం కక్ష సాధింపు చర్యే

సరూర్‌నగర్ డివిజన్ మాజీ అధ్యక్షులు ఇంటూరి అంకి రెడ్డి

మహేశ్వరం, ఆగస్టు 18,(ప్రజా కలం)

పేద ప్రజల సంక్షేమం కోసం మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రవేశపెట్టిన కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ వంటి సంక్షేమ పథకాలను కొనసాగించకుండా నిలిపివేయడం సరైన నిర్ణయం కాదు. పేదింటి ఆడబిడ్డల వివాహాలకు ఆర్థిక భరోసా కల్పించిన ఈ పథకాలు ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయని సరూర్‌నగర్ డివిజన్ మాజీ అధ్యక్షులు ఇంటూరి అంకి రెడ్డి అన్నారు.కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల ద్వారా ప్రజల గుండెల్లో ఆయనకు ప్రత్యేక స్థానం ఏర్పడింది. కేసీఆర్ గారిపై ఉన్న ప్రజాదరణను చూసి కక్ష సాధింపు చర్యల్లో భాగంగానే కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను నిర్వీర్యం చేసే ప్రయత్నం జరుగుతోందనే భావన ప్రజల్లో ఉంది. ఈ రోజు సరూర్‌నగర్ డివిజన్ మాజీ అధ్యక్షులు ఇంటూరి అంకి రెడ్డి ఆధ్వర్యంలో, మాజీ రాష్ట్ర గ్రంథాలయ చైర్మన్ శ్రీ శ్రీధర్ సరూర్‌నగర్ ఎమ్మార్వో కి వినతిపత్రం అందజేశారు. పెండింగ్‌లో ఉన్న కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ దరఖాస్తులను వెంటనే పరిష్కరించి, అర్హులైన లబ్ధిదారులకు నిధులు విడుదల చేయాలని కోరారు. పేద ప్రజల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ఈ పథకాలను ఎలాంటి ఆటంకాలు లేకుండా కొనసాగించాలని, కక్ష సాధింపు రాజకీయాలను పక్కనపెట్టి సంక్షేమ పథకాలకు నిధులు విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం. ఈ కార్యక్రమంలో భారత రాష్ట్ర సమితి సీనియర్ నాయకులు పోలే సుధామ, పందుల రాజు, కొండల్ రెడ్డి, రిషి , మహమ్మద్ సలీం, కట్ట ప్రవీణ్, రాకేష్, శ్రీనివాస్, ప్రత్యూష్, శ్రీనివాస్ రెడ్డి, అలాగే మహిళా, నాయకులు భాగ్యగారు, లక్ష్మి మధులత యువజన, విద్యార్థి విభాగాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలను సీపీఐ తీవ్రంగా వ్యతిరేకిస్తుంది

సిపిఐ జాతీయ సమితి సభ్యులు పాలమాకుల జంగయ్య

శంషాబాద్ , ఆగస్టు 18,(ప్రజా కలం)

కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక ఉద్యోగ కార్మిక వ్యతిరేక విధానాలను సిపిఐ తీవ్రంగా వ్యతిరేకిస్తుందని సిపిఐ జాతీయ సమితి సభ్యులు పాలమాకుల జంగయ్య అన్నారు. సిపిఐ రంగారెడ్డి జిల్లా ప్రజా చైతన్య యాత్ర నేడు శంషాబాద్ మండల కేంద్రానికి వచ్చిన సందర్భంగా అంబేద్కర్ కూడలిలో జరిగిన సభలో ఆయన మాట్లాడారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. రైతులు, యువత, విద్యార్థులు, కార్మికులు, పేదలు ప్రభుత్వ విధానాల వల్ల తీవ్రంగా నష్టపోతున్నారని ఆర్థిక సామాజిక పరంగా ఎన్నో ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రైతాంగ సమస్యలను పరిష్కరించడంలో విఫలమైందని ఆయన విమర్శించారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పిస్తామని ఇచ్చిన హామీలు అమలు కాలేదని, వ్యవసాయ రంగం తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటోందని అన్నారు. రైతుల ఆత్మహత్యలు కొనసాగుతున్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు. దేశంలోని నిరుద్యోగ యువతకు ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని ఇచ్చిన హామీని కేంద్ర ప్రభుత్వం నిలబెట్టుకోలేదని సత్యం విమర్శించారు.

విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై కూడా కేంద్ర ప్రభుత్వం బాధ్యత వహించాలని ఆయన డిమాండ్ చేశారు. పోటీ పరీక్షల్లో అవకతవకలు, ప్రశ్నపత్రాల లీకేజీలు వంటి ఘటనల వల్ల విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారని, ఇలాంటి ఘటనలకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు.ప్రజల సమస్యలపై నిరంతరం పోరాడుతూ, రైతులు, కార్మికులు, యువత, విద్యార్థులు, పేదల హక్కుల పరిరక్షణ కోసం సీపీఐ తన పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తుందని ఆయన స్పష్టం చేశారు. ప్రజా చైతన్య బస్సు యాత్రలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందోజు రవీంద్ర చారి కంట్రోల్ కమిషన్ సభ్యులు పుస్తకాల నర్సింగ్ రావు పానుగంటి పర్వతాలు బుద్ధుల జంగయ్య ఓరుగంటి యాదయ్య జిల్లా కార్యవర్గ సభ్యులు ఏం ప్రభులింగం ఆర్ యాదగిరి పి శివకుమార్, శ్రీదేవి దత్తు నాయక్, క్రాంతి వంశి వర్ధన్ రెడ్డి సుధాకర్ నర్రగిరి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో జాప్యం!..

నిర్లక్ష్యంపై కొరడా!..

-రూ.75 కోట్ల పనులు.. గడువులోగా పూర్తి చేయాలి!..

-పనులు మొదలుపెట్టని కాంట్రాక్టర్లకు నోటీసులు..

-చెత్త, వీధిదీపాలపై ఎమ్మెల్యే ఆగ్రహం..అధికారులకు కఠిన ఆదేశాలు..

పటాన్‌చెరు, ఆగస్టు 18 (ప్రజా కలం) ప్రతినిధి

పటాన్‌చెరు నియోజకవర్గంలో అభివృద్ధి పనులను వేగవంతం చేసి,ప్రజలకు అవసరమైన మౌలిక వసతులను సకాలంలో అందించాలని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అధికారులను ఆదేశించారు. జాప్యం, నిర్లక్ష్యాన్ని సహించబోమని స్పష్టం చేశారు.పటాన్‌చెరు ఎమ్మెల్యే శిబిర కార్యాలయంలో మంగళవారం నియోజకవర్గ స్థాయి సమీక్ష నిర్వహించారు. ఇంద్రేశం, ఇస్నాపూర్, జిన్నారం, గుమ్మడిదల, గడ్డపోతారం పరిధిలో సుమారు రూ.75 కోట్లతో జరుగుతున్న అభివృద్ధి పనుల పురోగతిని సమీక్షించారు. ప్రతి పనికి గడువు నిర్ణయించి, సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు..

పనులు ప్రారంభించని కాంట్రాక్టర్లపై చర్యలు..

టెండర్లు పూర్తయినా పనులు ప్రారంభించని కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలని, అవసరమైతే నల్లజాబితాలో చేర్చి కొత్త కాంట్రాక్టర్లతో పనులు చేపట్టాలని సూచించారు. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రజల సమస్యలను స్వయంగా గుర్తించాలని అన్నారు..

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి..

పటాన్‌చెరు, అమీన్పూర్ పరిధిలో చెత్త సేకరణ, తరలింపులో రాంకీ సంస్థ నిర్లక్ష్యంపై ఎమ్మెల్యే అసంతృప్తి వ్యక్తం చేశారు. పారిశుధ్య సిబ్బంది, ఉప కమిషనర్లు ప్రతిరోజూ పర్యటించి పనులను పర్యవేక్షించాలని ఆదేశించారు. ప్రతి వీధిలో వీధిదీపాలు వెలిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు..

కొత్త కాలనీలకు వసతులు..

కొత్త కాలనీల్లో మంచినీరు, విద్యుత్, రహదారులు, మురుగునీటి కాలువలు, పారిశుధ్య వసతులు కల్పించడంలో జాప్యం ఉండకూడదన్నారు. ఇస్నాపూర్‌లో చెరువుల అభివృద్ధికి నిధులు కేటాయించాలని కమిషనర్ వెంకట కిషన్‌ను ఆదేశించారు..

సెప్టెంబర్‌లో ఉపకేంద్రాల ప్రారంభం..

పోచారం, లకడారం ప్రాంతాల్లో నిర్మించిన విద్యుత్ ఉపకేంద్రాలను సెప్టెంబర్‌లో ప్రారంభించనున్నట్లు తెలిపారు. తక్కువ విద్యుత్ ఒత్తిడి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని డీఈ భాస్కరరావును ఆదేశించారు. పటాన్‌చెరు, అమీన్పూర్ పరిధిలో పాఠశాలల ఏర్పాటుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని, త్వరలో పనులు ప్రారంభమవుతాయని తెలిపారు. చేయూత పింఛన్లపై ప్రజలకు అవగాహన కల్పించి, అర్హులకు సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్మన్లు జనార్ధన్, కుమార్ గౌడ్, ప్రమీల, సుష్మ, సుమలత, ఉప కమిషనర్లు ప్రదీప్ కుమార్, జ్యోతి రెడ్డి, ఈఈ భీమ్, డీఈ బాల గోపాల్, ఎంపీడీవోలు యాదగిరి, ఉమాదేవి, కమిషనర్లు వెంకట కిషన్, అజయ్ రెడ్డి, తాన్య, దశరథ్, నరేందర్ రెడ్డి, డీఈ భాస్కరరావు, ఈఈ సురేష్, డీఈలు కృష్ణవేణి, సురేష్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు..

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో 1 రోజు జైలు 10,000 జరిమానా

మద్యం సేవించి వాహనాలు నడపొద్దు

కందుకూరు సిఐ వెంకటేశ్వర్లు

కందుకూరు, ఆగస్టు 18,(ప్రజా కలం)

రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం కందుకూరు ఎక్స్ రోడ్డు వద్ద కందుకూరు పోలీసులు నిర్వహించిన వాహన తనిఖీల్లో డ్రంక్ అండ్ డ్రైవ్ చేస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. కేసు వివరాలు నిందితుడు రాజ్‌బీర్ సింగ్ బర్మల్ సింగ్ వయస్సు 36 సంవత్సరాలు మద్యం సేవించి వాహనం నడపడం తో పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకుని ఇబ్రహీంపట్నం కోర్టులో హాజరుపరిచారు. కోర్టు తీర్పు స్పెషల్ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ సుజాత మోటార్ వెహికల్స్ యాక్ట్ సెక్షన్ 185(ఏ)ప్రకారం 1 రోజు జైలు శిక్ష 10,000 జరిమానా విధించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్, కందుకూరు పోలీస్ స్టేషన్ మాట్లాడుతూ మద్యం సేవించి వాహనం నడపడం వల్ల మీ ప్రాణాలతో పాటు రోడ్డుపై వెళ్లే ఇతరుల ప్రాణాలకు కూడా ప్రమాదం. దయచేసి ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు తప్పకుండా పాటించాలి. డ్రంక్ అండ్ డ్రైవ్ పై కఠిన చర్యలు తీసుకుంటాం" అని తెలిపారు.

సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి వేడుకల్లో పాల్గొన్న రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు టియూఎఫ్ఐడిసి చైర్మన్ చల్లా నరసింహారెడ్డి

మహేశ్వరం, ఆగస్టు 18,(ప్రజా కలం)

మహేశ్వరం నియోజకవర్గం, జిల్లెలగూడ డివిజన్, చందన చెరువు కట్ట పై సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు.

ప్రజల గుండెల్లో సర్వాయి పాపన్న జ్ఞాపకాలు నేటికీ పదిలంగా ఉన్నాయని ఈరోజు జరిగిన జయంతి వేడుకల్లో నాయకులు కొనియాడారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథి రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు,టియూఎఫ్ఐడిసి చైర్మన్ చల్లా నరసింహారెడ్డి మాట్లాడుతూ అణగారిన ప్రజలను ఏకం చేసి, సామాజిక ఆధిపత్యాలకు సవాల్ విసిరిన వీర యోధుడు సర్వాయి పాపన్న గౌడ్ అని అన్నారు. మొఘల్ పాలకులు, బ్రిటిష్ వాళ్లు ఆయనను బందిపోటుగా చిత్రీకరించినా, ప్రజల జ్ఞాపకాల్లో మాత్రం వీరుడిగా, రాజుగా, విప్లవ యోధుడిగా నిలిచిపోయారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సిద్దాల దశరథ్, మీర్పేట్ డివిజన్ అధ్యక్షులు చల్లా బాల్ రెడ్డి, జిల్లెలగూడ డివిజన్ అధ్యక్షులు సిద్దాల శ్రీశైలం, జిల్లా సెక్రెటరి శేఖర్ రెడ్డి,మహిళా నాయకులు గంగమ్మ , పద్మ,సీనియర్ నాయకులు రవీందర్, సైదులు, పరశురాం, సోషల్ మీడియా ఇంచార్జి సిద్దేశ్వర చారి, ఎరుకల వెంకటేష్ గౌడ్, కుంటల బిక్షపతి గౌడ్, సుర్వి మల్లేష్ గౌడ్, బొబ్బిలి కిరణ్ గౌడ్, ఎరుకల మురళీష్ గౌడ్, కుంటల శేఖర్ గౌడ్, కుంటల అనిల్ గౌడ్, కుంటల బాలకృష్ణ గౌడ్, సుర్వి శేఖర్ గౌడ్, చేగురి ప్రసాద్ గౌడ్, ఎరుకల మల్లేష్ గౌడ్, ఎరుకల రవితేజ గౌడ్, కుంటల రాహుల్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కళాశాల హాస్టల్ నుంచి విద్యార్థి అదృశ్యం

కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న మహేశ్వరం పోలీసులు

మహేశ్వరం, ఆగస్టు 18, ప్రజా కలం:

మహేశ్వరం గేట్‌లోని మహాత్మా జ్యోతిబా ఫూలే తెలంగాణ వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలలో జూనియర్ ఇంటర్మీడియట్ (ఎంపీసీ) చదువుతున్న 17 ఏళ్ల విద్యార్థి కుమ్మరి చరణ్ తేజ అదృశ్యమయ్యాడు.

ఈ మేరకు కళాశాల ప్రిన్సిపాల్ చంద్రకళ మహేశ్వరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కొత్తూరు మండలం మల్లాపూర్ గ్రామానికి చెందిన దివంగత కుమ్మరి సుభాష్ కుమారుడు చరణ్ తేజ. తల్లిదండ్రులు లేకపోవడంతో మేనమామ కె. శైలూ సంరక్షణలో ఉంటున్నాడు. జూన్ 2026 నుంచి మహేశ్వరం గేట్‌లోని మహాత్మా జ్యోతిబా ఫూలే తెలంగాణ వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలలో జూనియర్ ఇంటర్ (ఎంపీసీ) చదువుతూ హాస్టల్‌లో ఉంటున్నాడు. 16వ తేదీ రాత్రి సుమారు 10:30 గంటలకు రాత్రి విధుల్లో ఉన్న ఉపాధ్యాయులు హాస్టల్‌లో విద్యార్థుల హాజరు తీసుకున్న సమయంలో చరణ్ తేజ అక్కడే ఉన్నాడు.అనంతరం అర్ధరాత్రి సమయంలో తోటి విద్యార్థులు వాష్‌రూమ్‌కు వెళ్లి తిరిగి వచ్చేసరికి చరణ్ తేజ హాస్టల్‌లో కనిపించలేదు. తొలుత వాష్‌రూమ్‌కు వెళ్లి ఉంటాడని భావించినప్పటికీ తెల్లవారుజామున వరకు తిరిగి రాకపోవడంతో హాస్టల్, పరిసర ప్రాంతాల్లో గాలించారు. అయినా ఆచూకీ లభించలేదు. ఈ విషయాన్ని హౌస్ మాస్టర్‌తో పాటు విద్యార్థి మేనమామకు సమాచారం అందించారు. అనంతరం మహేశ్వరం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసిన పోలీసులు చరణ్ తేజ ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపట్టారు.హాస్టల్, పరిసర ప్రాంతాల్లోని నిఘా కెమెరాల దృశ్యాలను పరిశీలిస్తూ దర్యాప్తు కొనసాగిస్తున్నారు. విద్యార్థి ఆచూకీ తెలిసిన వారు మహేశ్వరం పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

సబ్బండ వర్గాల సమానత్వం కోసం పోరాడిన పాపన్న గౌడ్

సామాజిక న్యాయం, అన్ని వర్గాలకు సముచిత ప్రాతినిధ్యమే లక్ష్యం: కొట్టాల యాదగిరి

గజ్వేల్:18 ఆగస్టు 2026 (ప్రజా కలం ప్రతినిధి)

సబ్బండ వర్గాల రాజకీయ, సామాజిక సమానత్వం కోసం సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ చేసిన పోరాటం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిందని తెలంగాణ రక్షణ సేన గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి కొట్టాల యాదగిరి అన్నారు. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతిని పురస్కరించుకుని మంగళవారం గజ్వేల్ పట్టణంలో తెలంగాణ రక్షణ సేన ఆధ్వర్యంలో జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.

ఈ సందర్భంగా కొట్టాల యాదగిరి పాపన్న గౌడ్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.

అనంతరం ఆయన మాట్లాడుతూ అణగారిన వర్గాల ఆత్మగౌరవం కోసం పాపన్న గౌడ్ చేసిన పోరాటం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. తెలంగాణ బహుజన ఆత్మగౌరవానికి, ధీరత్వానికి పాపన్న గౌడ్ ప్రతీకగా నిలిచారని కొనియాడారు.ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.

పార్టీ పదవుల్లో అన్ని వర్గాలకు ప్రాతినిధ్యం

సామాజిక న్యాయాన్ని సాధించే దిశగా పార్టీ పదవుల్లో అన్ని వర్గాలకు ప్రాతినిధ్యం కల్పిస్తూ సంస్థాగత నియామకాలు చేపట్టినట్లు తెలిపారు. ఈ సందర్భంగా గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ 7వ వార్డు అధ్యక్షుడిగా కుంటనల్ల కుమార్,8వ వార్డు అధ్యక్షుడిగా మహంకాళి మధు, గజ్వేల్–ప్రజ్ఞాపూర్ పట్టణ యువజన విభాగం అధ్యక్షుడిగా కూరాకుల శ్రీకాంత్‌ను నియమిస్తూ నియామక పత్రాలను అందజేశారు.ఈ సందర్భంగా కొట్టాల యాదగిరి మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారం, సామాజిక న్యాయం,అన్ని వర్గాలకు సముచిత ప్రాతినిధ్యం కల్పించడం తమ పార్టీ ప్రధాన లక్ష్యాలని తెలిపారు. గజ్వేల్ నియోజకవర్గంలో పార్టీని మరింత బలోపేతం చేస్తూ ప్రజల కోసం నిరంతరం పనిచేస్తామని అన్నారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ రక్షణ సేన నాయకులు మాజీ ఎంపీటీసీ ఎడ్ల నర్సింలు,రాజు, నర్సింలు,మిస్సా,స్వామి,కుమార్, నరేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సర్వాయి పాపన్న గౌడ్ ఆశయాలను నేటి తరానికి చాటాలి

మేడ్చల్/మల్కాజ్ గిరి ఆగస్టు 18(ప్రజాకలం న్యూస్)

సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ఆశయాలు, పోరాట స్ఫూర్తిని నేటి తరానికి తెలియజేసేలా కార్యక్రమాలు నిర్వహించాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి సందర్భంగా మల్కాజిగిరిలో మంగళవారం గౌడ సంఘం ఆధ్వర్యంలో జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాపన్న గౌడ్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి,మాజీ కార్పొరేటర్లు, వివిధ పార్టీల నాయకులతో పాటు ఎమ్మార్పీఎస్, బీసీ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. వక్తలు మాట్లాడుతూ సర్వాయి పాపన్న గౌడ్ అణగారిన వర్గాల హక్కుల కోసం, బహుజనుల కోసం చేసిన పోరాటం, త్యాగాలను యువతకు తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి సంవత్సరం జయంతి వేడుకలకే పరిమితం కాకుండా ఏడాది పొడవునా పాపన్న గౌడ్ ఆశయాలు, పోరాట చరిత్రను విద్యార్థులు, యువతకు పరిచయం చేసేలా వివిధ కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు.ఆయన పోరాట స్ఫూర్తిని ఆచరణలోకి తీసుకువచ్చి సామాజిక సమానత్వం కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో గౌడ సంఘ నాయకుడు నరసింహగౌడ్, ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకులు తిప్పారపు లక్ష్మణ్ మాదిగ, రామచందర్ మాదిగ,ఎంజెఎఫ్ రాష్ట్ర నాయకులు మనోహర్,మాజీ కార్పొరేటర్లు రాజ్యలక్ష్మి,సునీత రాము యాదవ్, నాయకులు బాలచందర్ గౌడ్, కుమ్మరి రాజు, శంకర్,నవీన్ గౌడ్, కిరణ్, నవీన్, విక్కీ, వెంకటరమణ,తుపాకుల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ 376 వ జయంతి వేడుకలు...

మేడిపల్లి ఆగస్టు 18(ప్రజాకలం న్యూస్)

సర్దార్ సర్వాయి పాపన్న సేన నాయకులు నెర్థం భాస్కర్ గౌడ్ ఆధ్వర్యంలో గజ్జెల సత్యరాజ్ గౌడ్, బూత్కురి నవీన్ గౌడ్ నేతృత్వంలో ఆధ్వర్యంలో మంగళవారం చిలకనగర్ ఆదర్శ్ నగర్ లో గల పాపన్న విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా

బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్, స్థానిక ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, మల్కాజ్ గిరి పార్లమెంట్ నియోజకవర్గ ఇన్చార్జ్ రాగిడి లక్ష్మారెడ్డి,బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి తాడూరి శ్రీనివాస్,ప్రజాపతి బొడుప్పల్ మాజీ కార్పొరేటర్ సీసా వెంకటేష్ గౌడ్, బన్నాల గీత ప్రవీణ్ ముదిరాజ్, గోనె శ్రీకాంత్ ముదిరాజ్, దేవసాని బాలచందర్, బజారు జగన్ గౌడ్, గోపు సదానంద్, కోల రవికుమార్ గౌడ్,జల్లి మోహన్, గోనే అంజయ్య, పుప్పాల వెంకటేశ్వర్లు, బజార్ మురళి గౌడ్,పిల్లి నాగరాజ్, కొయ్యడ ప్రసాద్ గౌడ్,తెలంగాణ సంపత్,ఆకుల మహేందర్, పద్మశాలి సంఘం అధ్యక్షులు సకినాల ప్రసాద్ నేత, షెడ్యూల్ కులాల సేవా సంఘం అధ్యక్షులు కూరెళ్ళ యాదగిరి, న్యూ రామ్ నగర్ కాలనీ అధ్యక్షులు రామంచర్ల బలరాం, అంతగల్ల,అశోక్, ఆనంద్ నగర్ కాలనీ అధ్యక్షులు వంగల,వెంకటేష్ గౌడ్,చిలికానగర్ మాల మహానాడు అధ్యక్షులు మాస శేఖర్,ములకలపల్లి రాజేష్ ముదిరాజ్, ఎడ్ల పరమేశ్వర్, పల్లె రాజ్ కుమార్ గౌడ్,పిట్టల నరేష్ ముదిరాజ్,కొంపల్లి రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్డీవో ఆఫీసు నిర్మాణానికి కలెక్టర్ స్థల పరిశీలన

జగిత్యాల ప్రతినిధి ఆగస్టు 18 (ప్రజాకలం) జగిత్యాల జిల్లాలోని ధరూర్ క్యాంప్‌లో నూతన ఆర్డీవో కార్యాలయ భవన నిర్మాణం కోసం జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మంగళవారం స్థలాన్ని పరిశీలించారు. కార్యాలయ భవన నిర్మాణానికి అనువైన స్థలం, అందుబాటులో ఉన్న విస్తీర్ణం, మౌలిక వసతులు తదితర అంశాలను అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా భవన నిర్మాణానికి సంబంధించిన ప్రతిపాదనలు, అవసరమైన చర్యలపై అధికారులతో జిల్లా కలెక్టర్ చర్చించారు.స్థల పరిశీలన అనంతరం భవన నిర్మాణానికి సంబంధించి తదుపరి చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో జగిత్యాల ఆర్డీవో మధుసూదన్, జగిత్యాల అర్బన్ తహసీల్దార్ రామ్మోహన్, హౌసింగ్ డీఈ భాస్కర్, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పోలీస్ ఉద్యోగార్థులకు సువర్ణావకాశం

నిజామాబాద్‌లో ఉచిత శిక్షణ

నిజామాబాద్,
(ప్రజా కలం ప్రతినిధి) ఆగస్టు 18:

తెలంగాణ పోలీస్ శాఖలో కానిస్టేబుల్, సబ్-ఇన్స్పెక్టర్ (SI) ఉద్యోగాల నియామక పరీక్షలకు సిద్ధమవుతున్న నిరుద్యోగ యువతీ యువకులకు నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ ఒక అద్భుతమైన అవకాశాన్ని కల్పిస్తోంది. కమిషనరేట్ పరిధిలోని నిజామాబాద్, ఆర్మూర్, బోధన్ డివిజన్ల అభ్యర్థుల కోసం ప్రత్యేకంగా ఉచిత పోలీస్ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య ఐ.పి.యస్. ఒక ప్రకటనలో తెలిపారు.పూర్తి ఉచితంగా అందించే ఈ శిక్షణకు అర్హులైన అభ్యర్థులను ఎంపిక చేసేందుకు ఈ నెల 23న (ఆదివారం) స్క్రీనింగ్ పరీక్ష నిర్వహించనున్నారు.

ముఖ్య సమాచారం:

దరఖాస్తు విధానం: అభ్యర్థులు తమ పరిధిలోని పోలీస్ స్టేషన్ అధికారులను సంప్రదించి, వారు అందించే గూగుల్ ఫామ్ (Google Form) లింక్ లేదా క్యూఆర్ (QR) కోడ్ ద్వారా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది.

స్క్రీనింగ్ పరీక్ష: ఆగస్టు 23న ఉదయం 10:00 గంటల నుండి మధ్యాహ్నం 1:00 గంటల వరకు ఆబ్జెక్టివ్ విధానంలో 200 మార్కులకు పరీక్ష జరుగుతుంది. పరీక్షా కేంద్రాలు: నిజామాబాద్ డివిజన్ అభ్యర్థులకు మాక్లూర్ లోని విజయ రూరల్ ఇంజనీరింగ్ కాలేజ్, ఆర్మూర్ డివిజన్ వారికి క్షత్రియ ఇంజనీరింగ్ కాలేజీ, బోధన్ డివిజన్ వారికి జూనియర్ ఇంటర్ డిగ్రీ కాలేజీలలో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు.

ఉచిత స్టడీ మెటీరియల్: స్క్రీనింగ్ పరీక్షలో ప్రతిభ కనబరిచిన అభ్యర్థులకు సెప్టెంబర్ 1 నుండి అక్టోబర్ 31 వరకు (రెండు నెలల పాటు) రోజువారీగా (ఉదయం 9:00 నుండి సాయంత్రం 5:30 వరకు) ఉచిత శిక్షణ ఇస్తారు. శిక్షణ కాలంలో ఉచితంగా స్టడీ మెటీరియల్‌తో పాటు 10 గ్రాండ్ టెస్ట్‌లను నిర్వహిస్తారు. అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సీపీ కోరారు. ఇతర వివరాల కోసం క్రాంతి (ఫోన్ నెంబర్లు: 9951943656, 8712533273) ను సంప్రదించవచ్చు.

బోనాల సందర్భంగా పారిశుద్ధ్య కార్మికులకు బట్టల పంపిణీ

మల్కాజిగిరి
ఆగస్టు 18(ప్రజా కలం ప్రతినిధి)

బోనాల పర్వదినాన్ని పురస్కరించుకుని మౌలాలి 186వ డివిజన్ కాంటెస్టెడ్ కార్పొరేటర్ పోతుల ఉమా మహేశ్వరి వినోద్ యాదవ్ ఆధ్వర్యంలో మౌలాలి ప్రాంతంలోని జీహెచ్ఎంసీ పారిశుద్ధ్య కార్మికులకు చీరలను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా పోతుల ఉమా మహేశ్వరి వినోద్ యాదవ్ మాట్లాడుతూ బోనాల పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని అన్నారు. పండుగ వేళ ప్రజలు ఆనందంగా, భక్తిశ్రద్ధలతో వేడుకలు జరుపుకునేలా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంలో పారిశుద్ధ్య కార్మికుల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు. ప్రజల ఆరోగ్యం,పట్టణ పరిశుభ్రత కోసం ఎండ, వానను సైతం లెక్కచేయకుండా పారిశుద్ధ్య కార్మికులు నిరంతరం సేవలందిస్తున్నారని అభినం దించారు. వారి సేవలను గుర్తించి, బోనాల పర్వదినం సందర్భంగా చీరలను అందజేయడం ఆనందంగా ఉందన్నారు.

పారిశుద్ధ్య కార్మికులు ప్రతిరోజూ తెల్లవారుజామునే విధుల్లోకి హాజరై వీధులు,కాలనీలు పరిశుభ్రంగా ఉండేలా కృషి చేస్తున్నారని, వారి సేవలను ప్రతి ఒక్కరూ గౌరవించాలని కోరారు. పండుగల సమయంలో పారిశుద్ధ్య నిర్వహణ మరింత బాధ్యతతో కూడుకున్నదని, అలాంటి సమయంలోనూ ప్రజలకు ఇబ్బందులు కలగకుండా విధులు నిర్వర్తిస్తున్న కార్మికుల సేవలు అభినందనీయమన్నారు. చీరల పంపిణీ కార్యక్రమం పట్ల పారిశుద్ధ్య కార్మికులు సంతోషం వ్యక్తం చేస్తూ నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు.

జర్నలిస్టుల సమస్యలపై ఇక పోరుబాటే.!

- నివేశన స్థలాలు, హెల్త్ కార్డులు.. పెండింగ్ అక్రిడేషన్లు వెంటనే పరిష్కరించాలి

- జిల్లా అధ్యక్షులు లాయక్ పాషా.

రాజన్న సిరిసిల్ల, ఆగస్టు 18 (ప్రజా కలం ప్రతినిధి) :

జర్నలిస్టుల హక్కుల సాధన, సంక్షేమం, స్వేచ్ఛ పరిరక్షణ కోసం టీయూడబ్ల్యూజే హెచ్-143 నిరంతరం పోరాడుతుందని జిల్లా అధ్యక్షులు లాయక్ పాషా అన్నారు. అల్లం నారాయణ, మారుతి సాగర్‌ల సారథ్యంలో సిరిసిల్ల పట్టణంలో మంగళవారం నిర్వహించిన యూనియన్ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు జర్నలిస్టులకు నివేశన స్థలాలు, హెల్త్ కార్డులు కల్పించడంతో పాటు పెండింగ్‌లో ఉన్న అక్రిడిటేషన్ కార్డులను వెంటనే మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు,జర్నలిస్టుల సంక్షేమం, హక్కుల పరిరక్షణ కోసం యూనియన్ నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు.

రాజన్న సిరిసిల్ల జిల్లాలో వివిధ కారణాల చేత అసువులు బాసిన జర్నలిస్టు ల కుటుంబాలకు మీడియా అకాడమీ ద్వారా ఆర్థిక సహాయం, పెన్షన్ అందించే కార్యక్రమంలో సంఘం ముందుండి పనిచేస్తుందని గుర్తు చేశారు.ఈ సందర్భంగా సిరిసిల్ల పట్టణ టీయూడబ్ల్యూజే హెచ్-143 అధ్యక్షుడిగా పరకాల ప్రవీణ్, ప్రధాన కార్యదర్శిగా రఘువీర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు,నూతనంగా ఎన్నికైన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులను జిల్లా కమిటీ, సభ్యులు, స్థానిక జర్నలిస్టులు పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. యూనియన్ బలోపేతంతో పాటు సభ్యుల సంక్షేమం కోసం అహర్నిశలు కృషి చేస్తామని నూతన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు భరోసా ఇచ్చారు. జర్నలిస్టుల సమస్యలను ఐక్యంగా పరిష్కరించేందుకు ముందుండి పనిచేస్తామని పేర్కొన్నారు.కార్యక్రమంలో ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా అధ్యక్షులు ఇరుకుల్ల ప్రవీణ్ కుమార్, టీయూడబ్ల్యూజే ప్రధాన కార్యదర్శి సామల గట్టు, కోశాధికారి సయ్యద్ ఖలీమ్, ఉపాధ్యక్షుడు ప్రసాద్ రెడ్డి, సంయుక్త కార్యదర్శి సల్మాన్, మల్లికార్జున్, దారం కృష్ణ జిల్లా కార్యవర్గ సభ్యులు కంటాల విజయ్, మాజీ పట్టణ అధ్యక్షుడు రామనాథం సీనియర్ పాత్రికేయులు చిలుక సత్యనారాయణ, నాగరాజు, బి. శ్రీనివాస్, ఎం. శ్రీనివాస్, భాస్కర్, రఫీ, అస్లాం లతో పాటు జిల్లా నాయకులు, జర్నలిస్టులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పాలెంలో ఘనంగా సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి

నిజామాబాద్,(ప్రజా కలం ప్రతినిధి) ఆగస్టు 18:

మోర్తాడ్ మండలం పాలెం గ్రామంలో మంగళవారం సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376వ జయంతి ఉత్సవాలను గౌడ సంఘం ఆధ్వర్యంలో అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సుభాష్ చంద్రబోస్ విగ్రహం వద్ద ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. బహుజన రక్షకుడిగా, పీడిత ప్రజల విముక్తికై పోరాడిన పాపన్న గౌడ్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వక్తలు పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో మొక్కుదెబ్బ మండల అధ్యక్షుడు పండరి గౌడ్, గ్రామ సర్పంచ్ రాధ-రవి, ఉపసర్పంచ్ శ్రీనివాస్ గౌడ్, గౌడ సంఘం అధ్యక్షుడు మల్లేష్ గౌడ్, బీసీ, ఎస్సీ, ఎస్టీ - జేఎసి కన్వీనర్ ఉమేష్ మహారాజ్ పాల్గొన్నారు. వారితో పాటు ప్రముఖ నాయకులు అబ్బుల రామగౌడ్, అబ్బుల మధు గౌడ్, నర్సాగౌడ్, దత్తు గౌడ్, గంగాధర్ గౌడ్ మరియు గౌడ సంఘం ప్రతినిధులు, జర్నలిస్టు అంగుళీ మాల గ్రామస్తులు పాల్గొన్నారు.

తెలంగాణ గడ్డపై జంతర్ మంతర్ పోరు బిడ్డ కామ్రేడ్ నేహా

నిజామాబాద్,(ప్రజా కలం ప్రతినిధి) ఆగస్టు 18:

దేశ రాజధాని ఢిల్లీ నగర వీధుల్ని గడగడలాడించింది. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా, కేంద్ర సర్కార్ ని దోషిగా నిలబెట్టిన, 23రోజుల నిరాహారదీక్ష, పలు ప్రసంగాలతోనే జంతర్ మంతర్ ని "జాతీయ పోరాట వేదిక"గా మార్చగల్గిన

ఆలిండియా స్టూడెంట్ అసోసియేషన్ (ఐసా) అధ్యక్షురాలు నేహా బోరా. కొన్ని రోజుల క్రితం ఆర్ఎస్ఎస్ మూక ఆమె మొహం మీద ఇంకు చల్లి అవమానిస్తే "ఆ ఇంకుతోనే చరిత్ర తిరగ రాస్తా" అన్నది కామ్రేడ్ నేహా. లక్షల మంది విద్యార్థుల ప్రొటెస్ట్ కి ప్రతినిధి. ఐతే ఆగస్టు 16న లామకాన్లో తదుపరి 17న హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ (ఎచ్.సి.యూ)కి హాజరై ప్రసంగించారు. మొదలు ఆమె రోహిత్ వేముల విగ్రహానికి సెల్యూట్ చేసి మాట్లాడుతూ తాము జూలై 20న డిల్లీలో రాజ్యహింసకు గురైనప్పుడు మీరు తెలంగాణ గడ్డపై నిరసించినందుకు జైభీం లాల్ సలాం అంటూ విద్యార్థి లోకాన్ని అభినందించారు. డిల్లీ పోరాటా నంతరం నల్సార్ విద్యార్థులు సాధించిన విజయానికి సెల్యూట్ తెల్పారు. ఓయూ, ఎచ్.సి.యూలు తెలంగాణ సాధన, సిఏఏ, ఎన్.ఆర్.సీ వ్యతిరేక పోరులో అగ్రభాగాన ఉన్నవారంటూ ప్రశంసించారు. దేశ జెన్-జీ ఉద్యమం హిందు ముస్లిం రాజకీయాన్ని ఓడించిందని, బ్రాహ్మణీయ ఫాసిజానికి చెక్ పెట్టగల్గిందన్నారు. ప్రస్తుతం దేశ పిల్లలు తమ మంచి భవిష్యత్తు కోసం పోరు లోన్నరన్నారు. తమ దేశ పర్యటన "జెన్-జీ రైజింగ్" లో భాగంగా చెన్నయ్, నల్సార్, ముంబై, రాంచీ విద్యార్థుల పోరాటాలకు సంఘీభావం కోసమేనన్నారు. తామందరం ముఖ్యంగా విద్యార్థుల భవిష్యత్తు, అస్తిత్వం, డిగ్నిటీ కోసం కల్సికట్టుగా పోరాడుదా మంటూ పిలుపునిచ్చారు.

కాంగ్రెస్‌లోకి బీఆర్ఎస్ నాయకుల చేరిక

మల్కాజిగిరి ఆగస్టు 18(ప్రజా కలం ప్రతినిధి)

మల్కాజిగిరి ప్రాంతానికి చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఏకే మురుగేష్, టీఎన్ కృష్ణ గౌడ్, జెగ్ మహేష్ గౌడ్, ఎల్లేష్ శ్రీనివాస్ రెడ్డితో పాటు సుమారు 30 మంది బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. మైనంపల్లి హనుమంతరావు సమక్షంలో జరిగిన కార్యక్రమంలో వారికి పార్టీ కండువాలు కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మైనంపల్లి హనుమంతరావు మాట్లాడుతూ మల్కాజిగిరిలో కాంగ్రెస్ పార్టీకి ప్రజల్లో ఆదరణ పెరుగుతోందని అన్నారు. వివిధ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ విధానాలకు ఆకర్షితులై పార్టీలో చేరుతున్నారని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో మరింత మంది నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ఈ నెల 23వ తేదీన మల్కాజిగిరిలో భారీ బహిరంగ సభను నిర్వహించనున్నట్లు మైనంపల్లి హనుమంతరావు వెల్లడించారు. ఈ సభలో ఉద్యమకారులతో పాటు వివిధ పార్టీలకు చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరనున్నారని తెలిపారు. మల్కాజిగిరి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీలో చేరిన వారిలో గుండా నిరంజన్, ఆకుల శ్రీనివాస్ గౌడ్, యోగేందర్, మల్లికార్జున్, దేవి, ఈశ్వర్, బాలరాజు, సూరి, మల్లారెడ్డితో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు ఉన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రెస్ క్లబ్స్ జాతీయ సదస్సుకు గవర్నర్‌కు ఆహ్వానం

హైదరాబాద్, ఆగస్టు 18 (ప్రజాకలం న్యూస్): ప్రెస్ క్లబ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో ఈ నెల 21న నిర్వహించనున్న జాతీయ సదస్సు ప్రారంభ ఆహ్వాన విందుకు తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్ల ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. ఈ మేరకు ఆయన తన అంగీకారం తెలిపారు. మంగళవారం లోకభవన్‌లో హైదరాబాద్ ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి రమేష్ వరికుప్పల నేతృత్వంలోని ప్రతినిధి బృందం గవర్నర్‌ను కలిసి సదస్సుకు ఆహ్వానించింది. జాతీయ స్థాయిలో మీడియా రంగం ఎదుర్కొంటున్న సవాళ్లు, మారుతున్న మీడియా పోకడలు, జర్నలిస్టుల పనితీరుపై గవర్నర్ సదస్సులో సందేశం ఇవ్వనున్నారు. ఈ సందర్భంగా ప్రెస్ క్లబ్ ఉపాధ్యక్షుడు ఏ. రాజేష్, జాయింట్ సెక్రటరీలు చిలుకూరి హరిప్రసాద్, వర్ధిల్లి బాపూరావు, కోశాధికారి రమేష్ వైట్ల, కార్యవర్గ సభ్యుడు ఎన్. శ్రీనివాస్ రెడ్డి తదితరులు గవర్నర్‌ను కలిసి ఆహ్వాన పత్రం అందజేశారు. గవర్నర్‌కు హైదరాబాద్ ప్రెస్ క్లబ్ డైరీని పాలక మండలి అందజేసింది. అనంతరం పూల మొక్కను అందించి సత్కరించారు.

తాజ్ కృష్ణ హోటల్‌లో సదస్సు

హైదరాబాద్‌లోని తాజ్ కృష్ణ హోటల్‌లో ఈ నెల 21న ప్రారంభమయ్యే ప్రెస్ క్లబ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జాతీయ సదస్సు రెండు రోజులపాటు కొనసాగనుంది. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి పలువురు సీనియర్ జర్నలిస్టులు, మీడియా ప్రతినిధులు సదస్సుకు హాజరుకానున్నారు. మీడియా రంగంలోని తాజా పరిణామాలు, జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలు, భవిష్యత్ సవాళ్లపై సదస్సులో చర్చించనున్నారు.

అదనపు అంతస్తుకు అనుమతి ఉందా?

జీవీఎంసీ జోన్-5లో అక్రమ నిర్మాణంపై స్థానికుల ఆరోపణలు.. కమిషనర్ తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్

విశాఖపట్నం ఆగస్టు 18 (ప్రజాకలం) :

జీవీఎంసీ జోన్-5 పరిధిలోని 43వ వార్డు తాటిచెర్లపాలెంలో అనుమతులకు విరుద్ధంగా అదనపు అంతస్తు నిర్మాణం జరుగుతోందంటూ స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రైవేట్ పాఠశాల ఎదురుగా ఉన్న సందులో ఈ భవనం నిర్మాణం జరుగుతుండగా, ఆమోదిత భవన ప్రణాళికలో అదనపు అంతస్తుకు అనుమతి లేదని స్థానికులు పేర్కొంటున్నారు.

ఆమోదించిన ప్లాన్‌లో ఎన్ని అంతస్తులకు అనుమతి ఇచ్చారు? ప్రస్తుతం నిర్మిస్తున్న అదనపు అంతస్తుకు ప్రత్యేక అనుమతి ఉందా? అనే అంశాలపై జీవీఎంసీ అధికారులు వెంటనే స్పష్టత ఇవ్వాలని స్థానికులు కోరుతున్నారు.

టౌన్ ప్లానింగ్ అధికారుల పర్యవేక్షణపై ప్రశ్నలు

అనుమతులకు విరుద్ధంగా నిర్మాణం జరుగుతున్నప్పటికీ సంబంధిత టౌన్ ప్లానింగ్ అధికారులు తగిన చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ముఖ్యంగా ప్లానింగ్ సెక్రటరీ ఫాతిమా వ్యవహారంపై స్థానికులు ప్రశ్నలు లేవనెత్తుతున్నారు. అదనపు అంతస్తు నిర్మాణానికి సంబంధించి బిల్డర్‌కు అనుకూలంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు కూడా స్థానికుల నుంచి వినిపిస్తున్నాయి. అయితే ఈ ఆరోపణలను జీవీఎంసీ అధికారులు అధికారికంగా పరిశీలించి వాస్తవాలను వెల్లడించాల్సి ఉంది.

ఏసీపీ తిరుపతిరావు దృష్టికి తీసుకెళ్లాలని డిమాండ్

ఈ వ్యవహారంపై ఏసీపీ తిరుపతిరావు కూడా దృష్టి సారించి, సంబంధిత నిర్మాణానికి సంబంధించిన అనుమతులు, ఆమోదిత ప్లాన్, ప్రస్తుతం జరుగుతున్న నిర్మాణాన్ని పరిశీలించి, విషయం జీవీఎంసీ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లాలని స్థానికులు కోరుతున్నారు. నిర్మాణంపై సమాచారం అందించినప్పటికీ తగిన స్థాయిలో చర్యలు కనిపించలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. అందువల్ల సంబంధిత విభాగం నివేదికపైనే ఆధారపడకుండా, సీనియర్ టౌన్ ప్లానింగ్ అధికారులతో స్వతంత్రంగా తనిఖీ చేయించాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

కమిషనర్ ముందుగా చర్యలు తీసుకోవాలి

ఈ వ్యవహారంపై జీవీఎంసీ కమిషనర్ ముందుగా స్పందించి తక్షణమే సైట్ ఇన్‌స్పెక్షన్‌కు ఆదేశాలు ఇవ్వాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

ప్రధానంగా అధికారులు ఈ అంశాలను పరిశీలించాలని కోరుతున్నారు:

- ఆమోదిత భవన నిర్మాణ ప్లాన్.
- అనుమతించిన అంతస్తుల సంఖ్య.
- అదనపు అంతస్తుకు ప్రత్యేక అనుమతి ఉందా లేదా?
- భవన సెట్‌బ్యాక్‌లు నిబంధనలకు అనుగుణంగా ఉన్నాయా?
- ప్రస్తుతం జరుగుతున్న నిర్మాణం ఆమోదిత ప్లాన్‌కు అనుగుణంగా ఉందా?
- నిర్మాణ పర్యవేక్షణలో సంబంధిత అధికారుల పాత్ర ఏమిటి?

అక్రమ నిర్మాణం నిర్ధారణ అయితే కఠిన చర్యలు

తనిఖీలో అదనపు అంతస్తుకు ఎలాంటి చెల్లుబాటు అయ్యే అనుమతి లేదని లేదా ఆమోదిత ప్లాన్‌కు విరుద్ధంగా నిర్మాణం జరుగుతోందని తేలితే, జీవీఎంసీ నిబంధనల ప్రకారం తక్షణమే చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

అక్రమ నిర్మాణాలను అనుమతించడం వల్ల భవిష్యత్తులో పార్కింగ్, రోడ్లు, డ్రైనేజీ వంటి మౌలిక వసతులపై ఒత్తిడి పెరిగే అవకాశం ఉందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

సమగ్ర విచారణకు డిమాండ్

ఈ వ్యవహారంపై సమయపరిమితితో కూడిన విచారణ చేపట్టి, నిర్మాణంలో నిబంధనల

ఉల్లంఘన లేదా అధికారుల నిర్లక్ష్యం ఉన్నట్లు తేలితే బాధ్యులపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

"ముందుగా నిర్మాణాన్ని తనిఖీ చేయాలి.. ఆమోదిత ప్లాన్‌తో పోల్చాలి.. అదనపు అంతస్తుకు అనుమతి లేకపోతే వెంటనే చర్యలు తీసుకోవాలి" అనేది స్థానికుల ప్రధాన డిమాండ్.

ఈ నేపథ్యంలో జీవీఎంసీ కమిషనర్ తక్షణమే జోక్యం చేసుకుని, సంబంధిత అధికారులతో సమగ్ర తనిఖీ చేయించి, వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.

బొమ్మలరామారం మండలం, నాగినేనిపల్లి గ్రామంలో

ప్రభుత్వ భూమి కబ్జా?

- సర్వేనెంబర్ 245 లో భూమి ఎంత ఉన్నది ఎంత ?

- ప్రభుత్వ భూమి మాది అంటే మాది అంటూ పోటాపోటీగా తాహసిల్దార్ కార్యాలయంలో ఫిర్యాదులు

బొమ్మలరామారం, ఆగస్టు 18 (ప్రజా కలం)

వడ్డించేవాడు మా వాడు అయితే అన్నానికి ఏం కొదవ అన్నట్టుగా ఉంది బొమ్మలరామారం మండలంలోని నాగినేనిపల్లి గ్రామంలో ఉన్న ప్రభుత్వ భూమి పరిస్థితి.ప్రభుత్వ ఆధీనంలో ఉండవలసిన భూమి బడాబాబుల ఆధీనంలో ఉండడం రెవిన్యూ అధికారుల పనితీరు పై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి రెవిన్యూ రికార్డుల ప్రకారం సర్వే నెంబర్ 245లో 27 ఎకరాల ప్రభుత్వ,లావుని పట్టా భూమి ఉండగా ఇప్పుడు ఎంత భూమి ఉన్నది అనేది అంతు చిక్కని ప్రశ్నగా మిగిలింది ఆహార భద్రత ఎఫ్ఎస్సి గోదాం నిర్మాణం కోసం మండలంలోని నాగినేనిపల్లి గ్రామంలో సర్వేనెంబర్ 245 ప్రభుత్వ భూమిలో మూడు ఎకరాల స్థలం సర్వే చేసి నిర్మాణం చేయుటకు జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు వీటితో పాటుగా గతంలో మైనింగ్ బ్లాస్టింగ్ చేయుటకు 7ఎకరాల భూమి 15 సంవత్సరాల లీజు కు హబ్సిగూడ కు చెందిన పారిశ్రామికవేత్తకు మైనింగ్ శాఖ మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది 27 ఎకరాలలో 7 ఎకరాల భూమి లీజుకు పోగా 20 ఎకరాల భూమి ఉండాలి 1994 సంవత్సరం ఫైల్ నెంబర్: ఏ/35/94 ప్రకారం పొట్ట స్వామి,బొమ్మగల సామయ్య, మరియు గుజ్జ బిక్షపతి, కానుగంటి అంజయ్య,ఇతర గ్రామస్తులకు ఇచ్చిన భూమిని 2000 సంవత్సరం నుంచి 2008 వరకు ప్రభుత్వ భూమి కొనుగోలు చేశామని ఈ భూమి మాకే చెందుతుందని మండల తాహాసిల్దార్ కార్యాలయంలో పోటా పోటీగా భూమికి సంబంధించిన పత్రాలు సమర్పించడం కలకలం రేపుతుంది ప్రభుత్వ భూమిని కబ్జా చేసిన రెవెన్యూ అధికారులు ఏలాంటి చర్యలు తీసుకోకపోవడం పలు అనుమానాలకు దారితీస్తున్నాయి ప్రభుత్వం ఇచ్చిన నిజమైన పట్టాదారులను విచారణ జరిపి ప్రభుత్వ భూమిని కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకొని భూమిని స్వాధీన పరుచుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు

మహేశ్వరంలో భూ ఆక్రమణల కలకలం

-ఫేక్ డాక్యుమెంట్లతో 37 ఎకరాల భూమి కబ్జా ఆరోపణ

- జెట్ కౌంటీ వెంచర్ పేరుతో అమ్మకాలు, స్కూల్ తొలగింపు కుట్ర

మహేశ్వరం, ఆగస్టు 18 (ప్రజా కలం):

రంగారెడ్డి జిల్లా మహేశ్వరం, కందుకూరు మండలాల్లో భూముల ధరలు పెరగడంతో అక్రమ ఆక్రమణలు రోజురోజుకు పెరుగుతున్నాయని ఆరోపణలు వస్తున్నాయి. రాజకీయ, ఆర్థిక అండతో ఫేక్ డాక్యుమెంట్లు సృష్టించి సామాన్యుల భూములను కబ్జా చేస్తున్నారని బాధిత కుటుంబాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. మంగళవారం మహేశ్వరం మండల కేంద్రంలో మీడియాతో మాట్లాడిన హైదరాబాద్‌కు చెందిన సయ్యద్ బిన్ సలామ్ బిన్ మాకాషీన్ కుటుంబ సభ్యులు అహ్మద్ బిన్ సయీద్ బిన్ మాకాషీన్ పలు సంచలన ఆరోపణలు చేశారు.

37-32 ఎకరాల భూమి వివాదం ఏమిటి:

ఆయన చెప్పిన వివరాల ప్రకారం, మహేశ్వరం మండలం మంఖాల్ గ్రామ రెవిన్యూ పరిధిలోని సర్వే నంబర్లు 448, 449, 486, 487, 488 లలో మొత్తం 37-32 ఎకరాల భూమి ఉంది. ఈ భూమిని 1984లో 1. సయ్యద్ బిన్ సలామ్ బిన్ మాకాషీన్

2. అబ్దుల్ రహీం బీన్ సలాం బా నయీమ్

3. మహమ్మద్ యూసఫ్ ఖాన్ అనే ముగ్గురు వ్యక్తులు తమ సొంత డబ్బులతో కొనుగోలు చేశారు. 1985లో పేద ముస్లిం పిల్లల చదువు కోసం ముగ్గురూ కలిసి మదర్సా ఉర్దూ స్కూల్‌ను ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి ముగ్గురు కుటుంబాలు చందాలు ఇస్తూ స్కూల్‌ను నడిపారు.

ఫేక్ అఫిడవిట్‌తో పేర్లు తొలగించారన్న ఆరోపణ:

2003లో సయ్యద్ బిన్ సలామ్ బిన్ మాకాషీన్, మహమ్మద్ యూసఫ్ ఖాన్ మరణించారని, ఆ తర్వాత 1995లో టీచర్‌గా వచ్చిన అబ్దుల్లా బిన్ అబ్దుర్ రహీం బా నయీమ్ 2006లో రెవిన్యూ అధికారులతో కుమ్మక్కై ఫేక్ అఫిడవిట్లు సృష్టించారని ఆరోపించారు. ఆ అఫిడవిట్ల ఆధారంగా మరణించిన ఇద్దరి పేర్లను రెవిన్యూ రికార్డుల నుంచి తొలగించారని, అలా తొలగించే అధికారం లేకపోయినా ఉద్దేశపూర్వకంగా చేశారని అన్నారు. 2006 నుంచి 2023 వరకు స్కూల్ ప్రశాంతంగా నడుస్తున్నట్లు చూపించి, సయ్యద్, యూసఫ్ కుటుంబాల నుంచి చందాలు తీసుకున్నారని తెలిపారు.

ట్రస్ట్, వెంచర్ పేరుతో కబ్జా:

2023లో జామియా ఐ ఇలాయాలా ట్రస్ట్ పేరుతో రాజేంద్రనగర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఫేక్ రిజిస్ట్రేషన్ చేయించారని ఆరోపించారు. తమ తండ్రి ఎప్పుడూ ట్రస్ట్‌కు భూమి రాయలేదని, రెవిన్యూ రికార్డుల్లో కూడా ట్రస్ట్ పేరు లేదని స్పష్టం చేశారు. అదే భూమిలో జెట్ కౌంటీ హైమార్క్ కాంట్రాక్షన్స్ పేరుతో వెంచర్ చేసి, గజం రూ.32,000 చొప్పున ప్లాట్లు అమ్ముతున్నారని చెప్పారు. ఈ వెంచర్‌పై కోర్టులో స్టే ఉన్నా అమ్మకాలు, నిర్మాణాలు కొనసాగిస్తున్నారని ఆరోపించారు.

స్కూల్‌ను తొలగించే కుట్ర:

గతంలో ఈ మదర్సాలో 350 నుంచి 400 మంది విద్యార్థులు ఉండేవారని, ఇప్పుడు 15 మంది కూడా లేరని అన్నారు. రిలీజియస్ పేరుతో రిజిస్ట్రేషన్ చేయించి తెరవెనుక అబ్దుల్ రహీం కుటుంబ సభ్యులు వారసుల పేరుతో భూమిని తమ పేరున రాయించుకునే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. సయ్యద్, యూసఫ్ కుటుంబాలకు స్కూల్‌తో సంబంధం లేదని ప్రచారం చేసి స్కూల్‌ను తొలగించే కుట్ర చేస్తున్నారని ఆరోపించారు.

ప్రజలకు విజ్ఞప్తి:

కోర్టు పరిధిలో ఉన్న జెట్ కౌంటీ వెంచర్‌లో ఎవరూ ప్లాట్లు కొనుగోలు చేసి ఇబ్బందులు పడవద్దని విజ్ఞప్తి చేశారు. ఫేక్ డాక్యుమెంట్లు సృష్టించిన అబ్దుల్ రహీం బీన్ సలాం బా నయీమ్ కుటుంబ సభ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

సూర్య భగవాన్ విగ్రహ ప్రతిష్ఠ

మల్కాజిగిరి ఆగస్టు 18 (ప్రజా కలం ప్రతినిధి) నేరేడ్మెట్‌లోని శ్రీ అన్నపూర్ణ సహిత శ్రీ కాశీ విశ్వనాథ దేవాలయంలో ఆగస్టు 19న సూర్య భగవాన్ విగ్రహ ఆవిష్కరణ, ప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహించనున్నారు. బుధవారం ఉదయం 7:15 గంటలకు శ్రీ శ్రీ శ్రీ విద్యాశంకర భారతి స్వామివారి చేతుల మీదుగా ఈ కార్యక్రమం ప్రారంభం కానుంది. అనంతరం ప్రత్యేక పూజలు చెయ్యనున్నారు.భక్తులు అధిక సంఖ్యలో హాజరై సూర్య భగవానుని దర్శించుకుని పూజల్లో పాల్గొనాలని ఆలయ నిర్వాహకులు కోరారు. కార్యక్రమ వివరాలతో కూడిన పాంప్లెట్లను ఇప్పటికే భక్తులకు పంపిణీ చేస్తున్నారు.

గిరిజన ఆశ్రమ పాఠశాల ఉపాధ్యాయుల సమ్మె

మెదక్ ఆగస్టు 18(ప్రజాకలం ప్రతినిధి) మెదక్ జిల్లా కలెక్టర్ కార్యాలయం దగ్గర గిరిజన ఆశ్రమ పాఠశాల ఉపాధ్యాయులు శాంతియుత సమ్మె చేపట్టారు. ఈ సమ్మె కి మద్దతుగా లంబాడి హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షులు గోపాల్ నాయక్ , సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి నరసమ్మ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా లంబాడి హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షులు గోపాల్ నాయక్ , సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి నరసమ్మలు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో మైదాన ప్రాంతంలో ఉన్న 15 జిల్లాలలో 54 గిరిజన ఆశ్రమ పాఠశాలలో 339 మంది ఉపాధ్యాయులు విద్యను బోధిస్తున్నారు. సుమారు ఈ పాఠశాలలో 22,000 మంది విద్యార్థులు చదువుతున్నారు. మెదక్ జిల్లాలో మూడు ఆశ్రమ పాఠశాలలో మహమ్మదాబాద్, కౌడిపల్లి, టేక్మాల్ లలో నడుస్తున్నవి , ప్రస్తుతం ఉపాధ్యాయులు పదివేల జీతం చెల్లిస్తున్నారు. వారి యొక్క డిమాండ్ లు ఆర్థిక శాఖలో ఉన్న ఫైల్ ను వెంటనే ఆమోదం చేయాలి. సి ఆర్ టి ఉపాధ్యాయులతో సమానమైన వేతనాన్ని కల్పించాలి వారు డిమాండ్ చేస్తున్నారు , జిల్లా కలెక్టర్, స్థానిక ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు చొరవతో వారి యొక్క సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని వారు తెలిపారు.

Corporate .Office :1-7-511/4, Gemini Colony, Near Pochamma Temple, Zamistanpur, HYDERABAD, TELANGANA, 500020 Cell: 9010972526

Printed, Published and owned by **KALAKONDA RAMAKRISHNA**, Printed at **TEJOMAI PUBLICATION**, H.No. 2-24/98/BLN Colony, IDA Uppal Medchal-Malkajgiri, Hyderabad, Telangana-50013
Published from H.No.10-1-7, Bada Bazar, Beside Pothalingaiah Temple, Azam Raod, Nizamabad,TS -503001 TELANGANA - 503001.
Editor: **KALAKONDA RAMAKRISHNA**, **PRGI.No. TELTEL/2010/33275,** Cell: 90109 72526, Email:prajakalam2010@gmail.com